Bhavya Sai
PHOTO & VIDEO FILMING
Event Photo & Videography
Best Price
Photos & Videos Delivered
with in 24 Hrs...
Press Events PRO in Vizag
CELL 9948511438

VISAKHA SAMACHARAM TELUGU DAILY: VISAKHAPATNAM
Postal Registration No. VSP / 96/ 2024 - 26.
visit: www.visakhasamacharam.com

# విశాఖ సమాచారమ్

విలేఖరులు కావలెను
రాజమండ్రి, కొవ్వూరు, చాగల్లు, నిడదవోలు, దేవరపల్లి మండలాలకు విలేకరులు కావలెను.
మేనేజర్
విశాఖ సమాచారమ్
సెల్ : 9100986584, 9553574250

RNI No.52722/90 సంపుటి : 35 సంచిక : 169 విశాఖపట్నం, 16 ఏప్రిల్ 2025 బుధవారం E-mail : vspnews@gmail.com, పేజీలు : 8 వెల : రూ.2.00

## ఎస్సీ వర్గీకరణ ఆర్డినెన్స్‌కు ఓకే

- ఏపీ కేబినెట్‌లో నిర్ణయం
- అసెంబ్లీ నిర్మాణానికి రూ.615 కోట్లు
- హైకోర్టు భవన నిర్మాణానికి రూ.786 కోట్లు
- మరిన్ని కీలక అంశాలకు ఆమోదం



**అమరావతి, విశాఖ సమాచారం:** ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన ఏపీ కేబినెట్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఎస్సీ వర్గీకరణ ముసాయిదా ఆర్డినెన్స్‌కు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. రూ.617 కోట్లతో అసెంబ్లీ, రూ.786 కోట్లతో హైకోర్టు భవన నిర్మాణాలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. నిర్మాణ పనులను ఎల్1 బిడ్డర్‌కు అప్పగించాలని నిర్ణయించింది. స్టేట్ సెంటర్ ఫర్ క్లైమేట్ ఇన్ సిటీస్ వ్యవస్థల ఏర్పాటును ఆమోదించింది. పట్టణ ప్రాంతాల్లో వరద నిర్వహణకు ప్రత్యేక వ్యవస్థలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.

### కేబినెట్ నిర్ణయాల్లో ప్రధానాంశాలు

- విశాఖలోని ఐటీహిల్ -3 పైన టీసీఎస్‌కి 21.66 ఎకరాలు, ఉరుస క్లస్టర్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కి 3.5 ఎకరాలు కేటాయింపు
- ఉరుస క్లస్టర్‌కు కాపులుప్పాడలో 56 ఎకరాల భూమి కేటాయింపు
- బలిమెల, జోలాపుట్ రిజర్వాయర్ల వద్ద చేపట్టాల్సిన హైడల్ ప్రాజెక్టులకు సంబంధించిన నిర్మాణాలపై ఒడిశా పవర్ కన్సార్టియమ్‌కు ఆమోదం.
- 30 మెగావాట్ల సామర్థ్యంతో 2 హైడల్ ప్రాజెక్టుల నిర్మాణం ...(మిగతా 2లో)

## మే 2న అమరావతికి ప్రధాని మోదీ



**అమరావతి, విశాఖ సమాచారం:** దేశ ప్రధాని నరేంద్ర మోదీ అమరావతిలో పర్యటించనున్నారు. ఆయన రాక తేదీని మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారు. మే2 న ఆయన అమరావతికి వచ్చి పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తారని వెల్లడిరచారు. మూడేళ్లలో శాశ్వత సచివాలయం, అసెంబ్లీ, హైకోర్టు, రహదారులు పూర్తి చేయాలని సీఎం తెలిపారు. ఈ మేరకు టెండర్లు పిలిచామన్నారు. ఏపీ కేబినెట్ సమావేశం ముగిసన తర్వాత ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. మోదీ రాకతో అమరావతి రాజధాని పనులు మరింత ఊపందుకోనున్నాయి.



## కొత్తగా 2,260 స్పెషల్ టీచర్ పోస్టులు

### ఉత్తర్వులు జారీచేసిన ఏపీ ప్రభుత్వం

**అమరావతి, విశాఖ సమాచారం:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రత్యేక విద్యా ఉపాధ్యాయుల నియామకానికి సంబంధించి కీలక నిర్ణయం తీసుకుంది. ఏపీలో టీచర్ పోస్టులకు సిద్ధమవుతున్న ఉద్యోగార్థులకు ప్రభుత్వం శుభవర్త చెప్పింది. 2,260 స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ పోస్టులను సృష్టిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో 1136 ఎస్జీటీలు, 1124 స్కూల్ అసిస్టెంట్ల పోస్టులు ఉన్నాయి. ఈ నిర్ణయం, ప్రత్యేక అవసరాలు ఉన్న విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడానికి దోహద పడనుంది. ఈ ఉత్తర్వుల ప్రకారం, 1136 ఎస్జీటీ (స్పెషల్ గ్రేడ్ టీచర్) పోస్టులు ప్రాథమిక స్థాయిలో భర్తీ చేస్తారు. అలాగే, 1124 మంది స్కూల్ అసిస్టెంట్ల పోస్టులను సెకండరీ స్థాయిలో నియమించేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ ప్రత్యేక ఉపాధ్యాయులు ఆటిజం, మానసిక వైకల్యం వంటి ప్రత్యేక అవసరాలు ఉన్న విద్యార్థులకు విద్యను బోధించడానికి ప్రత్యేకంగా శిక్షణ ఇస్తారు.

### నియామక ప్రక్రియ

డిస్ట్రిక్ట్ సెలక్షన్ కమిటీ ద్వారా ప్రత్యేక విద్యా ఉపాధ్యాయుల నియామకానికి సంబంధించిన నోటిఫికేషన్ త్వరలోనే విడుదల చేస్తారు. ఈ ప్రక్రియ ద్వారా, విద్యార్థుల అవసరాలను పరిగణనలోకి ...(మిగతా 2లో)

## 75వ వసంతంలోకి చంద్రబాబు

- కుటుంబంతో కలిసి విదేశాల్లో వేడుక




**అమరావతి, విశాఖ సమాచారమ్ :** ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ఈ నెల 20న 75వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్నారు. ఏప్రిల్ 20, 1950లో చిత్తూరు జిల్లా నారావారిపల్లిలో ఆయన జన్మించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, విభజిత రాష్ట్రానికి సీఎంగా ఆయన పనిచేశారు. ప్రస్తుతం నాలుగోసారి సీఎంగా ప్రజలకు సేవలు చేస్తున్నారు. 2024 ఎన్నికల్లో 164 సీట్లతో గెలిచి కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్యమంత్రి హోదాలో ఈ నెల 20న ఆయన పుట్టిన రోజు వేడుకలు ...(మిగతా 2లో)

## హెలికాప్టర్ పైలట్, కో పైలట్‌కు పోలీసుల నోటీసులు

### నేడు విచారణకు రావాలని ఆదేశం
### జగన్ రాప్తాడు పర్యటనలో టేకాఫ్ ఇష్యూ



**రాప్తాడు, విశాఖ సమాచారం:** మాజీ సీఎం జగన్ హెలికాప్టర్ టేకాఫ్ ఇష్యు ఆయన భద్రతపై అనేక అనుమానాలకు దారి తీసింది. రాప్తాడు నియోజకవర్గంలో చెలరేగిన అల్లర్లలో చనిపోయిన వైసీపీ నేతను పరామర్శించేందుకు ఇటీవల మాజీ సీఎం జగన్ పాపిరెడ్డిపల్లికి వచ్చారు. ఆ సందర్భంలో హెలికాప్టర్ టేకాఫ్‌లో కొన్ని సమస్యలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం పోలీసులను అప్రమత్తం చేసింది. దీంతో సీకే పల్లి పోలీసులు ...(మిగతా 2లో)

## అమరావతిలో మరో ఎయిర్ పోర్టు

- ఏపీ మంత్రి నారాయణ వెల్లడి



**అమరావతి, విశాఖ సమాచారం:** అమరావతిలో మరో ఎయిర్ పోర్ట్ రాబోతుందని మంత్రి నారాయణ చెప్పారు. ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడారు. రాజధాని అమరావతిలో ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు నిర్మాణానికి ప్రణాళిక రూపొందిస్తున్నామని ప్రకటించారు. భవిష్యత్తులో మంగళగిరి, విజయవాడ, గుంటూరు, తాడేపల్లి కలిసి ఓ మెగా సిటీగా మారిపోతాయని అంచనా వేశారు. అందుకే.. అమరావతి రాజధానిలో కొత్తగా మరో ఎయిర్ పోర్ట్ ఏర్పాటు చేసేందుకు సీఎం చంద్రబాబు నాయుడు నిర్ణయం తీసుకున్నారని, ఈ మేరకు ఆదేశాలు కూడా వచ్చాయన్నారు. ఈ ఎయిర్ పోర్టు కోసం ఏకంగా ఐదు వేల ఎకరాలు అవసరం అవుతాయని అంచనా వేస్తునన్నామన్నారు. ల్యాండ్ పూలింగ్ ద్వారా మరో 40 వేల ఎకరాల వరకు సమీకరించాల్సి ఉందని మంత్రి చెప్పారు. అమరావతిలో రాజధాని నిర్మాణ పనులు కూడా చక చక.. ముందుకు సాగుతున్నాయని, అమరావతిని ప్రపంచ స్థాయిలో... తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నిత్యం కృషి చేస్తున్నారని వెల్లడిరచారు.

### గత ప్రభుత్వ నిర్ణయంతోనే పనులు ఆలస్యం

గత ప్రభుత్వం రాజధాని విషయంలో మూడు ముక్కలాట ఆడిరదని మంత్రి నారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. పనులు మధ్యలో నిలిపివేసిన నాటి ప్రభుత్వం.. అప్పటి టెండర్లను కూడా రద్దు చేయకపోవడంతో న్యాయ సమస్యలు రాకుండా వాటినన్నింటిని పరిష్కరించాల్సి ...(మిగతా 2లో)

## ఈడీ ఛార్జిషీట్‌లో సోనియా, రాహుల్ పేర్లు

- నేషనల్ హెరాల్డ్' కేసులో కీలక పరిణామం



**దిల్లీ:** 'నేషనల్ హెరాల్డ్' మనీ లాండరింగ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ఛార్జిషీట్ దాఖలు చేసిన ఈడీ అందులో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ పేర్లను పేర్కొంది. ఇప్పటికే ఈ కేసుతో ముడిపడి ఉన్న ఆస్తుల స్వాధీనానికి ఈడీ నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. తాజాగా కాంగ్రెస్ ఎంపీలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీతో పాటు ఆ పార్టీ ఓవర్సీస్ యూనిట్ చీఫ్ శామ్ పిట్రోడా పేర్లను పేర్కొంటూ దిల్లీ రౌస్ అవెన్యూ కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేసింది. దీనిపై ఏప్రిల్ 25న దిల్లీ ప్రత్యేక కోర్టు విచారణ చేపట్టనున్నట్లు సమాచారం. మరోవైపు, కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీపై ఈడీ ఛార్జిషీట్ దాఖలు చేయడం ఇదే తొలిసారి. హరియాణాలో జరిగిన రియల్ ఎస్టేట్ ఒప్పందంతో ముడిపడి ఉన్న మనీలాండరింగ్ ఆరోపణలపై కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ వాద్రా భర్త, వ్యాపారవేత్త రాబర్ట్ వాద్రాను ఈడీ ప్రశ్నించిన కొన్ని గంటల వ్యవధిలోనే ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం. నేషనల్ హెరాల్డ్ ...(మిగతా 2లో)

## న్యాయస్థానాన్ని ఆశ్రయించిన విదేశీ విద్యార్థులు

- అమెరికా వీసా రద్దు వ్యవహారం



**వాషింగ్టన్ :** ఇటీవల పలు విద్యా సంస్థల్లోని విద్యార్థుల వీసాలను ట్రంప్ యంత్రాంగం రద్దు చేసిన నిర్ణయాన్ని సవాల్ చేస్తూ విదేశీ విద్యార్థులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. క్యాంపస్ ఆందోళనల్లో క్రియాశీలంగా వ్యవహరించిన అమెరికాలోని విదేశీ విద్యార్థులకు అక్కడి విదేశాంగశాఖ హెచ్చరికలు జారీ చేసిన విషయం తెలిసిందే. కేవలం ఆందోళనల్లో పాల్గొన్నవారినే కాకుండా అక్కడి దృశ్యాలను, జాతి వ్యతిరేక సందేశాలను సామాజిక మాధ్యమాల్లో షేర్ చేసిన వారిని స్వచ్ఛందంగా దేశం విడిచి వెళ్లిపోవాలంటూ తొలుత అధికారులు వారికి ఈమెయిల్స్ పంపారు. తాజాగా ట్రంప్ ...(మిగతా 2లో)



## 'ఆంధ్రా టు ఆంధ్రా అంత దూరమా?

### ఇదీ విశాఖ విమాన ప్రయాణికుల దుస్థితి : గంటా పోస్టు

**విశాఖపట్నం, విశాఖ సమాచారం :** విశాఖ నుంచి అమరావతికి చేరాలంటే చుట్టూ తిరిగి వెళ్లాల్సి రావడం బాధాకరమని టీడీపీ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. తనకు స్వయంగా ఎదురైన అనుభవాన్ని ఆయన మంగళవారం 'ఎక్స్'లో షేర్ చేసుకున్నారు. 'ఉదయం 8 గంటలకు విశాఖ ఎయిర్ పోర్టుకు వచ్చిన నేను విమానంలో హైదరాబాద్ ...(మిగతా 2లో)

## మీట్ గ్రేట్ ట్రీట్ పోస్టర్ విడుదల



**విశాఖపట్నం, విశాఖ సమాచారమ్:** సీనియర్ సిటిజన్స్ వన్డే అవుట్ ప్రోగ్రాం నిర్వహించడం కోసం మంగళవారం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో వివిధ పెన్షనర్స్ అసోసియేషన్లు కలిసి పోస్టర్ విడుదల చేశాయి. ఈ కార్యక్రమంలో ఎం జి టి నిర్వాహకుడు డాక్టర్ పీకే జోస్, కన్సర్న్ సంస్థ మేనేజింగ్ ట్రస్ట్, వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ నుంచి డాక్టర్ కె.రమాప్రభ, బిసిసి వ్యవస్థాపకులు ,పెన్షనర్స్ ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ సెక్రటరీ కె.సుధాకర్, అప్పారావు ఎమ్మార్డీ రాజు, వెంకటరమణ, బాబూ రావు, పి. నారాయణ మూర్తి, ఎ . మణి, కె .సుశీల, పి .సతీష్ పాల్గొన్నారు. 22 ఏప్రిల్, 2025 న ఉదయం 9:00 నుండి సాయంత్రం 6:00 వరకు ఒక పూర్తి రోజు కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది దీనిలో వివిధ రకాల వినోద కార్యక్రమాలతో పాటు సీనియర్ సిటిజన్స్ అందరూ కూడా కలుసుకొని మాట్లాడుకొని వాళ్ళ వ్యక్తిగత నైపుణ్యాల్ని అభిరుచిల్ని ప్రదర్శించే అవకాశం ఉంది దీంతోపాటుగా సర్దార్ సరదా గేమ్స్ సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శన కూడా జరుగుతుంది. అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం లో ఈ కార్యక్రమం ...(మిగతా 2లో)



## హజ్ పోర్టల్ రీ ఓపెన్..

- 10 వేల మందికి అవకాశం

**దిల్లీ:** భారతీయ యాత్రికుల సౌకర్యం కోసం సౌదీ అరేబియా హజ్ పోర్టల్‌ను మరోసారి తెరిచింది. దాదాపు 10,000 మంది భారతీయులకు అవకాశం కల్పించేందుకు హజ్ పోర్టల్‌ను కంబ్కెన్డ్ హజ్ గ్రూప్ ఆపరేటర్స్ (సీహెచ్‌జీవో) కోసం తెరిచినట్లు కేంద్ర మైనార్టీ వ్యవహారాల శాఖ మంగళవారం వెల్లడిరచింది. సీహెచ్‌జీవో ఎటువంటి జాప్యం లేకుండా వెంటనే తమ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సూచించింది. పలుమార్లు హెచ్చరించినా.. ఇటీవల భారత్‌లోని వారు మినా క్యాంప్‌లు, బస, ప్రయాణ ఏర్పాట్లకు అవసరమైన కాంట్రాక్టులను పూర్తిచేయడంలో విఫలమయ్యారు. ఈ పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని.. సౌదీ హజ్ మంత్రిత్వశాఖతో చర్చలు జరిపింది. దీంతో ఆ శాఖ హజ్ పోర్టల్‌లో 10,000 మందికి అవకాశం ...(మిగతా 2లో)

# పోలమాంబ అమ్మవారి భక్తులకు ప్రసాదం పంపిణీ

**విశాఖపట్నం, విశాఖ సమాచారం:** శ్రీ శ్రీ శ్రీ కరకచెట్టు పోలమాంబ అమ్మవారి జాతర మహోత్సవం లో భాగంగా ఎం వి ప్రణవ్ గోపాల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో భక్తులకు ఉచిత ప్రసాదం భారీ ఎత్తున పంపిణీ చేశారు. ఆలయం సమీపంలో మంగళవారం ఉదయం ఉచిత ప్రసాద వితరణ కార్యక్రమాన్ని శాసన సభ్యులు వెలగపూడి రామకృష్ణ బాబు , వి ఎం ఆర్ డి ఎ చైర్మన్ శఎం వి ప్రణవ్ గోపాల్ , టీడీపీ యువ నాయకుడు వెలగపూడి ప్రతాప్ రుద్ర తదితరులు ప్రారంభించారు. పెద్ద ఎత్తున అమ్మవారి ఆలయానికి వచ్చిన భక్తులకు చక్రపొంగలి, పులిహోర వంటివి అందించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సుమారు 8 వేల మందికి పైగా భక్తులకు ఈ ఉచిత ప్రసాదం పంపిణీ చేశారు. భక్తులకు పోలమాంబ అమ్మవారి ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు.



# హనుమాన్ శోభాయాత్రకు ఏర్పాట్లు




**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్).** ఈనెల ఏప్రిల్ 26వ తేదీ మధ్యాహ్నం మూడు గంటలకు సుంకర మెట్టు సత్యనారాయణ స్వామి దేవాలయం జంక్షన్ నుండి కొత్తూరు జంక్షన్ వద్ద హనుమాన్ దేవాలయం వరకు భారీ ఎత్తున హిందువులు జైశ్రీరామ్ అనే నామస్మరణతో అనకాపల్లి జిల్లా నలుమూలల నుంచి ఈ యాత్రలో పాల్గొని, ఆరు గంటలకి శారదా నది వద్ద గల వినాయక ఘాట్ వద్ద హనుమాన్ హారతితో ఈ కార్యక్రమం ముగుస్తుందని శారదా నది వద్ద వినాయక ఘాట్ ప్రాంతాలను శుభ్రం చేసి హనుమాన్ హారతికి వేల సంఖ్యలో భక్తులు వచ్చి పాల్గొనే కార్యక్రమాన్ని విశ్వహిందూ పరిషత్ రాష్ట్రీయ స్వయంసేవక్, వినాయక ఉత్సవ నిమజ్జనొత్సవ కమిటీ, మరియు బజరంగ్ దళ్ హిందూ సంస్థల ప్రతినిధులు పర్యవేక్షించారు. కార్యక్రమంలో పాల్గొని ఏర్పాట్లను పర్యవేక్షించిరి. ఈ కార్యక్రమంలో రాష్ట్రీయ స్వయంసేవక్ ద్వారప్ రెడ్డి. పరమేశ్వరరావు వినాయక ఉత్సవ నిమజ్జనోత్సవ కమిటీ చైర్మన్ ఆడారి కుమారస్వామి నడిపూరి అనిల్ కుమార్ బజరంగ్ దళ్, ఏ సి హెచ్ బాబు మావూరి. జెపి కొండలరావు, కొణతాల అప్పలరాజు ఆడారి రాజు కొణతాల హరినాథ్ బాబు డివి రాజేష్ ఆళ్ల గౌతమ్ మహదేవ్ కత్తిరి రమణ గేదెల స్వరూప్ వడగూరి.హరి, పూజ్యము నాగబాబు, పి సోమశేఖర్ కర్రి భరత్ తదితర హిందూ సంస్థల ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.




# మనీలాండరింగ్ కేసులో ఈడీ సమన్లు

## విచారణకు హాజరైన రాబర్ట్ వాద్రా



**ఢిల్లీ :** కాంగ్రెస్ అగ్రనాయకురాలు, ఎంపీ ప్రియాంకా గాంధీ వాద్రా భర్త రాబర్ట్ వాద్రా మంగళవారం ఈడీ విచారణకు హాజరయ్యారు. హరియాణాలోని ఓ భూ ఒప్పందానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఈడీ ఆయనకు సమన్లు జారీ చేసింది. ఈసందర్భంగా ఆయన తన ఇంటినుంచి నడుచుకుంటూ ఈడీ కార్యాలయానికి వెళ్లారు.

ఈ కేసుకు సంబంధించి ఈనెల 8న తొలిసారి ఈడీ సమన్లు పంపించింది. అయితే వాటిని రాబర్ట్ పట్టించుకోలేదు. ఈక్రమంలోనే మంగళవారం మరోసారి నోటీసులు జారీ చేస్తూ.. తమ ముందు హాజరుకావాలని ఆదేశించింది. నోటీసులు అందిన అనంతరం వాద్రా తన నివాసం ఈడీ కార్యాలయానికి నడుచుకుంటూ వెళ్లారు. ఈక్రమంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఇది బీజేపీ రాజకీయ ప్రతీకార చర్యగా అభివర్ణించారు. 'రాహుల్ గాంధీని పార్లమెంటులో మాట్లాడనివ్వకుండా అడ్డుకున్నారు. నేను ప్రజల పక్షాన గొంతు వినిపించిన ప్రతీసారి.. వాళ్లు నన్ను అణచివేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ కేసులో ఏమీ లేదు. అధికారులు అడిగే ప్రశ్నలకు సమాధానం ఇస్తాను. ఇదంతా రాజకీయ ప్రతీకార చర్య. ప్రజలు నేను రాజకీయాల్లోకి రావాలని కోరుకుంటున్నారు. ఈనేపథ్యంలో పాత సమస్యలను తెరపైకి తెస్తున్నారు. గత 20 ఏళ్లుగా నాకు 15 సమన్లు అందాయి' అని రాబర్ట్ పేర్కొన్నారు.

ఈడీ ప్రకారం.. వాద్రా కంపెనీ 2008 ఫిబ్రవరిలో గుర్గావ్‌లోని షికోపూర్‌లో 3.5 ఎకరాల స్థలాన్ని ఓంకారేశ్వర్ ప్రాపర్టీ నుంచి కొనుగోలు చేసింది. దీని విలువ రూ.7.5 కోట్లు. ఆ తర్వాత వాద్రా కంపెనీ ఆ భూమిని రియల్ ఎస్టేట్ కంపెనీ అయిన డీఎల్ఎఫ్‌కు రూ.58 కోట్లకు విక్రయించింది. డీఎల్ఎఫ్‌కు రూ.58 కోట్ల భారీ లాభంతో విక్రయించడంతో మనీలాండరింగ్ ఆరోపణలు వచ్చాయి. ఈనేపథ్యంలో ఈడీ విచారణ జరుపుతోంది.

# సూరంపూడి వీరభద్రరావుకు కేపీ ఈశ్వర్ స్మారక అవార్డు



**ఏలూరు, విశాఖ సమాచారమ్ :** విశాఖ సమాచారమ్ చీఫ్ ఎడిటర్, సీనియర్ పాత్రికేయులు సూరంపూడి వీరభద్రరావుకు కేపీ ఈశ్వర్ స్మారక పురస్కారాన్ని అందజేశారు. ఏలూరులో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య గౌరవ సలహాదారు దివంగత కేపీ ఈశ్వర్ స్మారక అవార్డును ఉగాది పురస్కారంగా అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సమాఖ్య నాయకుడు వడ్డాది ఉదయకుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రభాకర్ జి.వి.ఎస. తదితరులు పాల్గొన్నారు.

# విమానాశ్రయాలకు దీటుగా సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నిర్మాణ పనులు

**హైదరాబాద్:** ఏప్రిల్ 15 సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ లో త్వరలో జరగనున్న భారీ పునర్నిర్మాణ పనుల దృష్ట్యా ప్రయాణికులకు అసౌకర్యం కలుగునుంది, విమానాశ్రయాలకు దీటుగా సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఆధునీకరణ నిర్మాణ పనులు చేపట్టనుంది. దీంతో రైల్వే ఉన్నతాధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు 100 రోజుల పాటు స్టేషన్ పరిధిలోని మొత్తం ఆరు ప్లాట్‌ఫామ్‌లను మూసి వేస్తున్నట్లుగా ప్రకటించారు. దీంతో దాదాపు 120 రైళ్లను చర్లపల్లి రైల్వే జంక్షన్ కాచి గూడ, నాంపల్లి, స్టేషన్లకు దారి మళ్లించనున్నారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పునర్నిర్మాణం లో భాగంగా భారీ స్కై కాంకోర్స్ లిఫ్టులు ఎస్కలేటర్లు,ఫుట్‌ఓవర్ బ్రిడ్జ్‌లను నిర్మించనున్నా రు. ఇందులో 110 మీటర్ల వెడల్పు, 120 మీటర్ల పొడవుతో నిర్మించనున్న భారీ స్కై కాంకోర్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలువనుంది. అందులో రిటైల్ ఔట్‌లెట్స్, రెస్టారెంట్లు, కియోస్క్‌లు ఏర్పాటు చేయనున్నారు. ముందుగా ప్లాట్‌ఫాం నెం.2-3, 4-5 లలో దాదాపు 50 రోజుల పాటు పనులు కొనసాగనున్నా యి. అక్కడ పనులు పూర్తి అయిన వెంటనే నాలుగు ప్లాట్‌ఫామ్స్‌ను ప్రారంభిస్తా రు.అనంతరం ప్లాట్‌ఫామ్ నంబర్ 10 వైపు పనులు ప్రారంభిస్తారు.



# నేడు జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం

## -జెడ్పీ సీఈవో నారాయణమూర్తి

**విశాఖపట్నం, విశాఖ సమాచారం :** విశాఖ జిల్లా ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం ఉదయం 10.30 గంటలకు జెడ్పీ చైర్ పర్సన్ జె. సుభద్ర అధ్యక్షతన జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరుగనున్నదని జెడ్పీ సీఈవో పి.నారాయణమూర్తి తెలిపారు. ఈ సర్వసభ్య సమావేశానికి గౌరవ సభ్యులు, అహ్వానితులు హాజరు కావాల్సిందిగా కోరారు. సమావేశానికి అన్ని శాఖల జిల్లా అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలని కోరారు.

# కొత్తగా 2,260 స్పెషల్ టీచర్ పోస్టులు

(మొదటి పేజీ తరువాయి)

తీసుకుని, అర్హత కలిగిన అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఈ నియామక ప్రక్రియలో అభ్యర్థుల విద్యా అర్హతలు, అనుభవం, ప్రత్యేక అవసరాలపై అవగాహన వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుంటారు. ఈ ఉపాధ్యాయులు, విద్యార్థుల వ్యక్తిగత అవసరాలను అర్థం చేసుకుని, వారికి అనుకూలమైన పాఠ్యక్రమాలను రూపొందిస్తారు. వారు విద్యార్థుల సామర్థ్యాలను పెంపొందించడంలో, వారి నైపుణ్యాలను అభివృద్ధి చేయడంలో, సమాజంలో సమానంగా ఉండేందుకు గల అవసరమైన నైపుణ్యాలను అందించడంలో కీలక పాత్ర పోషిస్తారు. ప్రత్యేక విద్యా ఉపాధ్యాయుల నియామకం, రాష్ట్రంలో విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి దోహదపడనుంది.

# హెలికాప్టర్ పైలట్, కో పైలట్‌కు పోలీసుల నోటీసులు

(మొదటి పేజీ తరువాయి)

కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు. ఈ కేసులో భాగంగా.. హెలికాప్టర్ పైలట్, కో పైలట్ లకు 161 సీఆర్‌పీసీ కింద నోటీసులు ఇచ్చారు. బుధవారం విచారణకు హాజరు కావాలని చిప్సన్ ఏవియేషన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు, పైలట్లకు ఇచ్చిన నోటీసుల్లో పేర్కొన్నారు. విండ్ షీల్డ్ దెబ్బతింటే హెలికాప్టర్‌ను ఏ విధంగా టేకాఫ్ చేశారని.. డెస్టినేషన్ పాయింట్‌కు వెళ్లకుండా హెలికాప్టర్‌ను ఎక్కడికి తీసుకెళ్లారనే కోణంలో పోలీసులు పైలట్, కో-పైలట్ లను విచారించనున్నారు. అలాగే కుంటిమద్ది హెలిపాడ్‌లో ఏం జరిగిందన్న దానిపై వివరణ ఇవ్వాలంటూ పైలట్ అనిల్ కుమార్‌తో పాటు కో పైలట్ శ్రయాజ్ జైన్‌కు నోటీసులు జారీ చేశారు. స్థానిక అధికారులకు కనీస సమాచారం ఇవ్వకుండా ఏ విధంగా టేకాఫ్ చేశారో వివరణ ఇవ్వాలని నోటీసుల్లో పేర్కొన్నారు.

# మీట్ గ్రేట్ ట్రీట్ పోస్టర్ విడుదల

(మొదటి పేజీ తరువాయి)

జరుగుతుంది. సీనియర్ సిటిజన్ల కోసం వినోదం, సహవాసం మరియు స్నేహాన్ని పెంపొందించడానికి ఒక రోజు.

**CONCERN ఛారిటబుల్ ట్రస్ట్ & వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్**

అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం సహకారంతో నిర్వహణ జరుగుతున్నది. గ్రూప్ ఈవెంట్‌లు, వ్యక్తిగత ఈవెంట్స్ ఉంటాయి. పజిల్స్ & జోకులు, బాడీ & మైండ్ గేమ్స్, బ్రెయిన్ జిమ్ వ్యాయామం మొ,,తో పాటు ఇతర అనేక ఆకర్షణలు ఇందులో ఉన్నాయి.

రిజిస్ట్రేషన్ ముందుగా చేసుకోవాలి. ఇందులో అల్పాహారం, భోజనం, టీ / కాఫీ & స్నాక్స్, పోటీ బహుమతులు, లక్కీ డిప్, ఆశ్చర్యకరమైన బహుమతులు మొదలైనవి ఉంటాయి. వివరాలు కోసం 9440156638, 9492348428, 9393949345

ఇట్లు - కె. రమాప్రభ

# ఎస్సీ వర్గీకరణ ఆర్డినెన్స్‌కు ఓకే

(మొదటి పేజీ తరువాయి)

కోసం జలవనరుల శాఖ చేసిన ప్రతిపాదనలను కేబినెట్ ఆమోదం

- వివిధ ప్రాంతాల్లో పవన విద్యుత్, సౌర విద్యుత్ ప్లాట్ల ఏర్పాటుకు ఆమోదం.

**జగన్‌పై సీఎం మండిపాటు**

కులమతాలను వైఎస్ జగన్ రెచ్చగొడుతున్నాడని చంద్రబాబు మండిపడ్డారు. ఎస్సీ గోశాల, పాస్టర్ ప్రవీణ్, వక్ఫ్ బిల్లుపై మతాలను రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. మంత్రివర్గ సమావేశం అనంతరం వివిధ అంశాలపై ఆయన మంత్రులతో చర్చించారు. జగన్ వైఖరి ఎలా ఉందో కళ్ళ ముందు కనిపిస్తోందని సీఎం అన్నారు. కుట్రలను సమర్థంగా తిప్పికొడుతూనే ప్రజలను చైతన్య పరచాలని చంద్రబాబు సూచించారు. అధికారుల అవినీతిపై తరచూ చర్చ జరుగుతుండడాన్ని సీఎం ప్రస్తావించారు. రాజకీయంగా అంతా బాగున్నా అధికారుల స్థాయిలో ఈ తరహా చర్చలు సరికాదని ఆయన హితవు పలికారు. ఏ శాఖ పరిధిలో మంత్రులు ఆ శాఖ అంశాలపై పూర్తి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బ్యూరోక్రసీలో అవినీతిపై ఈ మధ్య ఎక్కువగా చర్చకు వచ్చిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. ఇన్చార్జ్ మంత్రుల పర్యటనల్లో మూడు పార్టీల నేతల భాగస్వామ్యం ఉండాలన్నారు. రెవెన్యూ సంబంధిత అంశాలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. రెవెన్యూ సమస్యల్లో పోలీసుల జోక్యం అంశాలను పరిష్కరించాలన్నారు. సూర్యకర్ పథకం అమలు మరింత వేగం చేయాలని విషయ నిర్దేశం చేశారు. సీఎంగా నా తొలి ప్రయాణం మొదలు పెట్టినప్పుడు హైదరాబాదు రెండో స్థానంలో ఉన్నట్లు గుర్తుందన్నారు. నేడు హైదరాబాద్ అన్ని రంగాల్లో దేశంలోనే నంబర్ వన్ నగరంగా ఉందని తెలిపారు. వృద్ధి రేటులో ఏపీ నేడు రెండో స్థానంలో ఉండటం నా ముందు ఉన్న కొత్త సవాలు అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. సవాలును అవకాశంగా భావిస్తున్నా.. మరింత కష్టపడి పని చేస్తానని చెప్పారు.

# 75వ వసంతంలోకి చంద్రబాబు

(మొదటి పేజీ తరువాయి)

జరుపుకోనున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా వేడుకలు నిర్వహించాలని టీడీపీ శ్రేణులు ఏర్పాట్లు చేస్తున్నాయి. సీఎం చంద్రబాబు నాయుడు మాత్రం తన కుటుంబ సభ్యులతో కలిసి విదేశాలకు వెళ్తున్నారు. ఈ నెల 17వ తేదీనే ఆయన విదేశాలకు వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. తన వజ్రోత్సవ జన్మదినోత్సవాన్ని అక్కడే జరుపుకోనున్నారు. ఈ మేరకు అధికారికంగా ప్రకటించారు.

# ఈడీ ఛార్జిషీట్‌లో సోనియా, రాహుల్ పేర్లు

(మొదటి పేజీ తరువాయి)

పత్రికకు సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీని ఈడీ అధికారులు గతంలో పలుమార్లు విచారించిన విషయం తెలిసిందే. విదేశీ నిధులతో నేషనల్ హెరాల్డ్ పత్రికను పెంచి పోషించారన్న ఫిర్యాదుల మేరకు ఈడీ, సీబీఐ దర్యాప్తు చేశాయి. సీబీఐ విచారణ మధ్యలోనే నిలిచినప్పటికీ.. ఈడీ దర్యాప్తు మాత్రం కొనసాగుతోంది. ఇటీవల ఈ కేసులో 2023, నవంబరులో జప్తు చేసిన అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ (ఏజేఎల్)కు చెందిన రూ.661 కోట్ల విలువైన ఆస్తుల స్వాధీనానికి చర్యలు ప్రారంభించింది. ఇందులో భాగంగా నోటీసులు జారీ చేసింది. ఆయా ఆస్తుల్లో ఉన్న వారు ఖాళీ చేయాలని పేర్కొంది. అద్దెకు ఉంటున్న వారు ఇక నుంచి తమకే ఆ మొత్తాన్ని చెల్లించాలని తెలిపింది. అక్రమ చలామణి నిరోధక చట్టంలోని సెక్షన్ (8) నిబంధన 5(1) ప్రకారం జప్తు చేసిన ఆస్తులను స్వాధీనం చేసుకొనే ప్రక్రియను చేస్తున్నామని తెలిపింది. ఆస్తులున్న ప్రాంతాల్లో (దిల్లీ, ముంబయి, లఖ్‌నవూ) భవనాలకు నోటీసులు అంటించినట్లు వెల్లడించింది. తాజాగా దిల్లీ ప్రత్యేక కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేసిన ఈడీ.. తదుపరి విచారణను కొనసాగిస్తున్నట్లు తెలిపింది.

# రాష్ట్రవ్యాప్తంగా ప్రతి పేదవాడికి సొంత ఇల్లు కల సాకారం చేయడమే సీఎం లక్ష్యం

- రాష్ట్ర వ్యాప్తంగా 5,98710 మందికి గృహాలు మంజూరు
- టీడీపీలో నిబద్దతతో గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయిలో గుర్తింపు
- రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు



**బుచ్చయ్యపేట, (విశాఖ సమాచారమ్):** కూటమి ప్రభుత్వం హయాంలోలో రాష్ట్ర వ్యాప్తంగా 5,98710 మంది కి గృహాలు మంజూరు చేసినట్లు రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు తెలిపారు. మంగళవారం వడ్డాది లో మీడియా మిత్రులుతో కలసి ఇష్టగోష్టి సమావేశం ఏర్పాటు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 5,98,710 మందికి ఇళ్లు మంజూరు చేసినట్లు తాతయ్య బాబు తెలిపారు. ఎస్సీ 1,57,383 ఎస్టీ 45,766 బీసీ 3,73,204 మందికి లబ్ధి చేకూరుతుందన్నారు. బీసీ, ఎస్సీలకు అదనపు రూ.50వేలు చొప్పున, ఎస్టీలకు రూ.75 వేల చొప్పున ఇస్తామన్నారు. గృహ నిర్మాణాల కోసం మొత్తంగా రూ.3,219 కోట్లు అదనంగా ఇస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి చెందుతుంది అన్నారు. రూ. 3,819 కోట్లు అదనంగా ఇస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఒక సామాన్య రైతు కుటుంబం లో జన్మించిన నేను మొదట నుండి టీడీపీ పార్టీ ని నమ్ముకొని గ్రామ వార్డు మెంబర్ గా, సర్పంచ్, ఎంపీపీ, పార్టీ కష్టకాలం లో 5 ఏళ్ళు చోడవరం నియోజకవర్గం టీడీపీ ఇంచార్జ్ గా, అనకాపల్లి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గా, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గా నా అభివృద్ధి, ఎదుగుదల కు సహకరించిన కార్యకర్తలు, నాయకులు, పాత్రికేయులు కృతజ్ఞతలు తెలుపు తున్నానని అన్నారు.

# 'ఆంధ్రా టు ఆంధ్రా అంత దూరమా?

(మొదటి పేజీ తరువాయి)

విమానాశ్రయానికి చేరి అక్కడి నుంచి విజయవాడ విమానం క్యాచ్ చేసి గన్నవరంలో దిగేసరికి మధ్యాహ్నం ఒంటిగంట అయ్యింది. సీఎం చంద్రబాబుతో సాయంత్రం సమావేశం కావడానికి విశాఖ నుంచి బయల్దేరిన సీఐఐ, ఫిక్కీ వంటి ట్రేడ్ ప్రతినిధులు సైతం నాలాగే హైదరాబాద్ మీదుగా విజయవాడకు చేరుకున్నారు. విశాఖ-విజయవాడ మధ్య ఉదయం వేళల్లో నడిచే రెండు విమానాలు రద్దు చేయడంతో ఈ పరిస్థితి తలెత్తింది. దురదృష్టవశాత్తు ఈరోజు మంగళవారం కావడంతో వందేభారత్ రైలు కూడా లేకపోవడంతో రెండు విమానాలు మారి విజయవాడ చేరాల్సి వచ్చింది. ఇదీ విశాఖ విమాన ప్రయాణికుల దుస్థితి" అని పేర్కొన్నారు. అలాగే, తన ట్వీట్‌ను సీఎం చంద్రబాబు, కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు, మంత్రి నారా లోకేశ్‌లకు ట్యాగ్ చేశారు. దీంతో పాటు తాను రెండు విమానాల్లో ప్రయాణించేందుకు తీసుకున్న టిక్కెట్లను సైతం గంటా షేర్ చేశారు.

# న్యాయస్థానాన్ని ఆశ్రయించిన విదేశీ విద్యార్థులు

(మొదటి పేజీ తరువాయి)

యంత్రాంగం పలు యూనివర్సిటీలలోని విద్యార్థుల వీసాలను రద్దు చేసింది. దీంతో అక్కడి స్కాలర్లకు బహిష్కరణ ముప్పు పొంచి ఉంది. విదేశాంగ శాఖ తీసుకున్న ఈ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ విదేశీ విద్యార్థులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. అకస్మాత్తుగా వీసాలు రద్దు చేయడంతో తమ చదువులు కొనసాగించలేక పోతున్నామని.. తమ భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. హార్వర్డ్, స్టాన్‌ఫోర్డ్ వంటి ప్రైవేట్ విశ్వవిద్యాలయాలు సహా మేరీల్యాండ్, ఒహియో స్టేట్ వంటి ప్రఖ్యాత ప్రభుత్వ విశ్వవిద్యాలయాలలోని విద్యనభ్యసిస్తున్న విదేశీ విద్యార్థులు వీరిలో ఉన్నారు. చట్టబద్ధమైన పత్రాలు లేని విద్యార్థులను, హమాస్ అనుకూల ఉగ్రవాద గ్రూపులకు మద్దతిస్తున్న విదేశీ విద్యార్థులను దేశం నుంచి బహిష్కరించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పలుమార్లు పేర్కొన్నారు. కాగా నిరసన కార్యక్రమాలలో పాల్గొనని విద్యార్థుల వీసాలు కూడా రద్దయినట్లు కళాశాలలు పేర్కొంటున్నాయి. కొందరు విద్యార్థులు ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడినందుకు వీసా రద్దు చేసినట్లు చెప్తుండగా..మరికొందరి విషయంలో అధికారులు సరైన కారణాలు కూడా తెలియజేయట్లేదని వారు కోర్టుకు విన్నవించారు. ఇటువంటి కారణాలతో తమ వీసాలు రద్దు చేసే అధికారం ప్రభుత్వానికి లేదని వాదించారు.

# హజ్ పోర్టల్ రీ ఓపెన్..

(మొదటి పేజీ తరువాయి)

కల్పిస్తూ తిరిగి తెరిచేందుకు అంగీకరించింది. అంతకుముందు మినాలో ప్రైవేటు ఆపరేటర్లకు కేటాయించిన జోన్లను రద్దు చేస్తూ సౌదీ ప్రభుత్వం నిర్ణయం తీసుకొంది. దీంతో దాదాపు 52,000 మంది భారతీయ యాత్రికుల పరిస్థితి గందరగోళంలో పడిరది. ఏటా భారత్‌కు కేటాయించిన కోటాలో 70 శాతం మందిని హజ్ కమిటీ ద్వారా, మిగిలిన 30 శాతం మందిని హజ్‌గ్రూప్ ఆర్గనైజర్స్ ద్వారా పంపిస్తారు. 2025కు గాను భారత్‌కు 1.75 లక్షల కోటాను సౌదీ కేటాయించింది. గత వారం కేంద్ర మైనార్టీ శాఖా మంత్రి చంద్రశేఖర్ కుమార్ జెడ్డాను సందర్శించి హజ్ యాత్ర ఏర్పాట్లను పరిశీలించారు. ఈ ఏడాది జూన్ 4, 9 తేదీల్లో హజ్‌ను నిర్వహించవచ్చని చెబుతున్నారు. చంద్ర దర్శనం ఆధారంగా జిల్-హజ్ నెల మొదలవుతుంది. ఇది ఇస్లామిక్ క్యాలెండర్‌లో చివరిది.

# అమరావతిలో మరో ఎయిర్ పోర్టు

(మొదటి పేజీ తరువాయి)

వచ్చింది. దీనికోసం 8 నెలల సమయం పట్టిందన్నారు. మొత్తం 68 పనులకు సంబంధించి 42360 కోట్ల విలువైన పనులకు టెండర్లు పూర్తయ్యాయి, ఈ పనులన్నీ ఇప్పటికే ప్రారంభం అయ్యాయన్నారు. ఒక నిర్దిష్ట కాలపరిమితితో పనులు పూర్తి చేసేలా ముందుకెళ్తున్నామన్నారు. ఏడాదిన్నరలో ట్రంక్ రోడ్లు, రెండున్నరేళ్లలో లేఅవుట్ రోడ్లు, మూడేళ్లలో ఐకానిక్ భవనాలు పూర్తి చేస్తామని మంత్రి చెప్పారు.

# ఉద్దండ పురంలో ఘనంగా అయ్యప్ప స్వామి విషు వేడుకలు



**నక్కపల్లి, (విశాఖ సమాచారం) :** కేరళ రాష్ట్రంలో విషు వేడుకలను పురస్కరించుకుని సంవత్సరానికి ఒకసారి పూర్తి అలంకరణ, ఆచారాలు ప్రసాదాలతో స్వామి వారు భక్తులకు దర్శనమిస్తారు. ఈ విషు ఉత్సవ వేడుకలను పురస్కరించుకుని కేరళ రాష్ట్రంలో సాంప్రదాయంగా నియమ నిష్ఠలతో ఎలాగైతే స్వామివారి పూజా కార్యక్రమం నిర్వహిస్తారో, ఇక్కడ నక్కపల్లి మండలం ఉద్దండపురం గ్రామంలో కూడా చుట్టుపక్కల ఏ గ్రామంలోని చేయనటువంటి విధంగా ఈ ఉద్దండ పురం గ్రామంలో ప్రతి సంవత్సరం ఆనవాయితీగా జరుపుతున్న అయ్యప్ప స్వామి విషు వేడుకలను అత్యధిక ఘనంగా భక్తిశ్రద్ధలతో సోమవారం నిర్వహించారు. ఏప్రిల్ 14న జరిగే పవిత్ర విషు పూజల ఆచారాలు కోసం శబరిమల ఆలయ ద్వారాలు తెరిచి ఉంటాయని, ఈ కాలంలో దేవాలయ తలుపులను 8 నుండి 10 రోజుల వరకు తెరిచి ఉంచుతారని. విషు కు ముందు రోజు ఆలయ ద్వారాలు తెరవబడతాయి అయ్యప్పకు ప్రత్యేకమైన భక్తిపూర్వక ఆచారాలు నిర్వహిస్తారు అని తెలిపారు. పవిత్రమైన పతినెట్టాంపడి 18 మెట్లు సమీపంలో, ఉపదేవతల ఆలయాల్లో కూడా దీపాలు వెలిగించడం ద్వారా వాటి ద్వారాలను తెరుస్తారు అని తెలిపారు. విషు ముందురోజున, సాధారణ పూజలు ఆచారాలు పూర్తయిన తరువాత, అయ్యప్ప స్వామికి కాణి శుభ వస్తువులు తయారీ ప్రారంభమవుతుంది. అదనంగా, నాణేలతో నిండిన వెండిపాత్రను కూడా ఉంచుతారని. ఈ ఏర్పాట్ల తర్వాత, ఆలయ తలుపులను వైభవంగా మూసివేస్తారు. తిరిగి ఉదయం మూడు గంటలకు ప్రధాన పూజారి ఆలయ తలుపులను తిరిగి తెరిచి, గర్భగుడిలో దీపాలను వెలిగించి, శ్రీ అయ్యప్ప స్వామికి మొదటి పూజను ప్రారంభిస్తారు అని. నాలుగు గంటలకి, వేలాది భక్తులు ఈ పవిత్ర దృశ్యాన్ని తిలకించి, దోసకాయలు, పువ్వులు, పండ్లు, ధాన్యాల రూపంలో దివ్య ఆశీర్వాదాలను పొందే భాగ్యం పొందుతారు అని అన్నారు. అంతటి మహా విశిష్టతమైన రోజు మన ఉద్దండపురం గ్రామంలో నిర్వహించడం అంటే గ్రామానకే కాదు గ్రామంలో ఉన్న ప్రజలందరికీ కూడా మంచి జరుగుతుందని అన్నారు. అనంతరం స్వామివారికి భక్తిశ్రద్ధలతో పంచామృత అభిషేకాలతో పూజా కార్యక్రమాలు చేశారు. ఈ సందర్భంగా భారీగా అయ్యప్ప స్వామి అన్న ప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించి వచ్చిన భక్తులందరిని స్వామివారి అన్న ప్రసాదం స్వీకరించి వెళ్లాలని అయ్యప్ప స్వామి సంఘ చైర్మన్ వీరం రెడ్డి రమేష్, పాలూరి చక్ర రావు, కమిటీ సభ్యులు కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న, గ్రామ సర్పంచ్ పొడగట్ల వెంకటేశ్వరరావు, ఎంపిటిసి బచ్చల రాజు, తదితర నాయకులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## ఆ తెల్లవారుజామున ఏం జరిగింది..?



**గాజువాక, విశాఖ సమాచారమ్ :** గాజువాక బీసీరోడ్డు వాంబేకాలనీ నడిరోడ్డుపై సోమవారం తెల్లవారుజామున ఓ వ్యక్తి రక్తం కారుతూ పడి ఉన్నట్లు గాజువాక పోలీసులకు సమాచారం అందింది. రాత్రి విధులు నిర్వహిస్తున్న సీఐ పార్థసారథి హుటాహుటిన సంఘటన ప్రదేశానికి చేరుకొని రక్తస్రావంతో రొప్పుతున్న వ్యక్తిని గుర్తించారు. వెంటనే 108కు సమాచారం ఇవ్వగా సిబ్బంది వచ్చి కేజీహెచ్‌కు తరలించారు. స్థానికంగా ఆరా తీస్తే సదరు వ్యక్తి వివరాలేవీ తెలియరాలేదు. ఎవరో కర్రలతో కొట్టడం వల్ల గాయాలైనట్లు పోలీసులు భావిస్తున్నారు. ఎవరైనా దాడి చేశారా? లేక కక్షకొద్దీ కొట్టి గాయాలతో తీసుకొచ్చి రోడ్డు పక్కన పడేశారా? అన్నది తేలడం లేదు. గాజువాక పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## ఇంటర్ విద్యార్థిని బలవన్మరణం

**మాధవధార, విశాఖ సమాచారమ్ :** ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఓ సబ్జెక్టు తప్పడంతో మనస్తాపం చెంది విద్యార్థిని మృతి చెందిన ఘటన కంచరపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. రెడ్డి కంచరపాలెంలో నివాసముంటున్న విద్యార్థిని(16) ప్రభుత్వ మహిళా కళాశాలలో ఇంటర్మీడియట్(బైపీసీ) ప్రథమ సంవత్సరం చదువుతోంది. తండ్రి కుటుంబాన్ని వదిలేసి దూరంగా ఉంటున్నాడు. తల్లి ఒప్పంద కార్మికురాలిగా పని చేసుకుంటూ ఇద్దరు పిల్లలు(కుమార్తె, కుమారుడు)ను చదివిస్తోంది. శనివారం వెలువడిన ఇంటర్ ఫలితాల్లో బాలిక జువాలజీ సబ్జెక్టులో తప్పడంతో తీవ్ర మనస్తాపానికి గురయింది. బెటర్‌మెంట్ రాసుకుంటే పాసవుతావని కుటుంబ సభ్యులు, స్నేహితులు నచ్చజెప్పారు. సోమవారం ఉదయం తల్లి విధులకు వెళ్లడంతో గదిలో ఉరేసుకుంది. సోదరుడు ట్యూషన్‌కి వెళ్లి వచ్చి చూడగా వేలాడుతూ కనిపించడంతో స్థానికుల సహాయంతో తల్లికి సమాచారం అందించారు. వెంటనే తల్లి వచ్చి చూడగా అప్పటికే మృతి చెందింది. పోలీసులు ఘటనా స్థలానికి వచ్చి వివరాలు సేకరించారు. పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. కంచరపాలెం సీఐ వి.చంద్రశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పురంధేశ్వరితో రాజీవ్ కృష్ణ బేటీ

**కొవ్వూరు, (విశాఖ సమాచారమ్)** కొవ్వూరులో ప్రైవేటు ఫక్షన్ లో హాజరు అవ్వడానికి విచ్చేసిన రాజమండ్రి ఎంపీ శ్రీమతి దగ్గుబాటి పురందేశ్వరి,రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రివర్యులు సత్య కుమార్, టూరిజం శాఖ మంత్రివర్యులు కందుల దుర్గేష్, ఎమ్మెల్సీ సోము వీర్రాజు మర్యాదపూర్వకంగా కలిసిన యస్ రాజీవ్ కృష్ణ అదేవిధంగా మంత్రివర్యులు కందుల దుర్గేష్ సారధ్యంలో నిడదవోలు మున్సిపల్ కౌన్సిల్ ని జనసేన కైవసం చేసుకున్న సందర్భంగా రాజీవ్ కృష్ణ కలిసిన నిడదవోలు పట్టణ టిడిపి మరియు జనసేన కౌన్సిలర్స్ నాయకులు కళ్యాణ్, చందు, నిడదవోలు జడ్పిటిసి సూరిబాబు, రాజబాబు తదితరులు పాల్గొన్నారు.





## స్టీల్ ప్లాంట్ పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ



**గాజువాక, విశాఖ సమాచారం :** నగర పోలీసు కమిషనర్ డా.శంఖబ్రత బాగ్చి మంగళవారం స్టీల్ ప్లాంట్ పోలీస్ స్టేషన్‌ను మరోమారు ఆకస్మికంగా సందర్శించారు. స్టేషన్ పరిసర ప్రాంతాలను వ్యర్థాలతో నింపకుండా, ఆయా ప్రాంతాలను శుభ్రము చేయించి, మొక్కలు నాటాలని ఆదేశించారు, స్టీల్ ప్లాంట్ స్టేషన్ పరిధిలో గల అన్ని సెక్టార్లలో దొంగతనాలు, అసాంఘిక చర్యలు జరగకుండా క్రైమ్ పోలీసులు పోలీసింగ్ చేయాలని, సీసీటీవీ కెమెరాలు మరిన్ని వినియోగించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రౌడీ షీటర్స్, సస్పెక్ట్ షీటర్స్ కదలికలు ఎల్లవేళలా పరిశీలించాలనీ, స్టేషన్ పరిధిలో ఒక్క గంజాయి పెడ్లర్ కూడా ఉండరాదని ఆదేశాలు జారీ చేశారు. స్టేషన్ ఆవరణలో పలు కేసులతో పెండిరగ్ లో ఉన్న వాహనాలను పరిశీలించి, వాటిని డిస్పోజ్ చేసేందుకు అవసరమైన చర్యలు తక్షణం చేపట్టాలని ఆదేశించారు, పలు ఫైళ్ళను పరిశీలించి, పెండిరగ్ కేసులు తక్షణం పరిష్కరించాలని తెలిపారు, అన్ని రిజిస్టర్లు అప్డేట్ గా ఉండాలని ఆదేశించారు.

## దాతల సహకారంతోనే సమాజాభివృద్ధి



**సింహాచలం, విశాఖ సమాచారం:** దాతల సహకారంతోనే సమాజాభివృద్ధి సాధ్యమని, దయగల హృదయమే దైవ మందిరం అని సింహాచలం దేవస్థానం ధర్మకర్తల మండలి మాజీ సభ్యులు,నేవల్ డాక్ యార్డ్ అసోసియేషన్ (కేటీబీ )గౌరవ అధ్యక్షులు,జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీను బాబు అన్నారు. ఇక్కడ సింహాచలం రోడ్ లో ఉన్న మనసు అనాధాశ్రమానికి మంగళవారం గంట్ల శ్రీను బాబు కుటుంబ సభ్యులు చేతులు మీదుగా నిత్యవసర వస్తువులు అందజేశారు. ఈ సందర్భంగా గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ సమాజంలో ఎంతో మంది నిరుపేదలు ఉన్నారని వారిని ఆదుకోవడంలో ప్రభుత్వాలతో పాటు దయగల దాతలు కూడా అత్యంత కీలకమన్నారు. మనసు ఆశ్రమంలో సుమారు 27 మంది చిన్నారులు ఉన్నారని వారంతా వేరువేరు పాఠశాలల్లో ఉన్నత విద్యాభ్యాసం సాగిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సింహగిరి గ్యాస్ ఏజెన్సీ యజమాని గంట్ల కిరణ్ బాబు,మారుతి. కళ్యాణ మండపం అధినేత తిరుమల రెడ్డి సుధీర్. ప్రవీణ్, టీడీపీ నాయకులు శ్రీనివాస్ పలువురు స్థానికులు పాల్గొన్నారు.

## అమ్మకేమయింది? అమ్మకేమయింది?

### ప్రాణం దక్కినా తల్లి దూరమైంది తండ్రితో చిన్నారి..



**కోటవురట్ల, నక్కపల్లి, విశాఖ సమాచారమ్ :** కోటవురట్ల మండలం కైలాసపట్నం బాణసంచా పేలుడు ప్రమాదంలో మృత్యుంజయులుగా మిగిలినవారు ఒక్కొక్కరుగా వెలుగులోకి వస్తున్నారు. ఇక్కడ జరిగిన ప్రమాదంలో ఆదివారం ఓ యువతి తన ప్రాణాలు దక్కించుకోవడంతో పాటు, మరోచిన్నారి ప్రాణాలూ రక్షించింది. దుర్ఘటన జరగడానికి ముందు మంచినీరు తాగేందుకు ఇదే గ్రామానికి చెందిన కిర్రా సునీత బయటకు రాగానే ప్రమాదం చోటుచేసుకుంది. దీంతో తాను భయంతో అక్కడినుంచి దూరంగా వెళ్లిపోతూ అక్కడే ఉన్న నాలుగేళ్ల చిన్నారి ప్రవల్లికను గుర్తించింది. అంతే.. క్షణం ఆలస్యం చేయకుండా తనతోపాటు తీసుకుని దూరంగా వెళ్లిపోయింది. తర్వాత సహాయక చర్యల నిమిత్తం వచ్చిన పోలీసులకు చిన్నారిని అప్పగించగా, వారు భద్రంగా స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఈమె వివరాలు సోమవారం ఉదయం గుర్తించారు. పేలుడు ఘటనలో చిన్నారి ప్రవల్లిక తల్లి దేవర నిర్మల సైతం మృతిచెందింది. తూర్పుగోదావరి జిల్లా చెందిన ఈమె శ్రీకాకుళం జిల్లా బారువ గ్రామానికి చెందిన భర్త వీర వెంకట సత్యనారాయణతో కలిసి ఉపాధి నిమిత్తం ఇక్కడికి వచ్చింది. మృత్యువు నుంచి తప్పించుకున్న చిన్నారికి ఇక్కడ ప్రమాదం గురించి గాని, తల్లి మరణించిన విషయం గాని తెలుసుకునే ఊహలేదు. దీంతో తండ్రి వద్ద ఉంటూ తల్లికోసం అమాయకంగా చూస్తుండటం చూపరుల గుండెలు బరువెక్కించింది.

## టి డి పి నాయకుని గృహప్రవేశానికి హాజరైన గంటా



**నక్కపల్లి (విశాఖ సమాచారం):-** నక్కపల్లి గ్రామంలో మీగడ సత్యనారాయణ గృహ ప్రవేశానికి భీమిలి శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు,రాష్ట్ర హెూం మంత్రి వంగలపూడి అనితతో పాటు రాష్ట్ర జనసేన పార్టీ సీనియర్ నాయకులు పాయకరావుపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్చార్జి గెద్దం బుజ్జి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఆటో డ్రైవర్లు యజమానులు ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు



**కే కోటపాడు (విశాఖ సమాచారం):-** శ్రీ శ్రీ శ్రీ భగవాన్ సత్యసాయి బాబా వారి ఆశీస్సులతో మంగళవారం ఉదయం 11 గంటలకు కె కోట పాడు మండలం ఆనందపురం జంక్షన్ వద్ద ఆటో డ్రైవర్లు మరియు ఓనర్స్ ఆధ్వర్యంలో చలివేంద్ర కార్యక్రమం ఏర్పాటు చేశారు .ఈ కార్యక్రమానికి ఏ కోడూరు పోలీస్ స్టేషన్ ఎస్ఐ డి లక్ష్మీనారాయణ చేతులు మీద గా ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ యజమానులు తదితరులు సంఘం నాయకులు డ్రైవర్లు పాల్గొన్నారు.

## అంబేద్కర్‌కు జయంతి

### నివాళులర్పించిన కాకర్ల సత్యేంద్ర




**తాళ్ళ పూడి, (విశాఖ సమాచారమ్):** తాళ్లపూడి మండలం అన్నదవరపేట గ్రామంలో రాజ్యాంగ ప్రదాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 134వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు

ఈ కార్యక్రమంలో కాకర సత్యేంద్ర మాట్లాడుతూ ఆర్.సి.యం చర్చి అంబేద్కర్ స్టాట్యూ దగ్గర డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం సంక్షేమ కోసం పాటుపడారని న్యాయాలు గాని చట్టాలు గాని సక్రమంగా నడుచుకుంటున్నాయంటే దానికి కారణం అంబేద్కర్ గారిని గుర్తు చేశారు అంటరానితనం నిర్మూలన కోసం ఆయన కృషి చేయడం జరిగింది ఆయన ఆశయాలు ముందుకు తీసుకెళ్తూ సమ సమాజ నిర్మాణంలో మనం కూడా మన వంతు పాత్ర పోషించాలని కొనియాడారు పార్టీలకు అతీతంగా గ్రామ అభివృద్ధికి కృషి చేయాలని పిట్టా శ్రీనివాస్, నరేష్ లకు అభినందనలు తెలిపారు. దీనిలో భాగంగా కాకర్ల సత్యేంద్ర కూచిపూడి గణపతి (గణేష్) టిడిపి నాయకులు,కార్యకర్తలు అంబేద్కర్ యువత, జై భీమ్ యువసేన పాల్గొన్నారు.

## గోదావరి నదిలో ఇద్దరు యువకుల గల్లంతు



**చాగల్లు, విశాఖ సమాచారమ్ :** గోదావరి నదిలో దిగి ఇద్దరు యువకులు గల్లంతైన సంఘటన కొవ్వూరు మండలం సీతంపేట సమీపంలోని చిగురులంక వద్ద ఆదివారం చోటు చేసుకుంది. నిడదవోలులోని చర్చిపేటకు చెందిన మత్తి ప్రకాష్ కుమార్ (15), రాజమహేంద్రవరానికి చెందిన గంధం హర్ష(18), మరి కొందరు యువకులు గోదావరి నదిలో స్నానానికి దిగారు. లోతు తెలియక పోవడంతో ప్రకాష్, హర్షలు గల్లంతయ్యారు. విషయం తెలుసుకున్న గ్రామీణ పోలీసులు, డీఎస్పీ జి.దేవకుమార్ ఆధ్వర్యంలో గాలింపు చర్యలు చేపట్టారు. మంత్రి కందుల దుర్గేష్ సంఘటనా స్థలానికి చేరుకుని ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలకు ఆదేశాలు జారీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రమాద ప్రాంతం ఎక్కువ లోతు ఉండడంతో యువకుల జాడ తెలియలేదన్నారు. ఈ విషయమై ఇప్పటికే సీఎంవో అధికారులతో చర్చించానన్నారు. కుటుంబ సభ్యులకు ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందించ నున్నట్లు తెలిపారు. ఇటువంటి సంఘటనలు ఏటా పునరావృతం కావడం దుర దృష్టకరమన్నారు. ప్రమాదాల నివారణకు పాఠశాల స్థాయి నుంచే అవగాహన పెంచేలా చర్యలు చేపట్టనున్నట్లు ఆయన వివరించారు.

### విషాదంలో చర్చిపేట..

**నిడదవోలు:** అంబేద్కర్ జయంతి వేడుకల్లో అప్పటి వరకు ఉత్సాహంగా పాల్గొన్న ప్రకాశ్, హర్ష మధ్యాహ్న భోజనం అనంతరం స్నేహితులతో కలిసి స్నానానికి వెళ్లి గల్లంతవ్వడంతో చర్చిపేటలో విషాదం నెలకొంది. ప్రకాష్‌కుమార్ మార్చిలో పది పరీక్షలు రాశాడు. తండ్రి కిషోర్ ఒక ప్రైవేట్ అంబులెన్స్‌లో డ్రైవర్‌గా పనిచేస్తుండగా తల్లి సుమారు నెలాపదిహేను రోజుల కిందట ఉపాధి నిమిత్తం కువైట్ వెళ్లారు. విశాఖలో హర్ష ఇంటర్ చదువుతున్నాడు. తల్లి శైలజ నర్స్‌గా రాజమహేంద్ర వరంలో ఓ ఆసుపత్రిలో పని చేస్తుండటంతో ఉద్యోగరీత్యా ఇటీవల చర్చిపేట నుంచి అక్కడికి వెళ్లారు.

## కలిసికట్టుగా.. మేలు తలపెట్టి!

### ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని పలు పట్టణాల వాసులు ప్రగతి బాటలో మేముసైతమంటూ తమ వంతు చేయూత నిస్తున్నారు

### స్థానికుల ఐక్యతతో ప్రగతి బాట



**భీమవరం పట్టణం, జంగారెడ్డిగూడెం, విశాఖ సమాచారమ్ :** ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని పలు పట్టణాల వాసులు ప్రగతి బాటలో మేముసైతమంటూ తమ వంతు చేయూత నిస్తున్నారు. ఏలూరు, జంగారెడ్డిగూడెం, చింతలపూడి, నూజివీడు, భీమవరం, పాలకొల్లు, నరసాపురం, తణుకు, తాడేపల్లిగూడెం, ఆకివీడు పట్టణాలో పలు కాలనీల్లో నివాసితులు సంఘటితంగా ప్రగతి బాటలు వేస్తున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో అభివృద్ధి పనుల్లో భాగస్వాములవుతున్నారు.

సామాజిక బాధ్యతగా.. స్థానికుల సంకల్పంతో పలు కాలనీలు అభివృద్ధి పథంలో ముందుకెళ్తున్నాయి. పశ్చిమగోదావరి జిల్లా కేంద్రమైన భీమవరంలో పలు అభివృద్ధి పనులకు దాతలు చేయూతనిచ్చారు. భవ్య భీమవరం పేరిట చేపట్టిన పనుల్లో వారి భాగస్వామ్యం ఉంది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలోని పలు కాలనీల్లో పార్కులు అభివృద్ధి, శుద్ధి జలాలను అందించే ఆర్వో ప్లాంట్లు, వనాల సంరక్షణ బాధ్యతలు చేపట్టారు. భీమవరం హౌసింగ్‌బోర్డు కాలనీ వాసులంతా కలిసి రూ.2.50 లక్షలతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడంతో పాటు ఇద్దరు కాపలాదారులను నియమించుకున్నారు. ఇక్కడి పార్కుల అభివృద్ధికి కాలనీ అసోసియేషన్ సౌజన్యంతో రూ. 10 లక్షలు సమకూర్చారు. ఈ పట్టణంలో బ్యాంకుకాలనీ, వీరాస్వామికాలనీ, బ్రహ్మయ్యనగర్, రెడ్డికాలనీ, కతారినగర్‌ల వాసులంతా కలిసి మైత్రీ కాలనీస్ అసోసియేషన్‌గా ఏర్పడ్డారు. దాదాపు 250-300 భవంతుల యజమానులు దీనిలో సభ్యులుగా ఉన్నారు. వీరు రూ.3 లక్షలతో తాగునీటి శుద్ధికేంద్రాన్ని ఏర్పాటు చేశారు. రహదారుల వెంబడి మొక్కలు నాటి సంరక్షణ బాధ్యతలు స్వీకరించారు. జంగారెడ్డిగూడెంలోని సాయి బాలాజీ టౌన్‌షిప్ పార్కు ఇది. స్థానికులంతా కలిసి రూ. 12 లక్షలు సమకూర్చి చుట్టూ ప్రహరీ నిర్మించి వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేసుకున్నారు. మొక్కలు నాటి కూర్చొనేందుకు బల్లలు సమకూర్చారు.

విశాఖ సమాచారమ్

బుధవారం 16-4-2025

## రిజర్వేషన్లకు రాజకీయ రంగు వద్దు

తెలంగాణలో బీసీలకు స్థానిక సంస్థలలో 42శాతం రిజర్వేషన్ల కల్పన ఒక గొప్ప సామాజిక లక్ష్యానికి దారిచూపే చర్య. ఇది ఆకస్మికంగా తీసుకున్న నిర్ణయం కాదు. రాష్ట్ర శాసనసభ, మండలిలో ఏకగ్రీవంగా ఆమోదించిన బిల్లు. అయినప్పటికీ, ఈ బిల్లు గవర్నర్ ఆమోదం పొందకముందే రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై విమర్శలతో ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం చేయడం తగదు.

ఒకవైపు చట్టం తయారు చేస్తూ, మరోవైపు దాని అమలుపై తటస్థంగా ఉండటం... తరువాత దానికి విరుద్ధంగా కేంద్రాన్ని నిందించటం... ప్రజాస్వామ్య ధర్మానికి విరుద్ధం. గవర్నర్ ఆమోదం తీసుకునే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే. బిల్లును అమలులోకి తీసుకురావాల్సిన కర్తవ్యాన్ని వదిలేసి, రాజకీయ ఆరోపణల వైపు మళ్ళడం బాధాకరం. ఈ వ్యవహారంలో బాధ్యతను కేంద్రం మీదకు నెట్టడం రాష్ట్ర ప్రభుత్వం తన రాజ్యాంగ బాధ్యత నుంచి తప్పించుకోవడమే. అంతేకాకుండా, ఇది ప్రజల మధ్య అపోహలు పెంచే ప్రమాదం కలిగిస్తుంది. రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్పు వంటి అంశాలు చట్టం అమలులోకి వచ్చిన తరువాత మాత్రమే కేంద్ర ప్రభుత్వంతో చర్చించవలసినవి. చట్టానికి బలమైన న్యాయాధారాలు, సమగ్ర డేటా, నివేదికలు అవసరం. అవి లేకుండా ఏ ఇతర చర్యలకైనా వెళ్లడం సాంకేతికంగా ఇబ్బందికరం.

తెలంగాణలో బీసీల జనాభా సుమారుగా 56 శాతం పైనే. కానీ విద్యా, ఉద్యోగాల్లో వారికి రిజర్వేషన్ 29 శాతం లోపే. అలాగే స్థానిక సంస్థలలో 21 శాతమే. ఈ అసమానతలకు నివారణగా 42 శాతం రిజర్వేషన్ల బిల్లు తేవడమేగాక, వాటిని చట్టబద్ధంగా అమలుచేయడమే లక్ష్యం కావాలి. కానీ రాజ్యాంగ ప్రక్రియను పూర్తి చేయకుండా, ప్రజలలో కేంద్ర ప్రభుత్వమే అడ్డంకి అనే అపోహలు కలిగించడం సమంజసం కాదు. ప్రజల చైతన్యాన్ని రాజకీయ ప్రయోజనాలకు వక్రీకరించడం బీసీల చరిత్రలో జరిగిన అన్యాయాలకు మరో రూపమే అవుతుంది. ఒక చట్టాన్ని న్యాయస్థానాల్లో నిలబెట్టాలంటే, శాస్త్రీయ డేటా, కమిషన్ నివేదికలు, సామాజిక పునర్వ్యాఖ్యలు తప్పనిసరి. ఈ విషయం గతంలో అనేక తీర్పుల ద్వారా స్పష్టమయింది. తెలంగాణ ప్రభుత్వం గవర్నర్ ఆమోదం అనంతరం ఈ చట్టాన్ని తక్షణం అమలుచేయాలి. తరువాత డేటా ఆధారంగా పటిష్టంగా నిలబడేలా చేసి, ఆ పిమ్మట కేంద్రాన్ని ఆశ్రయించి 9వ షెడ్యూల్‌లో చేర్చే ప్రక్రియ ప్రారంభించాలి. గవర్నర్ ఆమోదం పొందకుండా అమలు ప్రకటనలు చేయడం రాజ్యాంగ విరుద్ధం. ఆర్టికల్ 243 డీ ప్రకారం రాష్ట్రానికి స్థానిక రిజర్వేషన్లపై చట్టం చేసే అధికారం ఉంది. కానీ 9వ షెడ్యూల్‌లో చేర్పుపై ముందుగా చర్చించకూడదు. బీసీలకు రిజర్వేషన్ అనేది దయకు పాత్రత కాదు. ఇది రాజ్యాంగ హక్కు. ప్రభుత్వాలు న్యాయబద్ధతను ప్రదర్శించాలి. బీసీ కమిషన్ నివేదికలు, కుల గణాంకాలు పబ్లిక్ డొమైన్‌లో పెడితే ప్రజల మద్దతు పెరుగుతుంది. అలాగే మహారాష్ట్ర, బిహార్‌లలో కోర్టులు డేటా లేకుండా తీసుకొచ్చిన రిజర్వేషన్లను కొట్టివేశాయి. తెలంగాణ ఈ తీర్పుల నుంచి పాఠాలు నేర్చుకోవాలి.

### పంచాంగం

బుధవారం 16-4-2025
శ్రీ విశ్వావసు నామ సంవత్సరము
ఉత్తరాణాయణం, వసంత రుతువు
చైత్ర మాసం

| | |
|---|---|
| తిథి | : బ. తదియ ప. 1.18 |
| నక్షత్రం | : అనూరాధ పూర్తి |
| వర్జ్యం | : ఉ. 7.38 ల 9.25 |

### మీ కలాన్ని సంధించండి

కథలు, కవితలు, సాహిత్య, రాజకీయ విశ్లేషణలు, వ్యాసాలు, ప్రత్యేక కథనాలు, సందర్భోచిత కథనాలు... ఇలా ఏదైనా సరే.. రాసే ఆసక్తి ఉన్న వారు పంపవచ్చు. మీకు 'విశాఖ సమాచారమ్' దినపత్రిక చక్కటి వేదికగా నిలుస్తుంది. బాగున్న రచనలను మీ పేరు , ఫోటోతో సహా ప్రచురిస్తాము.

**మీ రచనలు పంపించవలసిన ఈమెయిల్ అడ్రస్**
**vspnews4@gmail.com**
**వాట్సాప్ నంబర్ : 9100986585.**

# తక్కువ ధర.. ఉత్తమ ఔషధం.. జన్ ఔషధి




భారతదేశ ఆరోగ్య రంగంలో విప్లవాత్మకమైన మార్పులకి దారి తీసిన అత్యంత ప్రధానమైన కార్యక్రమాల్లో ఒకటి 'ప్రధాన మంత్రి భారతీయ జన ఔషధి పర్యోజన యోజన' ఈ జన ఔషధి ఔషధాలు అధిక ఖర్చుతో కూడిన బ్రాండ్ ఔషధాలకు బదులుగా ప్రజలకు లభించడం వల్ల, వారిపై ఉన్న వైద్య ఖర్చుల భారాన్ని తగ్గించగలిగాయి. గ్రామీణ, అర్బన్ పేద ప్రజలు సైతం తక్కువ ధరలకు నాణ్యమైన ఔషధాలను పొందే అవకాశం కలిగింది.

నేడు గ్రామీణ ప్రాంతాల్లో కూడా మధుమేహం, హైపర్ టెన్షన్, కిడ్నీ సంబంధ, లివర్ సంబంధ, నరాలు, బ్రెయిన్ సంబంధ వ్యాధులు విస్తరిస్తున్న సందర్భంలో జన ఔషధి గురించి సామాన్య ప్రజలకు తెలియాల్సిన అవశ్యకత ఉంది. భారతదేశంలో అధిక ధరల కారణంగా అనేక మంది పేద, మధ్యతరగతి ప్రజలు అవసరమైన ఔషధాలను కొనలేకపోతున్నారు. ఈ సమస్యను అధిగమించేందుకు భారత ప్రభుత్వం 2008లో జన ఔషధి పథకాన్ని ప్రారంభించింది. అయితే, 2015లో ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో దీనిని పునర్నిర్మించి, 'ప్రధాన్ మంత్రి భారతీయ జన ఔషధి పర్యోజన యోజన'గా రూపుదిద్దుకుంది. ఈ పథకం ప్రధాన లక్ష్యం ప్రజలకు నాణ్యమైన జెనరిక్ ఔషధాలను తక్కువ ధరలకు అందించడం. బ్రాండ్ కంపెనీలు విక్రయించే ఔషధాలకు బదులుగా, అదే సమర్థత ఉన్న తక్కువ ధర కలిగిన ఔషధాలను ప్రజలకు సరఫరా చేయడమే ఈ కార్యక్రమ ఉద్దేశ్యం.

**జన ఔషధి ప్రత్యేకతలు..**

జన ఔషధి మందుల ధరలు బహిరంగ మార్కెట్లో లభించే బ్రాండెడ్ మందుల ధరల కంటే 50%-80% తక్కువ. ఉత్పత్తుల నాణ్యతను నిర్ధారించడానికి ప్రపంచ ఆరోగ్య సంస్థ మంచి తయారీ పద్ధతులు సర్టిఫైడ్ తయారీదారుల నుండి మాత్రమే మందులు సేకరించబడతాయి. ప్రతి బ్యాచ్ ఔషధాన్ని ఉత్తమ నాణ్యతను నిర్ధారించడానికి 'నేషనల్ అక్రిడిటేషన్ బోర్డ్ ఫర్ టెస్టింగ్ అండ్ కాలిబ్రేషన్ లాబొరేటరీస్' ( ఎన్ ఏ బి ఎల్) గుర్తింపు పొందిన ప్రయోగశాలలలో పరీక్షిస్తారు. ఈశాన్య రాష్ట్రాలు, హిమాలయ ప్రాంతాలు, ద్వీప ప్రాంతాలు.. నీతి ఆయోగ్ ద్వారా ఆకాంక్షాత్మక జిల్లాలుగా పేర్కొనబడిన వెనుకబడిన ప్రాంతాలలో లేదా మహిళా పారిశ్రామికవేత్త, మాజీ సైనికుడు దివ్యాంగ్, ఎస్సీ, ఎస్టీల ద్వారా ప్రారంభించబడిన పీఎంబీజేపీ కేంద్రాలకు ఒకేసారి రూ. 2.00 లక్షల ప్రోత్సాహకాలు అందించబడతాయి. ఈ ఔషధ కేంద్రాల నాణ్యతను భారత ప్రభుత్వ ఆయుష్ మంత్రిత్వ శాఖ మరియు ఇతర ఆరోగ్య సంస్థలు నిరంతరం పర్యవేక్షిస్తాయి. ప్రస్తుతం 2000కు పైగా ఔషధాలు, 300కు పైగా శస్త్రచికిత్సలకు అవసరమైన వస్తువులు జన ఔషధి కేంద్రాల్లో లభిస్తున్నాయి. దేశంలో 10,000కు పైగా జన ఔషధి కేంద్రాలు పనిచేస్తున్నాయి.

**మధ్యతరగతికి ఊరట**

జన ఔషధి ఔషధాలు అధిక ఖర్చుతో కూడిన బ్రాండ్ ఔషధాలకు బదులుగా ప్రజలకు లభించడం వల్ల, వారిపై ఉన్న వైద్య ఖర్చుల భారాన్ని తగ్గించగలిగాయి. గ్రామీణ, అర్బన్ పేద ప్రజలు సైతం తక్కువ ధరలకు నాణ్యమైన ఔషధాలను పొందే అవకాశం కలిగింది. ప్రజలకు ఔషధ వ్యాపారాన్ని ప్రోత్సహిస్తూ స్వయం ఉపాధికి మార్గం సుగమం చేసింది. ఔషధ నెలవారీ ఖర్చులు తగ్గుట వలన పేద మధ్యతరగతి వారికి కాస్త ఊరటగా ఉంటుంది. అయితే నేటికి చాలా మంది జన ఔషధి ఔషధాల గురించి తెలియక బ్రాండ్ ఔషధాలపైనే ఆధారపడుతున్నారు. దీన్ని అధిగమించేందుకు మరింత ప్రచారం అవసరం. కొన్ని ప్రాంతాల్లో జన ఔషధి కేంద్రాలు తక్కువగా ఉండటం వల్ల అందుబాటులో సమస్య ఉంది. అందుకే ప్రభుత్వం మరిన్ని కేంద్రాలు ఏర్పాటు చేయాలి. కొంతమంది ప్రజలు జెనరిక్ ఔషధాలపై నమ్మకం లేకుండా ఉన్నారు. వారి అపోహలను తొలగించేందుకు మరింత పారదర్శక ప్రభుత్వ ప్రయత్నం అవసరం.

**మరింత ప్రజాదారణ పొందేలా..**

భారత ప్రభుత్వం 2025 చివరి నాటికి 25,000కి పైగా జన ఔషధి కేంద్రాల ఏర్పాటును లక్ష్యంగా పెట్టుకుంది. అలాగే, మరిన్ని ఔషధ రకాలను జాబితాలో చేర్చి, వ్యాధులకనుగుణంగా వైద్య సేవలను విస్తరించనుంది. ఇటీవలి కాలంలో టెలీ మెడిసిన్, డిజిటల్ ఆరోగ్య సేవలు వంటి కొత్త సాంకేతికతలతో జన్ ఔషధి సేవలను మరింత సమర్థవంతంగా అమలు చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. అందుకే దేశంలోని ప్రతి ఒక్కరూ ఈ గొప్ప పథకాన్ని ప్రోత్సహించాలి. ఆరోగ్య సేవలను సమానంగా అందించడంలో జన ఔషధి ఒక ముఖ్యమైన మైలురాయి. దీనిని మరింత ప్రజాదరణ పొందేలా చేయడం ద్వారా, ఆరోగ్య భద్రతను మెరుగుపరిచేలా చేయగలుగుతాం. ప్రజలు తక్కువ ఖర్చుతో అధిక నాణ్యత కలిగిన ఔషధాలను పొందేందుకు మరింతగా ప్రయోజనం పొందేలా చేయడం మనందరి బాధ్యత. మండలానికి ఒక జన ఔషధి కేంద్రం వచ్చేలా కేంద్ర ప్రభుత్వం ప్రణాళికలు చేయాలని కోరుకుందాం..."సరసమైన ధరలో ఉత్తమమైన ఔషధం – ఆరోగ్య భారత లక్ష్యం!"

**- కమల్ హాసన్ తుమ్మ**

# ఓడ్యాన గిరిజాదేవి - కలకత్తా కాళీమాత



పూరీ జగన్నాథస్వామిని దర్శించుకుని 60మందిగా ఉన్న మా బృందం జాజిపూర్ ఓడ్యాన గిరిజాదేవి, నాభిగయకు బస్సులో బయలుదేరాం. ఉదయం బయలుదేరి మధ్యలో సాక్షిగోపాల్ చేరుకున్నాం.పూరీ జగన్నాథుని దర్శించుకున్నామన్న సాక్షిగా సాక్షిగోపాలుడి గుడికి వెళ్లి హాజరువేయించుకోవాలిట.అక్కడ సాక్షి గోపాలుడు ఈయనే నని పక్కపక్కనే ఉన్న రెండు చోట్ల పండాలు తీసుకువెళ్లి చూపించారు. అదేమిటి ఇద్దరు సాక్షి గోపాలురు ఒకే గుడిలో ఎలా ఉంటారంటే మాకు తెలియదు ఆయనే అసలు అని ఇద్దరూ చెప్పారు.రెండుచోట్ల ప్రత్యేక పూజ అని వసూలుచేసారు.మళ్లీ టిక్కెట్ అని వసూలు చేసారు. ఈదండీ భగవంతుని కలియుగలీలగా భావించి బయలుదేరాం.

అక్కడ నుంచి జాజిపూర్ 12గంటలకు చేరుకుని గిరిజాదేవిని దర్శించుకున్నాం.అక్కడా మళ్లీ దందానే.చేతిలో పడితేనే లోపలకు అని,దర్శనంతో పాటు మళ్లీ దక్షిణ అని పండాలు పంతం.తప్పక అన్నీ చెల్లించుకుని అమ్మా వీరిని,మమ్మల్ని నీవే కాపాడాలని ప్రార్థించి బయటపడ్డాం.

అక్కడే ఉన్న నాభిగయలో పితృదేవతలకు పిండప్రదానం చేస్తే వారు వైతరిణి దాటి వెళతారనే నమ్మకంతో ఆ కార్యక్రమం చేసాం.దానికి భారీగా దక్షిణ అడిగారు. వేలరూపాయలు ఇచ్చినా పూజచేయడంలో శ్రద్ధ చూపడంలేదు.డబ్బు మీద ఆశమాత్రమే తప్ప పూజ చేయించడం కనిపించడంలేదు.వైతరిణి నదిని కూడా సందర్శించాం.నదిలో నీరు బాగానే ఉంది.కాని మిట్ట మధ్యాన్నం కావడంతో శిరస్సుమీద నీరు చల్లుకుని మా పితృదేవతలను దాటించు తల్లీ అని నమస్కారం పెట్టుకున్నాం.ఎలాగో అయిందనిపించి రాత్రికి భువనేశ్వర్ చేరాం.

భువనేశ్వర్ లో లింగరాజు దేవాలయం సందర్శించాం.ప్రాంగణం చాలా పెద్దది.ఆయనను దర్శించుకున్నాం.అక్కడే ఉన్న అనేక ఉపాలయాలు దర్శించుకున్నాం.పార్వతిమాతను దర్శించుకున్నాం. వినాయకుడు, సుబ్రహ్మణ్యస్వామి విగ్రహాలు పెద్దగా చూడచక్కగా ఉన్నాయి. అక్కడి శిల్పకళ పూరీ జగన్నాథ ఆలయాన్ని పోలిఉంది. లింగరాజు ఆలయం విశాలంగా ప్రశాంతంగా భక్తులకు అలౌకికమైన ఆనందాన్ని కలిగిస్తుంది. ఏలాంటి ప్రయాస లేకుండా దర్శనం చేసుకుని వచ్చాం.

ఉదయం ఆరున్నరకు గంటలకు శతాబ్ది సూపర్ ఫాస్ట్ ఎక్స్ ప్రెస్ ఎక్కాం. 2.30గంటలకు హౌరా చేరాం.అక్కడి నుంచి రూంకు వచ్చి హౌరా బ్రిడ్జి,కలకత్తా కాళీమాత గుడికి వెళ్లాం. ఎంతో చరిత్ర ఉన్న హుబ్లీనది(గంగ) హౌరా బ్రిడ్జి చూసాం.కాళీమాత దేవాలయంలో భక్తులు కిక్కిరిసి ఉన్నారు. అమ్మను చూద్దామంటే తోపులాటలు. ఎవరికి వారు హడావుడి. పట్టించుకునే వారు లేరు.ఈ హడావుడిలో ఓ తల్లి క్రిందపడి స్పృహతప్పింది.ఆమెను వెంటనే బయటకు తీసుకువచ్చి సపర్యలు చేసి నీరు తాగిస్తే పావుగంటకు తేరుకుంది.

మాతను పూర్తిగా ఊరికే చూడనిస్తామా అన్నట్లు పండాలు అడ్డు నిలుచుని దక్షిణ ఇస్తేనే చూపుతామనే ధోరణిలో ఉన్నారు.లోపలికి వెళ్లడమే గగనం అయింది.మళ్లీ అమ్మ ప్రత్యేక దర్శనం అంటూ పండాలు వెంటపడుతున్నారు.ఆ తోపులాటలో అమ్మ దర్శనం అయిందనిపించి బయటపడ్డాం.రోజు ఇంతమంది భక్తులు వస్తున్నా తోపులాటలు జరుగుతున్నా పోలీసులు పండాలు,ఆలయ సిబ్బంది పట్టించుకోరు.పూరీలోనూ అదే గోల.ఇక్కడా అదే తోపులాట.భక్తులు దూర ప్రాంతాల నుంచి వ్యయప్రయాసలు ఓర్చుకుని వస్తారు. వారు డబ్బుపోయినా దర్శనం ప్రశాంతంగా,మనస్ఫూర్తిగా చేసుకోవాలని వస్తారు.కాని అది లభించడంలేదు.పెద్ద దేవాలయాల్లో ఇలాంటి పరిస్థితి ఉంటే ఆ భగవంతుని చూడాలంటే భక్తికంటే భయము ఎక్కువ అవుతుంది.ఆయా దేవస్థానాలు ఈ విషయంలో క్యూలను సరిచేసి భక్తులకు సజావుగా దర్శనం జరిగేలా చూడాలి.బయట నుంచి గర్భ గుడి వరకూ క్యూలు బాగానే ఉంటాయి.అక్కడి నుంచి తోపులాటలు ప్రారంభం.దాన్ని సరిచేస్తే ఆయా క్షేత్రం సందర్శించిన ఫలం భక్తులకు కల్పించిన వారవుతారు దేవస్థానం నిర్వాహకులు.మళ్లీ మళ్లీ వస్తారు.ఇలాగే ఉంటే "పునర్దర్శనం అప్రాప్తిరస్తు " అనుకుంటూ ఇంటి దారి పడతారు.

**యం.వి.రామారావు, 8084129668**

# అభిమానుల మనసు దోచిన ఎల్విస్ ప్రెస్లీ



1950లలో, ఎల్విస్ ప్రెస్లీ పేరుప్రఖ్యాతులు తో ఉన్నత స్థాయిలో ఉన్న రోజులవి. కాలిఫోర్నియాలోని అభిమానుల కోసం ఆయన ఆటోగ్రాఫ్ చేస్తున్న ఇలాంటి క్షణాలు, తన అభిమానులతో తనకున్న కాదనలేని అనుబంధానికి అద్దం పడతాయి. అభిమానులు తరచుగా ఆయన రాక్ ఎన్ రోల్ తో పులకించిపోయేవారు. ఆయన సంగీత ప్రతిభను చూడటానికి జనం తరలివచ్చేవారు. ఆయన ఆటోగ్రాఫ్ కోసం పోటీ పడేవారు.

ఎల్విస్ అభిమానులతో చేసే సంభాషణలు ఎంతో ఆసక్తిగా ఉండేవి. ప్రముఖుల గురించి మాత్రమే కాదు, తన ప్రేక్షకులతో పంచుకున్న విషయాలనేకం. అది అభిమానులతో ఆయనకున్న గాఢమైన బంధాన్ని ప్రతిబింబిస్తాయి. ఆయన సంగీతపరంగా విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారు. ఆయన అర్థవంతమైన హావభావాలు అందరినీ కట్టిపడేసేవి. ఆయన హోదాను బలోపేతం చేసేవి. ఆయన ప్రజాదరణ వేదికకే పరిమితం కాలేదు. అది ఆయన దైనందిన జీవితానికి విస్తరించింది. ఆయన అభిమానులతో ఎంతో సన్నిహితంగా ఉండేవాడు. తానో గొప్ప వ్యక్తినని ప్రదర్శించుకునే వాడు కాదు. ప్రజలతో మరింత ప్రియమైన క్షణాలను పంచుకునే వాడు.

ఎల్విస్ ప్రెస్లీ సంగీతం, ఫ్యాషన్ యువత సంస్కృతిపై ప్రభావం గాఢంగా ఉండేది. ఈ సమయంలోనే కాలిఫోర్నియాలో ఆయన ఆటోగ్రాఫ్ కోసం అభిమానులు సంభాషించేవారు. ఎవరినీ నిరాశ పరిచే వాడు కాదు. ఆయన వ్యక్తిత్వానికి అభిమానుల గుండెల్లో ప్రత్యేక స్థానముండేది.

రాక్ అండ్ రోల్ కింగ్ గా ప్రసిద్ధి చెందిన ఎల్విస్ ప్రెస్లీ సంగీతకళాకారుడిగా మనోహరమైన జీవితాన్ని గడిపారు. ఆయనది ప్రత్యేకమైన ఫ్యాషన్ సెన్స్.

ఎల్విస్ కు జెస్సీ గారన్ ప్రెస్లీ సోదరుడు ఉండేవాడు. వీరిద్దరు కవలలు. అయితే సోదరుడు జెస్సీ పుట్టిన కొద్దికాలానికే మరణించాడు. ఎల్విస్ ప్రత్యేకించి సంగీతం నేర్చుకోలేదు. అంతా వినికిడి జ్ఞానమే. ఎప్పుడూ సొంతంగా ఎటువంటి ట్యూన్‌లను కంపోజ్ చేయలేదు. సాహిత్యాన్ని రాయలేదు. ఆయన కరాటేలో ఏడవ డిగ్రీ బ్లాక్ బెల్ట్ పొందాడు. ఎల్విస్ ఆర్మీలో ఉన్న సమయంలో మార్షల్ ఆర్ట్స్‌ను అభ్యసించాడు. అయితే జీవితాంతం ఆయన కరాటే సాధన కొనసాగించాడు. ఆయనకు వేరుశెనగ, వెన్న, అరటిపండు శాండ్‌విచ్‌లు చాలా ఇష్టం.

ఎల్విస్ తన కరాటేతో పాటు జంప్‌సూట్‌లకు ప్రసిద్ధి.

ఎల్విస్ 1958లో సైన్యంలో చేరాడు. జర్మనీలో రెండు సంవత్సరాలు పనిచేశాడు.

ఎల్విస్ దగ్గర స్కాటర్ అనే చింపాంజీ ఉండేది.

గ్రేస్‌ల్యాండ్ పార్టీలలో తరచూ పాల్గొనేవాడు. ఆయన అమెరికా, కెనడాలలో మాత్రమే సంగీతం ప్రదర్శనలిచ్చేవాడు.

ఎల్విస్ కు జ్ఞాపకశక్తి అపారం. ఆయన తన సినిమా డైలాగులను సులభంగా గుర్తుపెట్టుకోగలిగేవాడు.

ఎల్విస్ వద్ద వందకు పైగా కార్లు ఉండేవి. వాటిని కుటుంబ సభ్యులకు, స్నేహితులకు బహుమతిగా ఇచ్చేవాడు.

ఎల్విస్ అందగాడు. నటుడు టోనీ కర్టిస్ లాగా కనిపించడానికి ఆయన తన జుట్టుకు నల్ల రంగు వేసుకునేవాడు.

ఆయన తరచుగా సినిమాలకు వెళ్లేవాడు.

ఎంత కీర్తి గడించినా ఒదిగి ఉండేవాడు. వినవిధేయతలకు మారుపేరు.

1935 జనవరి 8న పుట్టిన ఎల్విస్ 42 సంవత్సరాల వయసులో 1977 ఆగస్టు 16న మెంఫిస్‌లోని తన ఇంటి గ్రేస్‌ల్యాండ్‌లో మరణించాడు.

**- యామిజాల జగదీశ్**

# కోనోకార్పస్ చెట్లు. మంచివే!



తెలుగు రాష్ట్రాల్లో కోనో కార్పస్ (దుబాయ్) మొక్కలపై గత 4 సంవత్సరాలుగా సోషల్ మీడియాలో విష ప్రచారం చేస్తూ కోనో కార్పస్ మొక్కలను నరికి వేస్తున్నారు. ఈ మొక్కలు తెలుగు రాష్ట్రాల్లో రహదారుల పక్కన డివైడర్లపై, పరిశ్రామిక ప్రాంతాల్లో లక్షలాది మొక్కలు పెద్దవై వాయు కాలుష్యాన్ని, ధ్వని కాలుష్యాన్ని నివారిస్తున్నాయి. సెంట్రల్ యూనివర్సిటీలో వృక్షశాస్త్ర ప్రొఫెసర్ అత్తిపల్లి రామచంద్రారెడ్డి కోనో కార్పస్ మొక్కలపై పరిశోధనలు చేసి ఈ మొక్కలు అత్యధిక కార్బన్ డై యాక్సైడ్‌ను తీసుకుని అత్యధికంగా ఆక్సిజన్ ను అందించే మొక్కని ఋజువు చేశారు. మొక్కల మాఫియా నర్సరీలు ఈ మొక్కలపై విష ప్రచారం చేస్తున్నారు. గత 75 సంవత్సరాలుగా వన మహోత్సవాల పేరుతో కోట్లాది మొక్కలను నాటినట్లు ప్రకటిస్తూ వేలాది మొక్కలను కూడా బ్రతికించడం లేదు.

కోనో కార్పస్ మొక్క ఎలాంటి నిర్వహణ వ్యయం లేకుండా దాదాపు నాటిన ప్రతి మొక్క బతుకుతూ సుందరంగా ఉంటూ పర్యావరణాన్ని కాపాడుతున్నాయి.

## చరిత్రలో ఈ రోజు (ఏప్రిల్ 16)

**సంఘటనలు:**

1853 : బ్రిటీష్ ప్రభుత్వం ఆధ్వర్యంలో రైలు భారత దేశంలో ప్రారంభించబడిరది. మొదటి ప్రయాణీకుల రైలు బోరి బందర్, బొంబాయి నుండి థానే వరకు ప్రారంభించారు.

1919 : అమృతసర్ ఉదంతంలో మరణించిన ఉద్యమకారులకు నివాళులర్పిస్తూ మహాత్మా గాంధీ ఒకరోజు 'ప్రార్థన , ఉపవాసం' నిర్వహించాడు.

2001 : భారత్, బంగ్లాదేశ్ లు ఐదు రోజుల పాటు వాటి సరిహద్దు వివాదం పై చర్చించాయి. అయినా పరిష్కరించుకోలేకపోయాయి.

**జననాలు:**

1813: స్వాతి తిరునాళ్ కేరళలోని తిరువాన్కూరు మహారాజు, గొప్ప భక్తుడు, రచయిత.

1848: కందుకూరి వీరేశలింగం పంతులు, సంఘసంస్కర్త.

1889: చార్లీ చాప్లిన్, హాస్యనటుడు

1910: ఎన్.ఎస్.కృష్ణమూర్తి, సాహిత్య, కళా విమర్శకుడు, సామాజికశాస్త్ర పండితుడు.

1914: కె.హెచ్. ఆరా, చిత్రకారుడు

1922: డి.యోగానంద్, సినీ దర్శకుడు

1951: ఎం. ఎస్. నారాయణ, తెలుగు సినిమా హాస్యనటుడు, దర్శకుడు

1970: జె.డీ.చక్రవర్తి , నటుడు, దర్శకుడు.

1971: సెలీనా, మెక్సికన్-అమెరికన్ గాయని, గీత రచయిత్రి. నర్తకి

1978: లారా దత్తా, భారత చలనచిత్ర నటి, మోడల్, 2000 సంవత్సరం మిస్ యూనివర్స్.

1990: ప్రియా బెనర్జీ, భారతీయ సినీ నటీ, మోడల్

# వక్ఫ్ చట్టంలో వక్రబుద్ధులు



కొత్త వక్ఫ్ చట్టంపై దేశవ్యాప్తంగా నిరసన ఎదుర్కొంటున్న నరేంద్ర మోడీ, కేంద్ర ప్రభుత్వం, భారతీయ జనతా పార్టీ దాన్ని ముస్లింల ప్రయోజనాల కోసమే తీసుకువచ్చినట్టు, వ్యతిరేకించే వాళ్ళు కబ్జాదారులకు వత్తాసు పలుకుతున్నట్టు దుష్ప్రచారం ప్రారంభించింది. ఇందుకోసం ఏప్రిల్ 20వ తేదీ నుంచి మే5 వరకు దేశవ్యాప్తంగా విస్తృతమైన ప్రచారం సాగించాలని కూడా నిర్ణయించుకుంది. మీడియాలో దీనిపై విస్తారమైన కథనాలు ఇప్పటికే వదులుతున్నారు. బిజెపి ముఖ్యమంత్రులైన దేవేంద్ర ఫడ్నవిస్ వంటి వారు బిల్లు చట్టం కాకముందే మహారాష్ట్రలో ఇన్ని వేల ఆస్తులు స్వాధీనం చేసుకుంటామని బెదిరింపులకు దిగారు. నిజంగా ఈ చట్టంలో ఏముంది? లాభమా నష్టమా? నిజంగా రాజకీయ విమర్శ ఉద్యమం అవసరమా? లాంటి ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ చట్టాన్ని సవాలు చేస్తూ దాఖలైన కేసులను అత్యవసర ప్రాతిపదికన తీసుకోవాలన్న అభ్యర్థనను సుప్రీంకోర్టు ఆమోదించలేదు. వక్ఫ్ చట్టంపై పిటిషన్లతో పాటు మత మార్పిడుల చట్టాలకు అనుకూలంగా వ్యతిరేకంగా కూడా కేసులలో ఏప్రిల్ 16న విచారణ ప్రారంభిస్తున్నది. ఒక విధంగా ఆ రోజుతో ఈ అంశంపై న్యాయ పోరాటాలు కూడా ప్రారంభమవుతా యన్నమాట. తాము ఈ చట్టాన్ని అమలు జరుపబోమని జార్ఖండ్, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రులు ప్రకటించారు. ఎన్డీఏలో కీలక భాగస్వామిగా ఉన్న ఎ.పి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వక్ఫ్ బోర్డులో ముస్లిమేతరులను నియమించాలనే నిబంధనను ప్రస్తుతానికి పక్కన పెట్టాలని సూచించినట్టు లీకులు ఇస్తున్నారు. ఒక ఎకరం నుంచి 200 ఎకరాల వరకు వక్ఫ్ ఆస్తుల్ని లీజుకు ఇస్తామని, ఆసక్తి వ్యక్తీకరణ ప్రతిపాదనలను ఆహ్వానిస్తూ పత్రికల్లో వ్యాపార ప్రకటనలు జారీ చేసింది. జమ్ము కాశ్మీర్‌లో అయితే ఇప్పుడున్న అధ్యక్షురాలు బిజెపి నియమించబడిన వ్యక్తిగా బలపరుస్తుంటే ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. కనుక వక్ఫ్ చట్టం వక్రీకరణలు ఎలాంటి పరిణామాలకు దారితీస్తాయో ఇప్పుడే తెలిసిపోతున్నది.

**అసత్య ప్రచారాలు**

1954 వక్ఫ్ చట్టాన్ని 1995లో కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లింలకు అనుగుణంగా సవరించిందని, 2013లో వాటిని మరింత అనుకూలంగా మార్చిందని బిజెపి ఆరోపణ. మైనారిటీల స్థితిగతులను అధ్యయనం చేసి తగు సిఫారసులు చేసేందుకై నియమించబడిన జస్టిస్ సచార్ కమిటీ వక్ఫ్ ఆస్తుల మీద ఇచ్చిన సూచనల స్ఫూర్తిని కాపాడేందుకే తాము 2024 శాసనం తీసుకొచ్చామని కేంద్ర నేతలు చెప్పుకుంటున్నారు. కేంద్ర ప్రభుత్వ సంస్థ ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పి.ఐ.బి) తయారు చేసిన సమాచారంలో కూడా గత బిల్లు ముస్లింలకు అనుకూలంగా ఉందని ఆరోపించడం ఆశ్చర్యం కలిగిస్తుంది. భిన్న మతాలతో కూడిన ఈ విశాల దేశంలో మైనారిటీలు అంటే అల్ప సంఖ్యాక వర్గాలు రాజ్యాంగంలో ప్రత్యేక హక్కులు కలిగి ఉన్నారు. అది ప్రజాస్వామ్య లక్షణం కూడా. మరి వారి మత వ్యవహారాలకు సంబంధించిన చట్టాలు వారికి అనుకూలంగా కాక వ్యతిరేకంగా ఉండటం ఎలా సాధ్యం? ఏ విధంగా న్యాయం? కేంద్రం చేస్తున్న ఈ ఆరోపణలోనే వారి అసలు వ్యూహం అర్థమవుతుంది. బిజెపి దీనిపై హడావుడి పడిందంటే లోక్‌సభ తర్వాత రాజ్యసభలో అర్ధరాత్రి రెండున్నర గంటలకు తీవ్ర వాదోపవాదాల మధ్య ఆమోదింప చేసుకున్నారు. ఆ వెంటనే రాష్ట్రపతి గజట్ కూడా జారీ చేయడంతో 8వ తేదీ నుంచి అమలులోకి వచ్చింది. చెప్పాలంటే చాలామంది విద్యాధికులకు కూడా ఇప్పటికీ ఈ వ్యవహారం గురించి పూర్తి స్పష్టత రాలేదు. దానికి చాలా సమయం పట్టవచ్చు. కానీ ఆలోగానే వివాదాలు మాత్రం పెరిగిపోవటం, రగిలించడం అనివార్యంగా కనిపిస్తున్నది. ఈ చట్టంలో వ్యూహం, ఉద్దేశం కూడా అది.

బుజ్జగింపు రాజకీయాల కోసమే వక్ఫ్ చట్టంపై వివాదం సృష్టిస్తున్నారని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆరోపించారు. దీని మీద జరిగిన చర్చ చారిత్రాత్మకమైనది అన్నారు. నిజంగానే లౌకికతత్వం, మత సామరస్య సంబంధాల పరిరక్షణపై ఈ చట్టం తీవ్ర ప్రభావమే చూపిస్తుంది.

**అన్ని తిరకాసులూ రివర్సే!**

వక్ఫ్ చట్టం కింద నాలుగు రకాలుగా ఆస్తులు ఏర్పడతాయి. ఒకటి-ఆస్తులను దేవుడికి (అల్లాకు) అప్పగిస్తున్నట్లుగా దాన పత్రాలు, దస్తావేజులు తయారు చేయించడం. రెండు-దాతలు నోటి మాటతో ఏదైనా సందర్భంలో ప్రకటించటం. మూడు-వాడుకలో ఆ స్థలం లేదా ఆస్తి దేవుడి సంబంధమైన మత క్రతువులకు వినియోగంలో ఉండటం. నాలుగు-ప్రభుత్వం వక్ఫ్‌కు ఏదైనా భూమిని ఇవ్వటం. ఇప్పుడు ఈ చట్టం ప్రకారం వాడుకలో వక్ఫ్ అనే అంశం చెల్లదు. దస్తావేజులు తప్పనిసరిగా ఉండాలనేట్టయితే వందల ఏళ్ళ క్రమంలో అనేక వక్ఫ్ ఆస్తులకు దస్తావేజులు లేవు. రాజులతో సహా నోటి మాటతో ఇచ్చినవి అనేకం. ఆ విధంగానే తరాల పర్యంతం వాడుకలో ఉంటున్నాయి. ఇప్పుడు వాటిని వివాదాస్పదం చేయటం చాలా సులభం. బాబ్రీ మసీదు రామ జన్మభూమి వివాదం నుంచి చార్మినార్ భాగ్యలక్ష్మి వరకు మనం చూస్తున్నది అదే.

అసలు 'వక్ఫ్ చట్టం' అన్నదాన్ని కాస్త 'ఉమ్మడి నిర్వహణ సాధికారత సమర్థత అభివద్ధి చట్టం' అని మార్చారు. దేవాదాయ ధర్మాదాయ చట్టం కింద ఆలయ భూములు వంటివి చూస్తున్నారు కానీ ఈ రకమైన పరిభాష ఎక్కడా లేదు. వినియోగదారుడు లేదా ధార్మిక సంస్థ దాన్ని వక్ఫ్‌కు అప్పగించినట్లు ప్రకటించవచ్చునని ప్రస్తుత చట్టం చెబుతున్నది. 1. ఇప్పుడు చేసిన మార్పుల ప్రకారం ఐదు సంవత్సరాలుగా ముస్లింలుగా ఉండి ఆ విశ్వాసాలు పాటిస్తున్న వారికి మాత్రమే ఈ అవకాశం ఉంటుంది. ప్రకటన లేదా దానం ఇతర మతాలవారు చేస్తే చెల్లదని చెప్పడం ద్వారా భిన్న మతాల వారికి అవకాశం లేకుండా పోతున్నది. 2. ప్రభుత్వ ఆస్తులు వక్ఫ్‌గా స్థిరపడి ఉంటే గతంలో వాటిని అలాగే పరిగణిస్తున్నారు. కొత్త చట్టంలో వక్ఫ్ ఆస్తులుగా వాడుకలో ఉన్నవి అలా కొనసాగవు. దీనిపై వచ్చే విభాగాలను కలెక్టర్ ప్రభుత్వం ముందు ఉంచి పరిష్కరిస్తారు. 3. ఏది వక్ఫ్, ఏది కాదు అన్నది నిర్ణయించే అధికారం గతంలో బోర్డుకు ఉండేది. ఇప్పుడు ఆ నిబంధనను తొలగించి పూర్తిగా ప్రభుత్వాలకు అప్పగిస్తున్నారు. 4. ఈ ఆస్తులపై సర్వే గతంలో కమిషనర్లు, అదనపు కమిషనర్లు నిర్వహించేవారు. ఇప్పుడు రెవెన్యూ చట్టాల ప్రకారం వాటి నిర్వహించే అధికారం కలెక్టర్లకు అప్పగించారు. 5. గత చట్టంలో ఇద్దరు మహిళలతో సహా ముస్లింలు మాత్రమే ఈ కమిటీ బోర్డుల్లో సభ్యులుగా నియమితులయ్యే అవకాశం ఉండేది. ఇప్పుడు ఇద్దరు ఎంపీలు, మాజీ న్యాయమూర్తులు, ప్రముఖ వ్యక్తులు ముస్లింలు కాకపోయినా ఇందులో సభ్యులు కావచ్చు. ముస్లిం సంస్థల ప్రతినిధులు, ఇస్లామిక్ చట్టాలు పండితులు మాత్రమే ఆ మతానికి చెందిన వారై ఉండాలి. వారిలో ఇద్దరు మహిళలు ఉండాలి. 5.ఎన్నికైన ఇద్దరు ముస్లిం ఎంపీలు, ఎమ్మెల్యేలు, బార్ కౌన్సిల్ సభ్యులు రాష్ట్రాల వక్ఫ్ బోర్డులలో సభ్యులుగా ఉండాలని గతంలో ఉంది. ఇప్పుడు ఇద్దరు ముస్లిం అధికారులను, షియా సున్నీల నుంచి ఒక్కొక్కరిని, బహుళ ఆగాఖాన్ వర్గాల నుంచి ఒక్కొక్కరిని, ఇద్దరు ముస్లిం మహిళలను తప్పనిసరిగా సభ్యులను చేయాలి. 6. ఇక వక్ఫ్ ట్రిబ్యునల్‌లో ఒక జడ్జి ఆధ్వర్యంలో అదనపు జిల్లా మెజిస్ట్రేట్ ముస్లిం చట్టాల నిపుణుడు ఉండాలని గత చట్టంలో ఉంటే ఇప్పుడు ముస్లిం చట్టాల నిపుణుడు అన్నది తొలగించారు. జిల్లా కోర్టు జడ్జి చైర్మన్‌గా ఉండగా ప్రభుత్వం తరఫున జాయింట్ సెక్రెటరీ ఉంటారు. 7.ట్రిబ్యునల్ తీర్పులపై గత చట్టం ప్రకారం ప్రత్యేక పరిస్థితుల్లో మాత్రమే హైకోర్టులు జోక్యం చేసుకోవచ్చు. కొత్త చట్టంలో ఏ వివాదమైనా 90 రోజుల లోపల హైకోర్టుకు వెళ్ళవచ్చు. 8.పాత చట్టంలో బోర్డు ఆడిటింగ్ పర్యవేక్షణ అంశాలు రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఉండేవి. కొత్త చట్టం ప్రకారం కేంద్రానికే అధికారాలు ధారాదత్తం అవుతున్నాయి. అంటే వున్న నిబంధనలు మార్చడం, కొత్తవి చేర్చడం ఆదేశాలు ఏవైనా చేయొచ్చు. భిన్న పార్టీలు పాలించే సందర్భంలో ఇది సమాఖ్య తత్వాన్ని దెబ్బతీయడమే గాక సమస్యాత్మకంగా మారుతుంది 9. షియా సున్నీలు గనక 15 శాతం మించి వుంటే ప్రత్యేక బోర్డులు ఏర్పాటు చేయొచ్చని గతంలో వుండేది. ఇప్పుడు ఆగాఖానీ బోహ్రాలకు కూడా ఆ విధంగా వేరే బోర్డుల ఏర్పాటుకు అవకాశమిచ్చారు. వాస్తవానికి వారి సంఖ్య అంత వుండదని, అనవసరంగా చీలికలు తేవడానికే ఈ నిబంధన తెచ్చారని విమర్శలున్నాయి.

**సచార్ కమిటీ మాటేంటి?**

ఇప్పుడు సచార్ కమిటీ దగ్గరకు వస్తే దాని సిఫార్సులను అమలు చేయడానికి ఈ మార్పులు అన్నది మరీ అవాస్తవం. ఆ కమిటీ చెప్పిన ఒక్క చిన్న సిఫార్సును కూడా ఇందులో పొందుపరచలేదు. ఉదాహరణకు సచార్ కమిటీ వక్ఫ్ ఆస్తుల అభివృద్ధి కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని చెప్పింది. యుపిఏ ప్రభుత్వం 2014లో దిగిపోయే ముందు రూ.500 కోట్లతో ఒక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసింది కూడా. కానీ గత పదేళ్లలో ఈ కార్పొరేషన్ నిర్వీర్యమై ఇప్పుడు మూసివేతకు సిద్ధంగా ఉంది. ముస్లింలలో భిన్న వర్గాలకు చోటు కల్పించాలనే వాదనతో కూడా ఆ యా నేతలు ఏకీభవించడం లేదు. బోహ్రా, ఆగాఖానీలు షియా వర్గంలో ఉంటారని వారిని ప్రత్యేకంగా చూపడం ద్వారా బిజెపి ముస్లిం సమాజంలో చీలికల కోసం ప్రయత్నిస్తున్నదని కొందరు ఆరోపిస్తున్నారు.

**అతిశయాల వ్యాప్తి**

మరోవైపున దేశంలో వక్ఫ్ ఆస్తులు ఎన్ని? ఎంత విలువ? అన్న అంశంపై తలాతోక లేని లెక్కలు వెలువడుతున్నాయి. రూ.లక్షల కోట్ల విలువ లక్షల ఎకరాల భూమిని ఆ మతస్తులు అన్యాయంగా అనుభవిస్తున్నట్టు దురభిప్రాయం కలిగించే పెద్ద ప్రయత్నం సాగుతున్నది. ఆక్రమణదారులు, అవినీతిపరులు ఏ మతానికి చెందిన వారైనా శిక్షార్హులే. కానీ దానికి మతం రంగు పూసి, ఈ దేశపు భూమిని మరెవరో దురాక్రమణదారులు సొంతం చేసుకున్నారన్న భావం కలిగించటం మత విద్వేషాలకు దారితీస్తుంది. కానీ కొత్త చట్టం మాత్రం కొత్త వివాదాలకు మార్గం కాకుండా శక్తులు గొంతు ఎత్తవలసి ఉంటుంది. న్యాయవ్యవస్థ సకాలంలో జోక్యం చేసుకోవడమే దీనికి విరుగుడు అవుతుంది. ఏప్రిల్ 16న సుప్రీంకోర్టు అలాంటి వివాదాలకు అవకాశం లేకుండా మైనార్టీల మత హక్కులను కాపాడేందుకు చర్యలు తీసుకుంటుందా?

**ఆస్తులు వాస్తవాలేంటి?**

ఇంతకూ దేశంలో 8.8 లక్షల వక్ఫ్ ఆస్తులు వున్నాయనీ వాటిలో 9.4 లక్షల కోట్ల ఎకరాలు రూ.1.2 లక్షల కోట్ల విలువ కలిగివున్నాయని కేంద్రం చెబుతుంది. సైన్యం, రైల్వేల తర్వాత వక్ఫ్ ఆస్తులే ఎక్కువని పార్లమెంటులోనే ప్రకటించారు. వాస్తవానికి తిరుపతి వెంకన్న ప్రపంచంలోనే ధనవంతుడైన దేవుడని ఎప్పుడూ వినేవాళ్లకు ఇది ఆశ్చర్యం కలిగించవచ్చు. ఆ సంగతి అలా వుంచితే పై ఆస్తులలో సగం అంటే 4.36 లక్షల ఆస్తులకు సరైన పత్రాలు లేవని కేంద్రం అంటోంది. ఇప్పటికే దేశంలో దాదాపు 41 వేల కేసులు నడుస్తున్నాయి. ముస్లింలే వేసిన కేసులు దాదాపు పదివేలున్నాయి. మూడున్నర లక్షల ఎస్టేట్లు వక్ఫ్ కింద వున్నాయని అధికారిక లెక్క. అయితే 2006లో సచార్ కమిటీ చెప్పిన ప్రకారం 4.9 లక్షల వక్ఫ్ ఆస్తుల అధికారిక విలువ రూ.6,600 కోట్లుగా గుర్తించారు. వీటిపై కేవలం ఏటా రూ.160 కోట్లు మాత్రమే వస్తున్నందున సమర్థంగా నిర్వహించాలని సూచించింది. అదే సమయంలో వీటిలో నిరుత్పాదక ఆస్తులు అనేకం వున్నాయని పేర్కొంది. లక్షన్నర శ్మశానాలే వున్నాయి. మసీదులు మరో లక్షా 20 వేల వరకూ వున్నాయి. మదర్సాలు, ఈద్గాలు కూడా నడుస్తున్నాయి. కనక కేంద్రం ఒకవైపు నుంచి మాత్రమే చిత్రిస్తున్నట్టు స్పష్టమవుతుంది.

**– తలకపల్లి రవి**

## Spoken English -27

# Your boss wants you to go to Vijayawada to inspect the branch office there. Tell your friend that you cannot accept his invitation for dinner.

Nandan : Hello, Nandan,

Avinash : Good morning, I am Avinash.

శుభోదయం. నేను అవినాష్ ను.

Nandan : Yes, good morning, tell me.

What is the matter? - శుభోదయం, చెప్పండి ఏంటీ విశేషాలు?

Avinash : You invited me for today's dinner, on the occasion of your brother's birthday.

మీ సోదరుడు జన్మదిన సందర్భంగా ఈ రోజు నన్ను భోజనానికి ఆహ్వానించారు,

Nandan : Yes అవును

Avinash : But I am unable to attend it as my boss wants me to go to Vijayawada to inspect the branch office.

విజయవాడ లో వున్న బ్రాంచ్ కార్యాలయంను నన్ను తనిఖీ చేయమని మా బాస్ చెప్పడం వలన నేను దీనికి హాజరు కాలేను.

Nandan : No problem. That work is important.- పర్వాలేదు.అది ముఖ్యం.

Avinash : Okay. Thank you. - సరే! ధన్యవాదాలు.

Nandan : Welcome.- నమస్కారం!

Read the following text, between Mrs. Antonio and her neighbor, Mrs. Thomas

from Germany. They are in Malaysia.

(జర్మనీకి చెందిన మిసెస్ ఆంటోనియో, ఆమె పొరుగున వున్న మిసెస్ థామస్లు ఇప్పుడు మలేసియాలో వున్నారు. వారి సంభాషణ చదవండి)

Mrs. Thomas : Good morning. Mrs. Antonio, how are you?

శుభోదయం ఆంటోనియో, ఎలా వున్నావు?

Mrs. Antonio : I am fine thank you and you? - నేను బాగానే ఉన్నాను, మరి నీవు?

Mrs. Thomas : I am fine, too thank you.

ధన్యవాదాలు, నేను క్షేమమే

Mrs. Antonio, could you tell me where

the nearest super market is? I need to go for shopping.

దగ్గరలో సూపర్ మార్కెట్ ఎక్కడ వుందో చెప్పగలవా? షాపింగ్ కు వెళ్ళాలి.

Mrs. Antonio : Oh, it?s nearby. It?s at the end of this street. I usually go to the

super market every week.

ఓ.. దగ్గర్లోనే వుంది. ఈ వీధి చివరన వుంది.

**By Dr.P.V.Ram, Visakhapatnam. 9553574250**

**(Visakha Samacharam)**

# ఇంధన భారం!



అచ్చే దిన్ గురించి అస్తమానూ కబుర్లు వల్లించే మోడీ ప్రభుత్వం సామాన్య జనం నెత్తిన మళ్లీ గ్యాస్ బండ భారం మోపింది. అటు పెట్రోలు, డీజిల్ పైనా రూ.2ల చొప్పున సుంకం బనాయించింది. 'ఏడ్చిపోదురు గాక నాకేటి వెరపు?' అన్న చందంగా జనంపై భారాలు మోపటం మోడీ హయాంలో ఇదే మొదటిసారి కాదు. ప్రజలు కోవిడ్ కష్టకాలంలో విలవిల్లాడిపోయిన సందర్భాల్లో కూడా వంట గ్యాస్, పెట్రో భారాలు మోపిన ఘనత కేంద్ర ప్రభుత్వానిది. ఎల్‌పిజిపై ప్రజలకు బోలెడంత రాయితీ ధారబోస్తున్నామంటూ బొంకి, నెమ్మది నెమ్మదిగా సబ్సిడీ మొత్తానికి సర్వమంగళం పాడిన మోసకారితనం మోడీ అండ్ కోది. దాదాపు పదేళ్ల క్రితం నగదు బదిలీపై గొప్పగా ఢంకా బజాయించి, సబ్సిడీ సొమ్మును నేరుగా వినియోగదారుల ఖాతాల్లోనే జమ చేస్తామంటూ చెప్పారు. ఆ తరువాత 14.2 కేజీల సిలిండరు ధరను రూ.420 నుంచి రూ.1100 వరకూ పెంచుకుంటూ పోయారు. ప్రారంభంలో రూ.రెండొందలకు పైగా ఖాతాల్లో జమైన రాయితీ సొమ్ము ఇప్పుడు రూ.15ల నామమాత్రానికి కరిగిపోయింది. ఈ విధంగా దేశంలోని 32.83 కోట్ల మంది ఎల్‌పిజి వినియోగదారులను చెప్పాపెట్టకుండా రాయితీని తెగ్గోసి, మోసగించింది బిజెపి ప్రభుత్వం.

పాతికేళ్ల క్రితం వరకూ ఏడాదికొకసారి పెట్రో ఉత్పత్తుల ధరలను సవరించటం, పూలింగ్ పద్ధతిలో ధరల సర్దుబాటు చేయటం విధానంగా ఉండేది. దానిని పూర్తిగా నిర్వీర్యం చేసి, అంతర్జాతీయ ఇంధన మార్కెట్టులోని హెచ్చుతగ్గులకు అనుగుణంగా ఎప్పటికప్పుడు ధరల్లో మార్పులు ఉంటాయని కేంద్ర పాలకులు ప్రకటించారు. ధరలు పెరిగినప్పుడు పెంచటం, తగ్గినప్పుడు తగ్గించటం సహజంగానే జరిగిపోతుందని చెప్పుకొచ్చారు. నిజానికి ఆచరణలో జరుగుతున్నదేమిటి? భారం పెరిగితే జనం మీదికి నెట్టటం, ధర తగ్గితే చమురు కంపెనీల ఖాతాల్లోకి మళ్లించటం మామూలుగా మారింది. అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరలు తగ్గినప్పుడల్లా ఎక్సైజ్ సుంకాన్ని పెంచటం రివాజు అయింది. 2014 నవంబరు నుంచి 2016 జనవరి వరకూ తొమ్మిదిసార్లు సుంకాన్ని పెంచారు. వినియోగదారులకు దక్కాల్సిన తగ్గింపును ప్రభుత్వమే కొట్టేయటం మోసకారితనం కాక మరేమిటి?

అంతర్జాతీయ చమురు మార్కెట్లో నెలకొన్న పరిస్థితుల రీత్యా వాస్తవానికి పెట్రో ఉత్పత్తుల ధరలు గణనీయంగా తగ్గాల్సి ఉంది. 2014 నాటితో పోలిస్తే ఇప్పుడు 41 శాతం మేర చమురు ధరలు తగ్గాయి. దానిని యథాతథంగా అమలు చేస్తే లీటరు పెట్రోలు, డీజిలు ధరలు రూ.70ల లోపే ఉండాలి. అమెరికా ఆంక్షల నేపథ్యంలో రష్యా మనకు గతంలో కన్నా తక్కువ ధరకే ముడి చమురును విక్రయిస్తోంది. ఈ అవకాశాన్ని దేశీయ కార్పొరేటు కంపెనీలు అధిక లాభాలు ఆర్జించటానికి మోడీ ప్రభుత్వం అందిస్తోంది తప్ప ఆ తగ్గింపును ప్రజల వైపు మళ్లించటం లేదు. పైగా ఎన్నికల వేళ చమురు ధరల ఆధారంగా లబ్ధి పొందేందుకు కుయుక్తులకు దిగుతోంది. కోవిడ్ విపత్తు కాలంలోనూ ప్రజలపై కనికరం చూపని మోడీ ప్రభుత్వం%ొ% ఐదు రాష్ట్రాల ఎన్నికల సమయంలోనూ, సార్వత్రిక ఎన్నికల తరుణంలోనూ తగ్గింపు జిమ్మిక్కులు ప్రదర్శించింది. రూ.1050 వరకూ పెంచిన వంట గ్యాస్‌పై రూ.200, రూ.111 వరకూ పెంచిన పెట్రోలు ధరపై రూ.2లు తగ్గించి, పెద్ద ఉపశమనం చేకూర్చినట్టు ప్రచారం చేసుకొంది. కార్పొరేట్ల సేవ, అధికార యావ తప్ప ప్రజలపై భారాలు తగ్గించే బాధ్యతాయుత ఆచరణ బిజెపి ప్రభుత్వానికి లేదనటానికి తాజా పెంపు ఉదాహరణ.

తగిన ఆదాయాలు లేక ప్రజల్లో కొనుగోలు శక్తి రోజురోజుకీ తగ్గిపోతున్న వాస్తవం అనేక రూపాల్లో కళ్ల ముందు కనిపిస్తోంది. కోవిడ్ తరువాత నిత్యావసరాల ధరలు భారీగా పెరిగి, మళ్లీ కిందికి చూడడం లేదు. ధరలను అదుపులోకి తేవాల్సిన పాలకులు ఆ పని చేయకపోగా, అవి మరింత పెరగటానికి కారణమయ్యే ఎల్‌పిజి, పెట్రో ధరలను పెంచటం బాధ్యతారాహిత్యం. పేదల జీవితాల్లో వెలుగులు నింపటానికి అంటూ తీసుకొచ్చిన ఉజ్వల పథకం వినియోగదారులపైనా రూ.50ల పెంపు గ్యాస్ వినియోగాన్ని పక్కన పెట్టి, మళ్లీ కట్టెల మోపు వైపు నెట్టటానికే ఉపయోగపడుతుంది. కాబట్టి, పెంచిన ఎల్‌పిజి ధరను ఉపసంహరించటంతో పాటు రాయితీని భారీగా పెంచాలి. అన్ని తరగతులపైనా, నిత్యావసర ధరల పైనా ప్రభావం చూపే ఈ పెంపును తక్షణం ఉపసంహరించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం కూడా కేంద్రంపై ఒత్తిడి తేవాలి.

# విద్య, ఉద్యోగ సమాచారం

## బెల్‌లో 21 ప్రాజెక్టు ఇంజినీర్ పోస్టులు




ప్రభుత్వ రక్షణ రంగ సంస్థ, నవరత్న హోదా కలిగిన భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ బెంగళూరు వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న ప్రాజెక్టు ఇంజినీర్ పోస్టులకు దరఖాస్తులు కోరుతోంది. ఏప్రిల్ 26వ తేదీ వరకు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

**విభాగాలు:** ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్, కంప్యూటర్ సైన్స్

**పోస్టు పేరు-ఖాళీలు**

ప్రాజెక్టు ఇంజినీర్-1: 21

**అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్ (ఎలక్ట్రానిన్స్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రికల్)లో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

**వయోపరిమితి:** 1-04-2025 నాటికి 32 ఏళ్లు ఉండాలి. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ/ ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.

**జీతం:** నెలకు రూ.40,000 - రూ.55,000.

**దరఖాస్తు ప్రక్రియ:** ఆఫ్‌లైన్ ద్వారా.

**చిరునామా:** ది మేనేజర్, హ్యూమన్ రీసోర్స్, భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్, మిలటరీ రాడార్స్-ఎస్‌బీయూ, జలహళ్ళి పోస్ట్, బెంగళూరు-560013.

**దరఖాస్తు చివరి తేదీ:** 26-04-2025.

**దరఖాస్తు ఫీజు:** రూ.472, ఎస్సీ/ఎస్టీ/ పీడబ్ల్యూబీడీ అభ్యర్థులకు ఫీజులో మినహాయింపు ఉంటుంది.

ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా.

## సీఎస్‌యూలో లీగల్ ఆఫీసర్ పోస్టులు




న్యూఢిల్లీలోని సెంట్రల్ సంస్కృత విశ్వవిద్యాలయంలో... వివిధ విభాగాల్లో ఒప్పంద ప్రాతిపదికన కింది ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

**పోస్టుల వివరాలు:**

1. అకాడమిక్ కన్సల్టెంట్- 01
2. లీగల్ ఆఫీసర్- 01
3. పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్- 01
4. సిస్టమ్ అనలిస్ట్- 01
5. ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్- 01
6. అకౌంట్స్ ఆఫీసర్ (ఆడిట్)- 01
7. అసిస్టెంట్ ఎడిటర్- 01
8. ప్రూఫ్ రీడర్- 01
9. డిజైనర్ ఫర్ పబ్లికేషన్- 01

మొత్తం ఖాళీల సంఖ్య: 09

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ, ఎల్ఎల్‌బీ, బీఈ/ బీటెక్, ఎంఈ/ ఎంటెక్, ఎంకాం ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

గరిష్ఠ వయోపరిమితి: అకాడమిక్ కన్సల్టెంట్, అకౌంట్స్ ఆఫీసర్‌కు 65 ఏళ్లుబీ లీగల్ ఆఫీసర్, అసిస్టెంట్ ఎడిటర్‌కు 60ఏళ్లుబీ ప్రూఫ్ రీడర్‌కు 50 ఏళ్లు, ఇతర పోస్టులకు 40 ఏళ్లు మించకూడదు.

NCPOR: ఎన్‌సీపీఓఆర్‌లో 35 టెక్నికల్ పోస్టులు

**జీతం:** నెలకు అకాడమిక్ కన్సల్టెంట్, లీగల్ ఆఫీసర్, సిస్టమ్ అనలిస్ట్ పోస్టులకు రూ.60,000- రూ.75,000బీ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్, అకౌంట్స్ ఆఫీసర్‌కు రూ.50,000- రూ.60,000బీ ప్రూఫ్‌రీడర్, డిజైనర్ ఫర్ పబ్లికేషన్‌కు రూ.35,000.

ఎంపిక ప్రక్రియ: టెస్ట్/ పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా.

దరఖాస్తుకు చివరి తేదీ: 05-05-2025.

## సీఎస్‌యూలో లీగల్ ఆఫీసర్ పోస్టులు




ఐఐఎఫ్ఎంలో ప్రాజెక్టు సైంటిస్టు పోస్టులు

భోపాల్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారెస్ట్ మేనేజ్‌మెంట్ ఒప్పంద ప్రాతిపదికన ఖాళీగా ఉన్న సీనియర్ రీసెర్చ్ ఫెలో పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. ఏప్రిల్ 25వ తేదీ వరకు అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

పోస్టు పేరు-ఖాళీలు

సీనియర్ రిసెర్చ్ ఫెలో: 07

**అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో మాస్టర్స్ డిగ్రీలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

**వయోపరిమితి:** 32 ఏళ్లు మించకూడదు. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.

**జీతం:** నెలకు రూ.42,000.

**దరఖాస్తు ప్రక్రియ:** ఆన్‌లైన్ ద్వారా.

**దరఖాస్తు చివరి తేదీ:** ఏప్రిల్ 25.

**ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా.

# మలేరియా నిర్మూలనకు సహకరించండి



## ఇంటి బయటే కాదు లోపల కూడా పిచికారి చేయండి
## నేటి నుండి మలేరియా స్ప్రేయింగ్
## జిల్లా కలెక్టర్ ఎ ఎస్ దినేష్ కుమార్

**జి.మాడుగుల(విశాఖసమాచారం):**–మలేరియా నివారణకు మొదటి విడత దోమల మందు (ఎసిఎం 5%) పిచికారి జిల్లా కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలోని మూడు ఐటీడీఏల పరిధిలో గల 22 మండలాలలో 64 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో గల 311 సచివాలయాల ప్రాంతాలలోని 2,086 ఎంపిక చేసిన గ్రామాలలో 5.16 లక్షల జనాభా లక్ష్యంగా పిచికారి కార్యక్రమం ప్రారంభించాలని కలెక్టర్ ఆదేశించారు. ఇప్పటికే జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో సమన్వయ సమావేశం ఏర్పాటు చేసిన కలెక్టర్ గ్రామాలు వారిగా సూక్ష్మ ప్రణాళిక సిద్ధం చేయాలని గ్రామస్థాయి టాస్క్ ఫోర్స్ పర్యవేక్షణలో పిచికారి జరపాలని సూచించిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో జిల్లా సమన్వయ కమిటీ మండల సమన్వయ కమిటీ సహకారంతో ప్రత్యేక అధికారుల పర్యవేక్షణలో ప్రతి ఇంటిలో పిచికారి జరిగే విధంగా మలేరియా అధికారులు సిబ్బంది చర్యలు తీసుకున్నారు. అందులో భాగంగా జిల్లా మలేరియా అధికారి ఎం తులసి ఆధ్వర్యంలో మలేరియా సబ్ యూనిట్ అధికారులు, పిఎసి పర్యవేక్షకులు పారామెడికల్ సిబ్బందికి చాము అందించడం జరిగింది. అదేవిధంగా వైద్య అధికారులు మండల డివిజన్ స్థాయి అధికారులకు వర్క్ షాప్ నిర్వహించడం జరిగింది. 2086 గ్రామాలకు సరిపడా పిచికారి మందు స్ప్రేయింగ్ మిషన్లు ఇతర సామగ్రి అందు బాటులో ఉంచడం జరిగింది. గ్రామాలలో పిచికారీ తో పాటు ఇంటి లోపల కూడా తప్పని సరిగా పిచికారి చేయించాలని తద్వారా మలేరియా నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని జిల్లా కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# యోగాసనాలపై ప్రతి ఒక్కరికి అవగాహన కలగాలి

## సర్పంచ్ దాసరి సూర్య కుమారి



**రావికమతం (విశాఖ సమాచారం):**– యోగా, ఆసనాలు పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కవగుంట సర్పంచ్ దాసరి సూర్యకుమారి, మరియు రాజన్న యూత్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు దాసరి వరహాలు అన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్, రాజన్న యూత్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు వరహాలు మాట్లాడుతూ అనేకమంది ఉద్యోగ ,వ్యాపార, రాజకీయ, మొదలగు పలు సమస్యల నడుమ ఒత్తిళ్లకు గురి అవుతున్న ప్రతి ఒకరికి యోగ ఎంతగానో ఉపయోగపడు తుందని అన్నారు. అంతే కాకుండా ప్రధానంగా మనిషి పలు రకాల వత్తులకు గురైన వారు వాటి నుంచి బయటపడేందుకు, ప్రశాంతంగా జీవనం సాగించేందుకు గాను ఈ యోగా ఎంతగానో ఉపయోగ పడుతుందని అన్నారు. అనేకమంది పలు రకాల అనారోగ్య సమస్యలతో వైద్యుల వద్దకు వెళ్లి మందులు వాడినప్పటికీ, వారు కూడా మానసిక ఒత్తిడి, ప్రశాంతత లేకపోవడం, గ్యాస్టిక్,కీళ్ల నొప్పులు, టెన్షన్, శ్వాసకోశ వ్యాధులు,మొదలగు అనేక రకాలైన సమస్యలన్నీ ఈ యోగా ద్వారా నివారించు కోవచ్చునని తెలిపారు. శ్వాసపై ధ్యాస ఎప్పుడైతే తీసుకురాగలమో అప్పుడే మనం యొక్క ఆలోచన విధానం స్థిరంగా, నిలకడగా ఉంటుందన్నారు. లేని పక్షంలో మన శ్వాస మన కంట్రోల్లో లేక పోవడం పరివిధాలుగా సంచరించడం వలన అనేక రకాల సమస్యలకు గురవుతున్నామని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ బెంగళూరు యోగా ప్రతినిధి p.అప్పారావు చే ఆరు రోజుల పాటు శిక్షణ కార్యక్రమాన్ని మండలంలో చినపాచల సమీపంలో ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఏప్రిల్ 15 నుంచి ఆరు రోజుల పాటు ఈ కోర్సుకు పురుషులు, స్త్రీలు కూడా హాజరు కావచ్చు అన్నారు. ఆసక్తిగల వ్యక్తులు ఎవరైనా యోగాకు రావాలనుకుంటే అటువంటి వారు 897886978 నెంబర్ కు సంప్రదించాలని కోరారు.

# వాటర్ ట్యాంక్ ఎక్కి ఖాళీ బిందెలు పట్టుకొని ధర్నా చేసిన ఆదివాసి గిరిజన మహిళలు



**రావికమతం (విశాఖ సమాచారం):**– మండలం లోని చీమలపాడు పంచాయతీ అజయపురం గ్రామంలో 30 కుటుంబాలు గిరిజనులు జీవనం సాగిస్తున్నారు. 2019 సంవత్సరంలో15 ఆర్థిక సంఘం నిధుల నుండి 5 ఐదు లక్షల రూపాయలు ఖర్చుపెట్టి గ్రామానికి కిలోమీటర్ల దూరంలో బోరు తీసి పైపు లైన్ ద్వారా అక్కడనుండి గ్రామానికి నీరు సరఫరా చేసేవారు. మోటర్ కాలిపోవడం ద్వారా నీరు కోసం ఎత్తైన కొండ గడ్డ ఊట భావి ఏర్పాటు చేసుకుని నీరు చేర్చుకుంటున్నారు. కిలోమీటర్ నర దూరంలో త్రాగు నీరు తెచ్చుకోవడం నీరు కోసమే సమయం అంతా ఖర్చు పెడుతున్నారు. 2023 సంవత్సరంలో జల జీవన్ మిషన్ ద్వారా 15 లక్షల రూపాయలు నిధులు మంజూరు చేశారు. వాటర్ ట్యాంకు అసంపూర్తిగా నిర్మాణం చేసి వదిలేసారు. ఇంటింటకోలాయిలు పైపులు వేశారు. మధ్యలో వదిలేశారు. 2024డిసెంబర్ మొదటి వారంలో అజయ్ పురం గ్రామానికి రోడ్డు శంకుస్థాపన చేయడానికి వచ్చినటువంటి అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు మరియు స్థానిక శాసనసభ్యులు సీఎం రమేష్, కేఎస్ఎన్ రాజు కి గ్రామస్తులకు క్లియర్ చేయడం జరిగింది. 15 రోజుల్లో పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. నేటికీ నాలుగు నెలలు పూర్తవుతున్న జలజీవన్ మిషన్లో ద్వారా నిర్మాణం చేసినటువంటి వాటర్ ట్యాంక్ నిధులు అసంపూర్తిగా నిలిపివేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాడైపోయిన మోటార్ వెంటనే రిపేర్ చేసి మంచినీరు సరఫరా చేయాలి అని, జల్జీవన్ మిషన్ అసంపూర్తిగా నిర్మాణం చేసిన వాటర్ ట్యాంకును పూర్తి చేయాలి అని వారు డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమానికి సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కే గోవిందరావు. పాంగి జస్వంతి, పాంగి శ్రీరామ, పాంగి చంద్రయ్య గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.





# ఉమ్మడి జిల్లాలో నాడు ప్రథమ స్థానం నేడు అధమ స్థానంలో వడ్డాది ప్రభుత్వ కళాశాల

**బుచ్చయ్యపేట, (విశాఖ సమాచారమ్):** బుచ్చయ్యపేట మండలంలోని వడ్డాది ప్రభుత్వ జూనియర్ కళాశాల ను రెండున్నర దశాబ్దాల క్రితం గ్రామ పెద్దలు అంతా ఏకమై తమ భవిష్యత్ తరాల దృష్ట్యా పెద్దలు కోట్ల రూపాయలు విలువచేసే ఆస్తులను త్యాగం చేస్తూ వడ్డాదిలో జూనియర్ కళాశాలను ప్రారంభించారు. అయితే ఆరంభం నుంచి దినదిన ప్రవర్తమానంగా కొనసాగుతూ ఓ దశలో అన్ని రంగాలులో ఇక్కడి విద్యార్థులు జిల్లాకే తలమానికంగా నిలిచారు. దశాబ్ద కాలం క్రిందట ఉమ్మడి జిల్లాలో ప్రథమ స్థానంగా నిలిచిన వడ్డాది ప్రభుత్వ జూనియర్ కళాశాల నేడు జిల్లాలో చివరి స్థానం లో నిలవడం లో ఇప్పటి సిబ్బంది నిర్లక్ష్యమే అని విద్యార్థుల తల్లిదండ్రులు విమర్శలు గిప్పిస్తున్నారు. ఇప్పటి ప్రిన్సిపల్ అన్నపూర్ణ ఇష్టం వచ్చినట్లు తనకు నచ్చినట్లు సమయ స్ఫూర్తి లేకుండా కళాశాలకి రావడం, పోవడం వ్యవహరిస్తున్నారని ఒప్పంద లెక్చరర్ చెప్పుడు మాటలు విని కళాశాల దీర్ఘకాల సిబ్బందిపై లేనిపోని ఆరోపణలతో మండిపడుతున్నారని కళాశాలలో జరుగుచున్న లోపాలను పట్టించుకోలేదని స్థానికులు ఆరోపణలు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో ప్రథమ స్థానంలో ఉన్న ఘన చరిత్ర కలిగిన వడ్డాది ప్రభుత్వ జూనియర్ కళాశాల నేటి అధ్యాపకుల తీరుతో భ్రష్టు పట్టిపోయింది. ఇక్కడి ప్రిన్సిపాల్ విధి విధానాలతో ఏకంగా జిల్లాలోని ఇటీవల విడుదలైన ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాలలో వడ్డాది విద్యార్థులు చివరి స్థానంలో నిలబడాల్సిన పరిస్థితి నెలకొంది. దీనితో విద్యార్థుల తల్లిదండ్రులు అందరూ కళాశాల సిబ్బందిని నిలదీసేందుకు సిద్ధమవుతున్నారని విశ్వసనీయ సమాచారం. ఈ అంశాలపై సంబంధిత అధికారులను సంప్రదించాలని ప్రయత్నించినప్పటికీ అందుబాటులో ఉండటం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# చోడమాంబిక భక్తులకు ఉచిత ప్రయాణం, మజ్జిగ పంపిణీ





**రాంబిల్లి(విశాఖ సమాచారం):**– చోడమాంబిక పండగ సందర్భంగా మంగళవారం మోసయ్య పేట శ్రీ యువశక్తి ఆటో యూనియన్ అసోసియేషన్ సిఐటియు అనుబంధం వారి ఆధ్వర్యంలో మోసయ్యపేట నుండి చోడపల్లి గుడికి వెళ్లే భక్తులకు పది ఆటోలను పెట్టి ఉచిత ప్రయాణం, మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మజ్జిగ కేంద్రాన్ని ప్రారంభించిన సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్. రాము మాట్లాడుతూ ఇటువంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం స్నేహభావం పెంపొందుతుందని ఆటో కార్మికులకు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు అచ్చుతాపురం కన్వీనర్ కే.సోమునాయుడు ,శ్రీ యువశక్తి ఆటో యూనియన్ అధ్యక్షులు దమ్ము .చండి, కార్యదర్శి పోలవరపు. అప్పారావు , ఉపాధ్యక్షులు తట్ట .రాజు, కోశాధికారి ధర్మీ రెడ్డి .సన్నిబాబు, పోలార్పు. దర్గా, మురళి ,సూరిబాబు, అప్పారావు, చంటి పాల్గొన్నారు.

# చిత్రలేఖనం పోటీలలో చోడవరం విద్యార్ధులకు పతకాలు



**చోడవరం, (విశాఖ సమాచారమ్):**– ఆల్ ఇండియా యూత్ మరియు చిల్డ్రన్ ఆర్ట కాంపిటేషన్ కమ్ ఎగ్జిబిషన్, 12 వ . వార్షికోత్సవం సందర్భంగా, డ్రీమ్ యూత్ చిల్డ్రన్ క్రియేటివటి సంస్థ విజయవాడ వారి ఆద్వర్యంలో 5-4-25 నాడు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో చోడవరం చిత్రకళా నిలయం వ్యవస్థాపకుడు బోడ్డేటి.సూర్యనారాయణ ఆద్వర్యంలో శిక్షణ పొందుతున్న, పలువురు విద్యార్థులకు పథకాలు సాధించారు. మాడుగుల గ్రామము ఎం.పి.పి స్కూల్ కి చెందిన పుట్టా.రోహిత్ గోల్డ్ మెడల్ సాధించాడు. అలాగే చోడవరం మండలం, లక్ష్మీపురం గ్రామము జిల్లా పరిషత్ పాఠశాల కు చెందిన కె.చైతన్య, చోడవరం సూర్య మహతి స్కూల్ కు చెందిన బోడేటి.స్వజిత్ గోల్డ్ మెడల్ సాధించారు. వీరితో పాటు జి.వర్షణి, జె.అఖిల్,కె.దివ్య, ఓ.శ్యామ్ సుందర్ సిల్వర్ మెడల్స్ సాధించారు. సందర్భంగా చిత్రకళా నిలయం వ్యవస్థాపకుడు బోడ్డేటి. సూర్యనారాయణ ను చోడవరం ప్రేమ సమాజం సభ్యులు, ఫోరం ఫర్ బెటర్ చోడవరం ఆర్క్ సంస్థ సభ్యులు హర్షం వ్యక్తం చేసి అభినందించారు. చోడవరం గ్రామంలో పలువురు పెద్దలు, గ్రామస్థులు ఆయనను, మెడల్స్ సాధించిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

# వేంపాడు సబ్ స్టేషన్‌లో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం





**నక్కపల్లి: ( విశాఖ సమాచారమ్):**– అనకాపల్లి జిల్లా, పాయకరావుపేట నియోజక వర్గం నక్కపల్లి మండలం, వేంపాడు సబ్ స్టేషన్ లో గత కొన్ని నెలలుగా పవర్ ట్రాన్స్ఫర్మర్ వర్క్ జరుగుతున్న సంగతి మనకు తెలిసిందే. ఎట్టకేలకు అంబేద్కర్ జయంతి రోజున పూర్తి ట్రాన్స్ఫర్మర్ వర్క్ పూర్తయి ఏ.ఈ మహంకాల రావు చేతుల మీదుగా పవర్ ట్రాన్స్ఫర్మర్ ని ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా ఏ.ఈ మహాంకాల రావు మాట్లాడుతూ అంబేద్కర్ జయంతి సందర్భంగా వేంపాడు సబ్ స్టేషన్ లో పవర్ ట్రాన్స్ఫర్మర్ ప్రారంభించడం జరిగింది. కావున వేంపాడు సబ్స్టేషన్ పరిధిలో ఉన్న గ్రామాలన్నిటికీ మంగళవారం నుండి పగటిపూట కరెంటు ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఇవ్వటం జరుగుతుంది. ఈ పవర్ ట్రాన్స్ఫర్మర్ వర్క్ కి సపోర్ట్ చేసిన ఎలక్ట్రికల్ డిపార్మెంట్ వారందరికీ ఏఈ మహంకాల రావు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఈ.ఈ రాజశేఖర్, ఏఈ మహాంకాల రావు, జే.ఈ కిషోర్ మరియు నక్కపల్లి మండల లైన్మెన్ పులపర్తి వాసు, జె.ఎల్.ఎం భరత్ మరియు వేంపాడు సబ్ స్టేషన్ స్టాఫ్ సమక్షంలో పవర్ ట్రాన్స్ఫర్మర్ ప్రారంభించారు.

# ఇంటర్ మీడియట్ ఫలితాల్లో సత్తా చాటిన శ్రీ విజ్ఞాన్ కళాశాల విద్యార్థులు





**చోడవరం (విశాఖ సమాచారం):**– మండల కేంద్రంలో ఉన్న శ్రీ విజ్ఞాన్ కళాశాల విద్యార్థులు శనివారం విడుదలైన ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో సత్తా చాటారు. అనకాపల్లి రూరల్ జిల్లాలో తిరుగులేని ప్రతిభను కనబరిచారు. ద్వితీయ సంవత్సరంలో బై పి సి లో బి. నవ్యశ్రీ 1000 మార్కులకు 988 మార్కులతో అనకాపల్లి జిల్లా లో అగ్రస్థానంలో నిలిచింది అదేవిధంగా ఏం. కుమారి 1000 మార్కులకు గాను 981 మార్కులు సాధించింది 900 పైబడి మార్కులతో 12 మంది విద్యార్థులు వున్నారు ఇంటర్ మొదటి సంవత్సరంలో కూడా ఎంపీసీ బి. జ్ఞాన ప్రసున 470 మార్కులకు465 మార్కులతో ఉత్తమ ప్రతిభను కనబరిచింది అదేవిధంగా ఏ. నాగలక్ష్మి 462 మార్కులతో 400 మార్కులు పైబడిన వారు ఎనిమిది మంది విద్యార్థులు ఉన్నారు ఇటువంటి విద్యార్థులను సమాజానికి ఉపయోగపడేలా తీర్చిదిద్దడమే మా లక్ష్యం కాలేజీ యాజమాన్యం కరస్పాండెంట్ ఈ. గోవిందరావు మరియు డైరెక్టర్లు బి. రామకృష్ణ,బి. జి. దామోదర్, వై. శ్రీను అధ్యాపక బృందం అభినందించారు

# 2025 ఇంటర్ ఫలితాలలో శ్రీ వివేకానంద ప్రభంజనం



**చోడవరం (విశాఖ సమాచారం):**– శ్రీ వివేకానంద విద్యాసంస్థల ఆధ్వర్యంలో నడపబడుతున్న ఈ వివేకానంద జూనియర్ కాలేజ్ విద్యార్థులు ఇంటర్మీడియట్ ఫలితాలలో ప్రభంజనం సృష్టించారు ద్వితీయ సంవత్సరంలో ఎంపీసీ విభాగంలో చదువుతున్న గాడి భవాని (బుచ్చయ్యపేట) 1000కి 986 మార్కులతో చోడవరం మండలంలో ప్రథమ స్థానం కైవసం చేసుకుంది. బైబీసీ విభాగంలో చోడవరం కు చెందిన బండి నవ్యత 1000కి 975 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచింది. అంతేకాక 900 కు పైబడి 7 గురు విద్యార్థులు సాధించారు. ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ఎంపీసీ విభాగంలో 470కి గాను 463 మార్కులతో సిహెచ్ .వందన (కవ్వ గుంట), జె.లాస్యశ్రీ ( గోవాడ), సిహెచ్. శిరీష (గోవాడ) కైవసం చేసుకున్నారు. బైపీసీ విభాగంలో కే .భూమిక (దిబ్బపాలెం) 440 మార్కులకు గాను 427 మార్కులు సాధించి తృతీయ స్థానంలో నిలిచింది. అంతేకాక 400 మార్కులు పైబడి 16 మంది విద్యార్థులు సాధించారు. ఇటువంటి మట్టిలో మాణిక్యాలను వెలికి తీసి సమాజానికి ఉపయోగపడే పౌరులను తీర్చిదిద్దడమే మా లక్ష్యం అని విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపల్ ఏ రామారావు, ఏ ఓ - సిహెచ్ .దేవుడు నాయుడు , ఎమ్. శంకర్ మరియు అధ్యాపక బృందం అభినందించారు.



# ఆర్లి గ్రామంలో ఘనంగా శ్రీ మరిడి మాంబ అమ్మవారి విగ్రహ ప్రతిష్ట

## ముఖ్యఅతిథిగా వైభవ్ జ్యువెలర్స్ అధినేత రఖల్

**కే కోటపాడు,(విశాఖ సమాచారం):**– అనకాపల్లి జిల్లా కే కోటపాడు మండలం ఆర్లి గ్రామంలో సోమవారం ఉదయం మరిడిమాంబ అమ్మవారి విగ్రహ ప్రతిష్ట జరిపారు. ఉదయం భక్తులు ఆలయానికి చేరుకొని పూజలు నిర్వహించి హెూమాలు చేశారు. ముఖ్యఅతిథిగా వైభవ్ జ్యువెలర్స్ అధినేత రఖల్ పాల్గొని పూజలు నిర్వహించారు. భారీ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బోలెం సత్యనారాయణమూర్తి (సందీప్) బండారు అక్కన్న పాత్రులు (దొరబాబు) బోలెం బుల్లి దొర, బోలెం సత్యనారాయణమూర్తి, బండారు నారాయణమూర్తి, బండార్ కిషోర్, బోలెం నాగభూషణం, భక్తులు పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

# సముద్ర చేపల వేటకు విరామం

**నరసాపురం, విశాఖ సమాచారమ్ :** మత్స్యసంపద పునరుత్పత్తి కాలం ఏప్రిల్ 15 నుంచి జూన్ 16 వరకూ సముద్రంలో జాతీయ స్థాయిలో చేపల వేట నిషేధం అమలు చేస్తున్నారు. నిషేధం ఉల్లంఘించి వేట సాగిస్తే భవిష్యత్తులో మత్స్య సంపద లభ్యతపై ప్రతికూల ప్రభావం ఉంటుంది. జిల్లాలో కూడా ఏప్రిల్ 15 నుంచి వేట నిషేధం కచ్చితంగా అమలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇప్పటికే మత్స్యశాఖ అధికారులు పశ్చిమ తీర గ్రామాల్లో అవగాహన కల్పించి చైతన్య వంతులను చేశారు. ఉల్లంఘిస్తే లైసెన్సులు రద్దుచేసే అవకాశం ఉంది. 'వేట నిషేధాన్ని కచ్చితంగా అమలు చేస్తాం. దీనిపై ఇప్పటికే సదస్సులు నిర్వహించి మత్స్యకారులకు అవగాహన కల్పించాం' అని మత్స్యశాఖ సహాయ సంచాలకుడు ఎల్ఎల్ఎన్ రాజు తెలిపారు.

# ఎంపీటీసీ ఆధ్వర్యంలో పూడిక తీత పనులు



**రావికమతం (విశాఖ సమాచారం):**– మండల కేంద్రంలో చెరుకు కాటా నుంచి స్మశాన వాటిక వద్ద ఉన్న చెరువు వరకు రావికమతం ఎంపీటీసీ వేపాడ నాగేశ్వర రావు ఆధ్వర్యంలో కాలువలో పూడుకుపోయిన చెత్తాచెదారం, మట్టిని జెసిబి సహాయంతో తొలగించారు .ఈ సందర్భంగా రావి కమతం ఎంపీటీసీ నాగేశ్వరావు మాట్లాడుతూ రావికమతం చెరుకు కాటా దగ్గర నుంచి స్మశాన వాటికి వద్ద ఉన్న చెరువు వరకు కాలువలో ఉన్న మట్టి పూడికి పోవడంతో గ్రామం పైనుంచి వచ్చిన నీరు అంతా ఒకేచోట నిల్వ ఉండిపోవడంతో ఆ చుట్టుపక్కల ప్రజలు అసహనానికి గురి కావడంతో దానిని గుర్తించిన ఎంపిటిసి తన సొంత నిధులతో జెసిపి సహాయంతో కాలువ మొత్తం పూడిక తీయించారు. ఇదిలా ఉండగా రావికమతం టు నర్సీపట్నం, చోడవరం వెళ్లే ఆర్ అండ్ బి రోడ్డులో ఉన్న ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద నుంచి చెరుకు కాటా వరకు ఎంపీటీసీ వేపాడ నాగేశ్వరరావు నిధులతో డ్రైను నిర్మాణం కూడా ఇటీవల కాలంగా చేపట్టడం జరిగింది. దీంతో ఆ గ్రామానికి పట్టిన చీడ ,పీడ వదిలినట్లు గ్రామస్తులు అందరూ ఆనందం వ్యక్తం చేశారు . వర్షం పడితే చాలు గ్రామం అంతా రోడ్లపై నుంచే వర్షపు నీరు చెరువులను తలపించే విధంగా ఉండేవి. ఈ డ్రైను నిర్మాణంతో ఆ పరిస్థితి నుంచి బయటపడినట్లు అయిందని నాగేశ్వరావు తెలిపారు దీంతో గ్రామస్తులు పలువురు హర్షం వ్యక్తం చేశారు.

నేడు వీరేశలింగం జయంతి సందర్భంగా తెలుగు నాటకరంగ దినోత్సవం

# ఆధునిక నాటక రంగానికి ఆద్యుడు కందుకూరి

నాటక ప్రదర్శనతోపాటు నాటకానికి సంబంధించిన అనేక అంశాలపై సదస్సులు జరగాలని, నాటక కళాకారుల జయంతులను వర్ధంతులను నిర్వహించడం

*తెలుగు నాటకరంగ దినోత్సవం ప్రతి సంవత్సరం ఏప్రిల్ 16న నిర్వహించుకుంటాం. ఆధునిక తెలుగు నాటకరంగంలో తొలి నాటకకర్త, తొలి దర్శకుడు, తొలి ప్రదర్శనకారుడైన కందుకూరి వీరేశలింగం పంతులు జన్మదినాన్ని 2007లో తెలుగు నాటకరంగ దినోత్సవంగా నిర్ణయించారు.*

ద్వారా ప్రజల్లో నాటక కళ పట్ల ఉత్సాహం, విలువలు పెరుగుతాయని, వీటన్నింటిని సమతుల్యం చేసేలా ఉండేందుకు నాటకరంగ దినోత్సవాన్ని ఏర్పాటు చేసుకోవాలని తెలుగు నాటక కళాకారులు భావించారు. అయితే, ఏ రోజును నాటకరంగం దినోత్సవంగా చేయాలన్న అంశంపై అనేక చర్చలు జరిగాయి. అనేకమంది అనేక పేర్లూ, తేదీలు సూచించారు. దీనికి 2000వ సంవత్సరంలో బీజం పడింది. 2000వ సంవత్సరంలో కొంతమంది యువ నాటక కళకారులతో కలిసి డా. పెద్ది రామారావు ఆధ్వర్యంలో యవనిక త్రైమాసిక నాటకరంగ పత్రిక ప్రారంభమయింది. నాలుగేళ్ళపాటు నడిచిన ఈ పత్రికలో ప్రపంచ, భారతీయ, తెలుగు నాటకరంగాలకు సంబంధించి నాటక ముఖ్యులు, ఔత్సాహికులు రాసిన అనేక వ్యాసాలను యవనిక ప్రచురించడంతోపాటు నాటకరంగ కార్యక్రమాలు, నాటకోత్సవాలను కూడా నిర్వహించింది. నాటకరంగాన్ని మరింత పటిష్ఠపరచడంకోసం ఇతర దేశాల, రాష్ట్రాల



నాటకరంగానికి ఉన్నట్లుగా తెలుగు నాటకరంగానికి కూడా ఒక దినోత్సవం ఉంటే బాగుంటుందని భావించి, "ఏప్రిల్ 16 తెలుగు నాటక దినోత్సవం" శీర్షికతో 2000 ఏప్రిల్-జూన్ ప్రత్యేక యవనిక సంచికను ప్రచురించింది. యవనిక ఆలోచనకు "ఆంధ్రప్రదేశ్ రంగస్థల కళాకారుల ఐక్య వేదిక" సహకారం తోడైంది. తెలుగు నాటక కళాకారులంతా నాటకరంగ దినోత్సవ ఏర్పాటుపై ఏకాభిప్రాయానికి వచ్చారు.

19వ శతాబ్దంలో అనువాద నాటకాలకు అధిక ప్రాధాన్యమున్న సమయంలో ప్రదర్శనలను దృష్టితో ఉంచుకొని కందుకూరి వ్యవహార ధర్మబోధిని అనే నాటకం రాసి, షేక్స్పియర్ రాసిన కామెడీ ఆఫ్ ఎర్రర్స్ అనే ఆంగ్ల నాటకాన్ని చమత్కార రత్నావళి పేరుతో 1880లో అనువదించి తన విద్యార్థుల చేత ప్రదర్శింపచేశాడు. అంతేకాకుండా తెలుగు నాటకరంగంలో తొలి నాటక సమాజాన్ని కూడా వీరేశలింగమే స్థాపించాడు. ఆధునిక తెలుగు నాటకరంగానికి విశిష్ట సేవలను అందించిన కందుకూరి వీరేశలింగం పంతులు జయంతిని నాటక సంస్థలు 2001 నుండి తెలుగు నాటకరంగ దినోత్సవంగా జరుపుతున్నారు.

ఈ క్రమంలో డా. కె.వి. రమణాచారి ఆధ్వర్యంలో తెలుగు నాటకరంగ దినోత్సవం గురించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళగా, కందుకూరి వీరేశలింగం పంతులు జన్మదినాన్ని తెలుగు నాటకరంగ దినోత్సవంగా ప్రకటిస్తూ 2007 మార్చి నెలలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జి.ఓ. విడుదలచేసింది. 2007, ఏప్రిల్ 16న తొలిసారిగా ప్రభుత్వ ఆధ్వర్యంలో అధికారికంగా తెలుగు నాటకరంగ దినోత్సవం నిర్వహించారు. వివిధ సంస్థల ఆధ్వర్యంలో తెలుగు నాటకరంగ దినోత్సవం సందర్భంగా అనేక ప్రాంతాల్లో నాటక ప్రదర్శనలు, సదస్సులు, సమావేశాలు నిర్వహిస్తారు. తెలుగు నాటకరంగంలో విశేష కృషి చేసిన నాటక కళాకారులకు సన్మానాలు, సత్కారాలు, పురస్కారాలు, బిరుదులు అందజేస్తారు.

డా. జొన్నకూటి ప్రమోద్ కుమార్
9490833108.

# ఎవరు తీసుకున్న గోతిలో.. భూమన పరిస్థితి ఇదే



**తిరుమల, విశాఖ సమాచారం:** టీటీడీ గోశాలలో గత మూడు నెలల నుంచి వందకుపైగా ఆవులు మృతి చెందాయని, ఇది టీటీడీ వైఫల్యమేనని ఆరోపించిన మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి ఎరక్కపోయి ఇరుక్కుపోతున్నారా? ఈ విషయంలో చేసిన రాజకీయంతో భూమన మరింత బుక్ అవ్వనున్నారా? అంటే అవుననే సమాధానం వస్తోంది. గత మూడు నెలలో వందకు పైగా ఆవులు చనిపోయాయని భూమన కరుణాకర్ రెడ్డి చేసిన ఆరోపణలపై తాజాగా టీటీడీ ఈవో శ్యామలరావు స్పందించారు. వైసీపీ హయాంలో చనిపోయిన ఆవుల వివరాలు దాచిపెట్టారని, ఆవులు లేని గోశాలకు దాణా పేరుతో నిధులను పెద్దఎత్తున దుర్వినియోగం చేశారని ఆరోపించారు. నాచు పట్టిన నీళ్లను గోవులకు పట్టించారని, విజిలెన్స్ వాళ్లు తనిఖీలు చేసేందుకు అనుమతించలేదన్నారు.

ఆవు నెయ్యి కొనుగోలులో అక్రమాలు చోటు చేసుకున్నాయని, అన్న ప్రసాదంలో నాణ్యత లోపించిందని , స్వామి వారికి ఆర్గానిక్ ప్రసాదాల పేరుతో 3కోట్ల విలువైన సరకులకు 25 కోట్లు చెల్లించారని ఈవో తెలిపారు. 2021 నుండి 2024 వరకు గో శాలలో జరిగిన అవకతవకలు పై విజిలెన్స్ రిపోర్ట్ ఉందన్నారు ఈవో. అంటే గత ప్రభుత్వ హయాంలో అవినీతికి పాల్పడినట్లు పక్కాగా ఆధారాలు ఉన్నాయి. మరిన్ని బయటకు లాగే ప్రయత్నం చేస్తున్నారు. వంద ఆవుల మృత్యువాత అంటూ భూమన చేసిన ఆరోపణలతో వైసీపీ హయాంలో టీటీడీలో చోటు చేసుకున్న అవినీతిపై మరింతగా తీగ లాగే అవకాశం ఉంది. అదే జరిగితే భూమనతోపాటు కొంతమంది టీటీడీ అధికారులు బుక్ అయ్యే అవకాశం ఉంది.

## భూమనపై చర్యలకు టీటీడీ బోర్డు సిద్ధం

**తిరుమల, విశాఖ సమాచారం:** వైసీపీ నేత భూమన కరుణాకర్ రెడ్డిపై చర్యలకు టీటీడీ సిద్ధమైంది. ఎస్వీ గోశాలలో గోవుల మృతిపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని ఆయనపై ధర్మకర్తల మండలి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఎస్పీ హర్షవర్ధన్ రాజుకు బోర్డు సభ్యుడు భాను ప్రకాష్ రెడ్డి ఫిర్యాదు చేశారు. ఎస్వీ గోశాలలో 100 గోవులు మరణించాయని.. పవిత్రమైన గోశాలను గోవధ శాలగా మార్చారంటూ కరుణాకర్ రెడ్డి తప్పుడు ఆరోపణలు చేశారని భాను ప్రకాష్ రెడ్డి తన ఫిర్యాదులో పేర్కొన్నారు. నిరాధార ఆరోపణలు చేసిన ఆయనపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా భానుప్రకాశ్ మీడియాతో మాట్లాడారు. "భక్తుల మనోభావాలు దెబ్బతినేలా భూమన కరుణాకర్ రెడ్డి వ్యవహరించారు. ఎస్వీ గోశాలపై అసత్య ప్రచారం చేశారు. వైసీపీ హయాంలో జరిగిన అక్రమాలను ఆధారాలతో సహా బయట పెట్టాం. కరుణాకర్ రెడ్డి మాత్రం నోరు ఉందని ఇష్టం వచ్చినట్లు మాట్లాడారు. ఆయన చైర్మన్‌గా ఉన్నప్పుడు పెద్ద సంఖ్యలో గోవులు చనిపోయాయి. వైసీపీ హయాంలో పురుగులు పట్టిన ఆహారాన్ని గోవులకు పెట్టారు. గోవిందుడు, గోవులతో ఆటలు వద్దని వైకాపా నేతలను హెచ్చరిస్తున్నాం. టీటీడీలో అక్రమాలపై విజిలెన్స్ విచారణ కొనసాగుతోంది " అని పేర్కొన్నారు.

# రాజ్ కసిరెడ్డి చిక్కడా? పట్టుకోవడం లేదా ?

రాజ్ కసిరెడ్డి కోసం సీఐడీ సిట్ అధికారులు హైదరాబాద్‌లో వెదుకుతున్నారు. ఆయన ఇళ్లు, కార్యాలయాలతో పాటు బయో డైవర్సిటీ పార్క్ ఎదురుగా కొత్తగా కట్టిన లగ్జరీ ఆస్పత్రి అరాటే లోనూ సోదాలు చేశారు. అయితే ఆయన దొరకలేదు. ఆయన ఇంటికి మరో సారి నోటీసులు అంటించారు. విచారణకు హాజరు కావాలని ఆదేశించారు. ఒకప్పుడు ఐ ప్యాక్ ఉద్యోగి అయిన రాజ్ కసిరెడ్డి జగన్ హయాంలో ఐటీ సలహాదారు అయ్యారు. మద్యం బిజినెస్ మొత్తాన్ని తన చేతుల మీదుగా నడిపించాడు. మొత్తం లావాదేవీలన్నీ ఆయనకు తెలుసు. ఆయన కూడా పెద్ద ఎత్తున పోగేసుకున్నాడు. వందల కోట్ల ఆస్తి పరుడు అయ్యాడు. అన్ని ఆధారాలతో సీఐడీ అధికారులు ఆయనను విచారణకు పిలుస్తూంటే ఐటీ సలహాదారును తనకు మద్యంతో ఏం పని అని అడ్డగోలు వాదనలతో తప్పించుకునే ప్రయత్నం



చేశాడు. కోర్టులకు వెళ్లాడు కానీ.. ఎలాంటి చర్యలు తీసుకోకుండా ఆదేశించలేమని స్పష్టం చేసింది. అప్పట్నుంచి రాజ్ కసిరెడ్డి పరారీలో ఉన్నారు. సస్పెన్షన్ లో ఉన్న ఐపీఎస్ అధికారి సీతారామాంజనేయులు ఆయనకు సలహాదారుడిగా ఉంటూ పోలీసులకు దొరక్కుండా ఏం చేయాలో ఎలా చేయాలో సలహాలు ఇస్తున్నారన్న ప్రచారం జరుగుతోంది. రాజ్ కసిరెడ్డికి ఇప్పటికే లుకౌట్ నోటీసులు జారీ చేశారు. ఆయన దేశం దాటిపోయే అవకాశాలు దాదాపుగా ఉండవు. మరి ఇక్కడే ఉంటే పట్టుకోవడం పెద్ద విషయం కాదు. కానీ సీఐడీ అధికారులు పట్టుకోవడం లేదా లేకపోతే చిక్కడం లేదా అన్నదే సందేహం. ఎందుకంటే లిక్కర్ స్కాంలో ఇప్పటి వరకూ ఒక్క అరెస్టు కూడా సిఐడీ అధికారులు చూపించ లేదు.

# సమ్మర్‌లో సౌత్ ఇండియా టూర్ ప్యాకేజీలివి




ఈ వేసవి సెలవుల్లో దక్షిణ భారత్‌లో పర్యటిస్తారా? ఎక్కడికి వెళ్లాలో తెలియట్లేదా? అలాంటి వారి కోసమే ఐఆర్‌సీటీసీ సౌత్‌ఇండియా టూర్ ప్యాకేజీలు తీసుకొచ్చింది. హైదరాబాద్ నుంచి ప్రారంభయ్యే ఈ యాత్రల ప్యాకేజీ వివరాలపై ఓ లుక్కేయండి.. నచ్చితే విహారయాత్రకు సిద్ధమైపోవచ్చు.

### కాఫీ విత్ కర్ణాటక



కర్ణాటకలోకి కూర్గ్ పచ్చని ప్రకృతి అందాలకు నెలవు. కాఫీ తోటలు, అందమైన జలపాతాలు, చారిత్రక కట్టడాలు ఇలా ఎన్నో ఉన్నాయి. ఇక మైసూర్ రాజభవనం, చందనంతో చేసిన కళాఖండాలు ఆకట్టుకుంటాయి. ఈ రెండు ప్రాంతాలను చుట్టేసేందుకు 'కాఫీ విత్ కర్ణాటక' ప్యాకేజీని తీసుకొచ్చింది. ప్రతి బుధవారం కాచిగూడ నుంచి రైలు ఉంటుంది. ఈ ప్యాకేజీ రూ. 11,260 నుంచి ప్రారంభమవుతుంది.

**మొదటి రోజు:** కాచిగూడ రైల్వేస్టేషన్ నుంచి రైలు రాత్రి 7.05 గంటలకు బయలుదేరుతుంది. రాత్రంతా ప్రయాణం ఉంటుంది.

**రెండో రోజు:** ఉదయం 9.30 గంటలకు రైలు మైసూరు చేరుకుంటుంది. అక్కడి నుంచి కూర్గ్‌కు తీసుకెళ్తారు. మధ్యాహ్నం అక్కడి హోటల్‌లో బస చేసిన తర్వాత అబ్బె జలపాతం, ఓంకారేశ్వర ఆలయం సందర్శించొచ్చు. రాత్రి బస కూర్గ్‌లోనే ఉంటుంది.

**మూడో రోజు:** హోటల్‌లో బ్రేక్‌ఫాస్ట్ చేసిన తర్వాత తలకావేరి, భాగమండల, రాజా సీట్ పార్క్‌ను చూడొచ్చు. మూడో రోజు కూడా రాత్రి బస కూర్గ్‌లోనే ఉంటుంది.

**నాలుగో రోజు:** ఉదయం మైసూర్‌కి తీసుకెళ్తారు. ఆ దారిలో కావేరి నిసర్గధామ, టిబెటెన్ మానెస్ట్రీ, బృందావనం గార్డెన్స్ సందర్శించొచ్చు. రాత్రి బస మైసూరులోనే.

**ఐదో రోజు:** ఉదయం చాముండి హిల్స్, మైసూర్ ప్యాలెస్ చూపించి మధ్యాహ్నానికి రైల్వేస్టేషన్‌లో దింపుతారు. 3.15 గంటలకు రైలు మైసూర్ నుంచి కాచిగూడకు బయలుదేరుతుంది. రాత్రంతా ప్రయాణించి ఆరో రోజు ఉదయం 5.40గంటలకు కాచిగూడ చేరుకుంటుంది.

### అల్టిమేట్ ఊటీ

తమిళనాడులోని ప్రముఖ పర్యాటక ప్రాం తాలైన ఊటీ, కూనూర్ చూడాలనుకుంటే ఐఆర్‌సీ టీసీ 'అల్టిమేట్ ఊటీ' ప్యాకేజీ ఎంచుకోవచ్చు. ప్రతి మంగళవారం సికింద్రాబాద్ నుంచి ఈ పర్యాటక రైలు బయలుదేరుతుంది. ప్యాకేజీ ధర రూ.13,070 నుంచి ప్రారంభమవుతుంది.



**మొదటి రోజు:** మధ్యాహ్నం 12.20 గంటలకు సికింద్రాబాద్ స్టేషన్ నుంచి రైలు బయలుదేరుతుంది. రాత్రంతా ప్రయాణం ఉంటుంది.

**రెండో రోజు:** ఉదయం 7.57 గంటలకు కోయంబత్తూరు రైల్వేస్టేషన్ చేరుకుంటుంది. అక్కడినుంచి బస్సు/కారు/రైలు మార్గంలో ఊటీకి తీసుకెళ్తారు. మధ్యాహ్నం బొటానికల్ గార్డెన్, ఊటీ సరస్సు సందర్శించి.. అక్కడే రాత్రి బస చేయాలి.

**మూడో రోజు:** హోటల్‌లో బ్రేక్‌ఫాస్ట్ చేశాక దొడబెట్ట పీక్, టీ మ్యూజియం, ప్యాకార ఫాల్స్ చూడొచ్చు. మూడోరోజు కూడా ఊటీలోనే రాత్రి బస ఉంటుంది.

**నాలుగో రోజు:** ఉదయం కూనూర్‌కి తీసుకెళ్లి అక్కడి సందర్శక ప్రాంతాలన్నీ చూపించి సాయంత్రానికి ఊటీకి తీసుకొస్తారు.

**ఐదో రోజు:** ఉదయం బ్రేక్‌ఫాస్ట్ తర్వాత మధ్యాహ్నానికి కోయంబత్తూరు రైల్వేస్టేషన్ చేరుకొని 3.55 గంటలకు శబరి ఎక్స్‌ప్రెస్ ఎక్కిస్తారు.

**ఆరో రోజు:** మధ్యాహ్నం 12.45 గంటలకు తిరిగి సికింద్రాబాద్ చేరుకుంటారు.

### కోస్టల్ కర్ణాటక



కర్ణాటకలోని తీర ప్రాంతాలైన మురుడేశ్వర్, శృంగేరి, ఉడిపి ప్రాంతాలను 'కోస్టల్ కర్ణాటక' ప్యాకేజీలో భాగంగా సందర్శించొచ్చు. ప్రతి మంగళవారం కాచిగూడ రైల్వేస్టేషన్ నుంచి ఈ పర్యటక రైలు బయలుదేరుతుంది. ప్యాకేజీ ధర రూ.14,110 నుంచి ప్రారంభమవుతుంది.

**మొదటి రోజు:** కాచిగూడ రైల్వేస్టేషన్ నుంచి ఉదయం 6.05 గంటలకు కాచిగూడ-మంగళూరు సెంట్రల్ ఎక్స్‌ప్రెస్ రైలు బయలుదేరుతుంది. రాత్రంతా రైలులోనే ప్రయాణం ఉంటుంది.

**రెండో రోజు:** ఉదయం 9.30గంటలకు రైలు మంగళూరు స్టేషన్ చేరుకుంటుంది. అక్కడి నుంచి ఉడిపి తీసుకెళ్లి హోటల్‌లో బస ఏర్పాటుచేస్తారు. ఆ తర్వాత ఉడిపిలోని శ్రీ కృష్ణ దేవాలయం, మాల్పె బీచ్ చూడొచ్చు. ఉడిపిలోనే రాత్రి బస ఉంటుంది.

**మూడో రోజు:** ఉదయం కొల్లూరుకు వెళ్లి మూకాంబిక ఆలయం సందర్శించాలి. అనంతరం మురుడేశ్వర దేవాలయాన్ని, ఎత్తయిన రాజగోపురం, భారీ శివుడి విగ్రహాన్ని చూడొచ్చు. సాయంత్రానికి గోకర్ణ చేరుకోవాలి. అక్కడి దేవాలయం, బీచ్‌ను చూసి తిరిగి ఉడిపిలోనే రాత్రి బస చేయాల్సిఉంటుంది.

**నాలుగో రోజు:** ఉదయం ఉడిపి నుంచి హొర్నాడు చేరుకోవాలి. అక్కడ అన్నపూర్ణ ఆలయం చూసి శృంగేరికి వెళ్లాలి. శారదాంబ ఆలయం సందర్శించిన తర్వాత సాయంత్రానికి నిర్వాహకులు పర్యటకుల్ని మంగళూరుకి చేరుస్తారు. అక్కడే రాత్రి బస.

**ఐదో రోజు:** రోజంతా మంగళూరులోని మంగళదేవి, కద్రి మంజునాథ, కుంద్రోలి గోకర్నాథ ఆలయాలు, తన్నేర్భవి బీచ్ చూసి రైల్వేస్టేషన్‌కు చేరుకోవాలి. అక్కడ రాత్రి 7 గంటలకు రైలు సిద్ధంగా ఉంటుంది.

**ఆరో రోజు:** ఐదో రోజు రాత్రి, ఆరో రోజు పగలంతా ప్రయాణించి రాత్రి 11.40కి రైలు కాచిగూడ చేరుకుంటుంది.

### డివైన్ కర్ణాటక



కర్ణాటకలోని ప్రముఖ ఆలయాలు సందర్శించాలనుకుంటే 'డివైన్ కర్ణాటక' ప్యాకేజీ మంచి ఛాయిస్. ప్రతి మంగళవారం కాచిగూడ నుంచి ఈ రైలు అందుబాటులో ఉంటుంది. ప్యాకేజీ ధర రూ.14,090 నుంచి ప్రారంభమవుతుంది.

**తొలి రోజు:** కాచిగూడ రైల్వేస్టేషన్‌లో ఉదయం 6.05 గంటలకు కాచిగూడ-మంగళూరు సెంట్రల్ ఎక్స్‌ప్రెస్ బయలుదేరుతుంది. రాత్రంతా రైలులోనే ప్రయాణం.

**రెండో రోజు:** ఉదయం 9.30 గంటలకు మంగళూరుకు చేరుకున్నాక.. అక్కడి నుంచి నిర్వాహకులు ఉడిపికి తీసుకెళ్తారు. అక్కడ శ్రీకృష్ణ ఆలయం, మాల్పె బీచ్ చూసి అక్కడే రాత్రి బస చేయాలి.

**మూడో రోజు:** ఉదయం శృంగేరిలో శారదాంబ ఆలయం చూసుకొని మంగళూరు చేరుకోవాలి. రాత్రి అక్కడే బస ఉంటుంది.

**నాలుగో రోజు:** ఉదయం ధర్మస్థలలో మంజునాథ, కుక్కే సుబ్రమణ్యస్వామి ఆలయాలు సందర్శించి మంగళూరులోనే రాత్రి బస చేయాలి.

**ఐదో రోజు:** ఉదయం మంగళూరులోని మంగళాదేవి, కద్రి మంజునాథ ఆలయాలు చూసి, సాయంత్రం తన్నేర్భవి బీచ్, కుద్రోలి గోకర్నాథ ఆలయం సందర్శించుకోవాలి. రాత్రి 8.05 గంటలకు రైలులో తిరుగు ప్రయాణం ఉంటుంది.

**ఆరో రోజు:** ఐదో రోజు రాత్రి, ఆరో రోజంతా రైలులో ప్రయాణిస్తే రాత్రి 11.40కి కాచిగూడ చేరుకుంటారు.

### వండర్స్ ఆఫ్ వయనాడ్



కేరళ అందాలు చూసేందుకు ఐఆర్‌సీటీసీ 'వండర్స్ ఆఫ్ వయనాడ్' ప్యాకేజీ అందుబాటులో ఉంది. ప్రతి మంగళవారం కాచిగూడ నుంచి ఈ రైలు బయలుదేరుతుంది. ప్యాకేజీ ధర రూ. 14,950 నుంచి ప్రారంభమవుతుంది. **తొలి రోజు:** కాచిగూడ రైల్వేస్టేషన్ నుంచి రైలు ఉదయం 6.05 గంటలకు బయలుదేరుతుంది. రైలులోనే రాత్రంతా ప్రయాణించాలి.

**రెండో రోజు:** ఉదయం 6.17 గంటలకు రైలు కన్నూర్‌కు చేరుకుంటుంది. నిర్వాహకులు స్థానిక హోటల్‌లో బస ఏర్పాటు చేస్తారు. బ్రేక్‌ఫాస్ట్ చేశాక సెయింట్ అగ్నెలో కోట, అరక్కాల్ మ్యూజియం చూపించి.. వయనాడ్ తీసుకెళ్తారు. ఆ దారిలో ఉన్న పర్యటక ప్రాంతాల్ని చూడొచ్చు. ఆ తర్వాత కాల్పెట్ట చేరుకొని అక్కడే రాత్రి బస చేయాలి.

**మూడో రోజు:** ఉదయం కురువాద్వీప్, తిరునెల్లి ఆలయం, బాణాసుర సాగర్ డ్యామ్ చూశాక కాల్పెట్టలోనే రాత్రి బస ఉంటుంది.

**నాలుగో రోజు:** ఉదయం అంబలవయాల్ హెరిటేజ్ మ్యూజియం, సూచిపరా ఫాల్స్, ఎడక్కల్ కేవ్స్, సరస్సు చూసి కాల్పెట్టలోనే రాత్రి బస చేయాలి.

**ఐదో రోజు:** మధ్యాహ్నానికి కొయ్‌కోడ్ చేరుకొని కప్పాడ్ బీచ్ చూడొచ్చు. సాయంత్రం ఎస్.ఎం స్ట్రీట్‌లో షాపింగ్ చేసుకోవచ్చు. ఆ తర్వాత కొయ్‌కోడ్ రైల్వేస్టేషన్‌లో రాత్రి 11.35కి రైలు ఎక్కాలి.

**ఆరో రోజు:** రాత్రి 11.40కి కాచిగూడ చేరుకుంటారు.

### కేరళ హిల్స్ అండ్ వాటర్స్



కేరళలోని ఎత్తయిన కొండలు, జలపాతాలను పర్యటకులకు చూపించేందుకు తీసుకొచ్చిందే 'కేరళ హిల్స్ అండ్ వాటర్స్' ప్యాకేజీ. ప్రతి మంగళవారం సికింద్రాబాద్ నుంచి ఈ రైలు అందుబాటులో ఉంటుంది. ప్యాకేజీ ధర రూ. 14,720 నుంచి ప్రారంభమవుతుంది.

**తొలి రోజు:** సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి 11.28 గంటలకు శబరి ఎక్స్‌ప్రెస్ రైలు బయలుదేరుతుంది.

**రెండో రోజు:** మధ్యాహ్నం 12.55 గంటలకు అలువా రైల్వే స్టేషన్ చేరుకుంటుంది. అక్కడి నుంచి మున్నార్ తీసుకెళ్తారు. సాయంత్రం మున్నార్ మొత్తం చుట్టేసి రాత్రి అక్కడే బస చేయాలి.

**మూడో రోజు:** ఉదయం ఎరవికుళం జాతీయ పార్క్, టీ మ్యూజియం, మెట్టుపట్టి డ్యామ్, ఎకో పాయింట్ చూశాక మున్నార్‌లోనే రాత్రి బస ఉంటుంది.

**నాలుగో రోజు:** అలపుళ (అలెప్పీ) చేరుకొని బ్యాక్‌వాటర్ అందాలు వీక్షించొచ్చు. రాత్రి కూడా అక్కడే బస ఉంటుంది.

ఐదో రోజు: ఉదయం అలపుళ నుంచి బయలుదేరి ఎర్నాకుళం టౌన్ రైల్వేస్టేషన్ చేరుకోవాలి. 11.20 గంటలకు శబరి ఎక్స్‌ప్రెస్‌లో తిరుగు ప్రయాణం ఉంటుంది.

**ఆరో రోజు:** మధ్యాహ్నం 12.20 గంటలకు రైలు సికింద్రాబాద్ చేరుకుంటుంది.

ఈ ప్యాకేజీలన్నీ 5 రాత్రులు / 6 పగళ్లు ఉంటాయి. రవాణా, ఉదయం బ్రేక్‌ఫాస్ట్ ఖర్చులు నిర్వాహకులే భరిస్తారు. లంచ్, డిన్నర్ ఇతర అదనపు ఖర్చులన్నీ ప్రయాణికులే భరించాల్సి ఉంటుంది. మరిన్ని వివరాలను https://www.irctctourism.com లో సౌత్ ఇండియా ప్యాకేజీలను పరిశీలించవచ్చు.




# ధోనీ అరుదైన రికార్డు



**లఖ్‌నవూ :** సోమవారం లఖ్‌నవూతో, చెన్నైకు జరిగిన మ్యాచ్‌లో తన ధనాధన్ బ్యాటింగ్‌తో కేవలం 11 బంతుల్లో 26 పరుగులు చేసి ధోనీ ఔరా అనిపించాడు. ఈ అద్భుత ఇన్నింగ్స్‌తో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. ఐపీఎల్‌లో 11 సంవత్సరాల రికార్డును తిరగరాశాడు. అభిమానులు ముద్దుగా తలా అని పిలుచుకునే ఎంఎస్ ధోనీ ఖాతాలో మరో రికార్డు వచ్చి చేరింది. ఐపీఎల్ 2025 సీజన్‌లో భాగంగా సోమవారం లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ తో చెన్నై సూపర్ కింగ్స్ కు మ్యాచ్ జరిగింది. మొదట బ్యాటింగ్ చేసిన లఖ్‌నవూ 20 ఓవర్లకు 7 వికెట్ల నష్టానికి 166 పరుగులు చేసింది. తర్వాత ఛేదన ప్రారంభించిన చెన్నై సూపర్‌కింగ్స్ 19.3 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 168 పరుగులు చేసింది. ఇలా లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌పై చెన్నై సూపర్ కింగ్స్ 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది.

ఈ గెలుపులో ధోనీ కీలకపాత్ర పోషించాడు. తన ధనాధన్ బ్యాటింగ్‌తో కేవలం 11 బంతుల్లో 26 పరుగులు చేసి ఔరా అనిపించాడు. ఈ అద్భుత ఇన్నింగ్స్‌తో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ గా నిలిచాడు. ఐపీఎల్‌లో 11 సంవత్సరాల రికార్డును తిరగరాశాడు. ధోనీ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును 43 సంవత్సరాల 280 రోజుల్లో గెలుచుకొని రికార్డు సృష్టించాడు. ఐపీఎల్ చరిత్రలో ఈ అవార్డు గెలుచుకున్న అతిపెద్ద వయస్కుడిగా నిలిచాడు. ఇంతకుముందు ఈ రికార్డు ప్రవీణ్ తాంబే పేరిట ఉండేది. అతడు 2014 ఐపీఎల్ సీజన్‌లో రాజస్థాన్ రాయల్స్ తరపున ఆడుతూ కోల్‌కతా నైట్‌రైడర్స్ పై 42 సంవత్సరాల 208 రోజుల్లో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు.

**'ఇది ఆరంభం మాత్రమే'...**

'మా బౌలింగ్, బ్యాటింగ్ విభాగాలు చక్కగా ఆడాయి. మంచి ఆరంభం లభిస్తే ఛేదన సులభమవుతుంది. ఓపెనర్ షేక్ రషీద్ అద్భుతంగా ఆడాడు. అతడు మరిన్ని సంవత్సరాలు మా టీమ్‌లో భాగమవుతాడు. రషీద్ నెట్స్‌లో అటు స్పిన్నర్లు, ఇటు పేసర్ బౌలింగ్‌లోనూ చక్కగా ఆడాడు. ఇది కేవలం ప్రారంభం మాత్రమే. రషీద్‌లో చాలా టాలెంట్ ఉంది. అతడు అటాకింగ్‌గా, సాధికారికంగా ఆడగలడు. నిజానికి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అఫ్గాన్ స్పిన్నర్ నూర్ అహ్మద్ కు దక్కాలి. వాస్తవానికి నా కన్నా ఈ అవార్డుకు అతడే అర్హుడు. నూర్ అహ్మద్ చాలా చక్కగా బౌలింగ్ చేశాడు' అని ధోనీ... మ్యాచ్ అనంతరం ప్రజెంటేషన్ సెర్మనీలో మాట్లాడారు.



# వెంటాడిన గాయాలు .. కెరీర్‌కు బ్రేక్ !



**హైదరాబాద్:** యడ్లపల్లి ప్రాంజల... హైదరాబాద్‌కు చెందిన యువ టెన్నిస్ ప్లేయర్. కొన్నేళ్ల క్రితం వరకు చక్కటి ప్రదర్శనతో వరుస విజయాలు సాధిస్తూ సానియా మీర్జా తర్వాత ఆ స్థాయికి చేరుకోగల సత్తా ఉన్న అమ్మాయిగా గుర్తింపు తెచ్చుకుంది. కానీ ఇప్పుడు ఏ స్థాయిలో ఉంది? మే, 2019లో డబ్ల్యూటీఏ ర్యాంకింగ్స్‌లో ఆమె అత్యుత్తమంగా 265కు చేరుకుంది.

మరింత మెరుగైన ప్రదర్శనతో పైకి దూసుకు పోతూ మెరుగైన భవిష్యత్తుపై ప్రాంజల ఆట నమ్మకం కలిగించింది. కానీ ఆ తర్వాత ఒక్కసారిగా పరిస్థితి మారిపోయింది. 20 ఏళ్ల వయసులో ఆమె మళ్లీ మళ్లీ గాయాలపాలైంది. ఒక గాయం నుంచి కోలుకోగానే మరొకటి ఆమెను వెంటాడింది. 15 ఏళ్ల వయసులోనే ఐటీఎఫ్ స్థాయిలో వరుసగా టైటిల్స్ గెలిచిన ఆ అమ్మాయికి అసలు సమయంలో గాయాల విషయంలో సరైన మార్గనిర్దేశనం లేకుండా పోయింది. దాంతో కెరీర్‌లో ఎదుగుతున్న సమయంలో ఆమె ఆటకు ఒక్కసారిగా బ్రేక్ పడింది.

ఇప్పుడు 26 ఏళ్ల వయసులో డబ్ల్యూటీఏ ర్యాంకింగ్స్‌లో ప్రాంజల 1409వ స్థానానికి పడిపోయింది ! అంటే కెరీర్‌లో ఎదుగుతున్న కీలకమైన 20-25 మధ్య ఐదేళ్ల కెరీర్‌ను ఆమె దాదాపు పూర్తిగా నష్టపోయింది.

'నాకు ఇప్పటికీ టెన్నిస్ అంటే చాలా ఇష్టం. పునరాగమనం చేయాలని పట్టుదలగా ఉన్నాను. కానీ వెనక్కి తిరిగి చూసుకుంటే చాలా బాధ వేస్తుంది. గాయాలతో పాటు టోర్నమెంట్ షెడ్యూల్, ఫిట్‌నెస్‌వంటివాటిపై సరైన రీతిలో మార్గనిర్దేశనం లభించి ఉంటే పరిస్థితి ఎంత మెరుగ్గా ఉండేదో అనిపిస్తుంది' ఆమె ప్రాంజల వ్యాఖ్యానించింది.

**జిమ్ ఎక్సర్‌సైజ్‌లే సమస్యగా...**

ప్రాంజల మాత్రమే కాదు భారత టెన్నిస్‌లో ఎంతో మంది అమ్మాయిలు ప్రస్తుతం ఈ స్థితిని ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితికి కారణం భారత టెన్నిస్‌లో ముఖ్యంగా మహిళల టెన్నిస్‌లో ఇలాంటివి చూసేందుకు ఒక సరైన వ్యవస్థనే లేదు.

అసలు అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో పోలిస్తే ఫిట్‌నెస్ విషయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, స్ట్రెంత్ అండ్ కండిషనింగ్ ఎక్సర్‌సైజ్‌లు కూడా ఎంత వరకు చేయాలి, అవి పరిమితి దాటితే ఎలాంటి నష్టం కలిగిస్తాయో కూడా ఎవరూ చెప్పే పరిస్థితి లేదు.

అఖిల భారత టెన్నిస్ సంఘం (ఏఐటీఏ) వద్ద కూడా దీనికి సరైన సమాధానం లేదు. ఆటలో దూసుకుపోతున్న సమయంలో 'అతి'గా ఫిట్‌నెస్ ఎక్సర్‌సైజ్‌లు చేయడం కూడా ప్రాంజలను నష్టపర్చింది. ఒక మ్యాచ్‌లో 6-3, 5-2, 30-30తో విజయానికి బాగా చేరువైన సమయంలో కూడా అనారోగ్యంతో తప్పుకోవాల్సి రావడం ఆమె పరిస్థితిని చూపించింది.

'నేను టీనేజర్‌గా ఉన్నప్పుడు చాలా ఎక్కువగా ట్రైనింగ్ చేసేదానిని. జిమ్‌లో కూడా చాలా ఎక్కువగా బరువును ఎత్తేదానిని. దాని వల్ల ఏమైనా అయితే ఎలా కోలుకోవాలనే విషయంపై కనీస సమాచారం కూడా లేదు.

వెన్నునొప్పి, తుంటి నొప్పి, మోకాలు, మడమ... ఇలా ఒకదాని తర్వాత మరో గాయం వెంటాడింది. జిమ్‌లో బరువుల ప్రభావంతో కండరాలు బాగా బిగుసుకు పోయాయి. దాంతో శరీరంలో సమతుల్యత లభించింది. రెండు నెలలో తగ్గే గాయాలకు కూడా ఆరు నెలలు పట్టింది. నేను చేసిన ఎక్సర్‌సైజ్‌లతోనే నాకు బాగా నష్టం జరిగిందనే విషయం కూడా నాకు ఇటీవల అర్థమైంది. అంతకుముందు ఏమీ తెలీదు. తెలిస్తే జాగ్రత్త పడేదాన్ని' అని ప్రాంజల తన ఆవేదనను ప్రదర్శించింది.

**ఏఐటీఏ చొరవ చూపిస్తేనే...**

కొన్నేళ్ల క్రితం చైనా మహిళా టెన్నిస్ ప్లేయర్ల కోసమే ప్రత్యేకంగా ట్రైనింగ్ ప్రోగ్రామ్‌ను మొదలు పెట్టింది. ముఖ్యంగా తమ అగ్రశ్రేణి క్రీడాకారిణులకు అమిత ప్రాధాన్యతనిచ్చింది. ఇప్పుడు భారత్‌లో 16-24 వయసు మధ్య టెన్నిస్ ఆడుతున్న అమ్మాయిలకు కూడా అలాంటిది అవసరం ఉంది.

దీనిపై ఇప్పుడిప్పుడే డిమాండ్లు పెరుగుతున్నాయి. 'భారత మహిళా ప్లేయర్లు విడివిడిగా కాకుండా ఒక బృందంగా టోర్నీలకు వెళ్లటం మేలు చేస్తుంది. అప్పుడు ఏఐటీఏ వారి కోసమే ఒక కోచ్‌ను, ఫిజియోను పంపే అవకాశం ఉంటుంది. సరిగ్గా చెప్పాలంటే అమ్మాయిలకు 360 డిగ్రీ పర్యవేక్షణ అవసరం. న్యూట్రిషన్, మానసిక దృఢత్వం, మ్యాచ్‌ల విశ్లేషణ, సరైన షెడ్యూలింగ్, ప్రాక్టీస్‌కు స్పేర్ పార్ట్‌నర్‌లు...ఇలా అన్నింటి అవసరం ఉంది. రాబోయే రోజుల్లో భారత్‌లో పెద్ద సంఖ్యలో టోర్నీలు జరగబోతున్నాయి. ఈ నేపథ్యంలో వచ్చే 3-4 ఏళ్ల పాటు ప్రస్తుత ప్లేయర్లకు అండగా నిలవాల్సి ఉంది. లేదంటే ఈ ప్రతిభ వృథా అవుతుంది' అని ప్రముఖ టెన్నిస్ అడ్మినిస్ట్రేటర్ సుందర్ అయ్యర్ అభిప్రాయపడ్డారు. ఇప్పుడైనా ఏఐటీఏ మేల్కొనకపోతే ప్రాంజల కెరీర్‌ను దెబ్బ తీసిన అనుభవాలు మున్ముందూ ఎదురు కావచ్చు.

# మాట నిలబెట్టుకున్న టీమిండియా దిగ్గజం



## కాంబ్లీకి జీవితాంతం ఆర్థిక సాయం

అద్భుతమైన నైపుణ్యాలు ఉన్నా.. క్రమశిక్షణారాహిత్యం వల్ల అధఃపాతాళానికి పడిపోయిన క్రికెటర్ వినోద్ కాంబ్లీ. శతక శతకాల ధీరుడు సచిన్ టెండుల్కర్ స్థాయికి చేరుకోగల సత్తా ఉన్న ఆటగాడిగా నీరాజనాలు అందుకున్న ఈ ముంబై బ్యాటర్ కెరీర్‌తో పాటు.. వ్యక్తిగత జీవితంలోనూ విఫలమయ్యాడు.

చెడు వ్యసనాల కారణంగా ఆర్థిక ఇబ్బందులు, ఆరోగ్య సమస్యలతో సతమతమవుతూ చావు అంచులదాకా వెళ్లాడు. ఇటీవలి వినోద్ కాంబ్లీ పరిస్థితి మరింత దయనీయంగా మారగా.. 1983 వన్డే వరల్డ్‌కప్ విన్నింగ్ జట్టులోని దిగ్గజాలు అతడికి సాయం చేసేందుకు ముందుకు వచ్చారు. ఈ క్రమంలో టీమిండియా దిగ్గజ బ్యాటర్ సునీల్ గావస్కర్ కాంబ్లీకి ఇచ్చిన మాటను తాజాగా నిలబెట్టుకున్నారు. తన ఫౌండేషన్ చాంప్స్ ద్వారా అతడికి ఆర్థిక సహాయం అందించేందుకు రంగం సిద్ధం చేశారు. టైమ్స్ ఆఫ్ ఇండియా కథనం ప్రకారం.. గావస్కర్‌కు చెందిన 'చాంప్స్'.. కాంబ్లీ బతికి ఉన్నంత కాలం నెల నెలా రూ. 30 వేల ఆర్థిక సాయం అందించనుంది. అంతేకాదు.. వైద్య అవసరాల నిమిత్తం ఏడాదికి మరో ముప్పై వేలు అదనంగా ఇవ్వనుంది. కాగా కాంబ్లీ గురించి సునీల్ గావస్కర్ ఇండియా టుడేతో గతంలో మాట్లాడుతూ.. "1983 విన్నింగ్ జట్టు యువ ఆటగాళ్ల పరిస్థితిని ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉంటుంది. వాళ్లు మాకు మనుమల లాంటి వాళ్లు. ఇంకొంత మంది వయసు దృష్ట్యా మాకు కుమారుల లాంటివారు. అందుకే వారి పట్ల మాకు మమకారం ఉండటం సహజం. వారి పట్ల మా ప్రేమకు సాయం అనే పదం వాడటం సరికాదు. వినోద్ కాంబ్లీని మేము జాగ్రత్తగా చూసుకుంటాం. అతడిని కాపాడుకోవాల్సిన బాధ్యత మాపై ఉంది. కష్టాల్లో ఉన్న క్రికెటర్లను చూసే నవ్వే రకం కాదు మేము. మాకు తోచిన రీతిలో వారికి సహాయపడటమే మా ముందున్న కర్తవ్యం" అని పేర్కొన్నారు. ఇప్పుడు అందుకు తగ్గట్టుగానే తన వంతు సాయం అందించడం విశేషం. కాగా ఈ ఏడాది ఆరంభంలో అస్వస్థతకు గురైన వినోద్ కాంబ్లీ ఆస్పత్రి పాలైన విషయం తెలిసిందే. మూత్రనాళాల ఇన్‌ఫెక్షన్‌తో రెండు వారాల క్రితం కాంబ్లీ ఆస్పత్రిలో చేరగా... అతడి మెదడులో రక్తం గడ్డకట్టినట్లు వైద్యులు తెలిపారు. ఈ క్రమంలో రెండు వారాల చికిత్స అనంతరం కాంబ్లీ కోలుకుని జనవరిలో డిశ్చార్జ్ అయ్యాడు. ఈ క్రమంలో 1983 విన్నింగ్ కెప్టెన్ కపిల్ దేవ్ కాంబ్లీని పరామర్శించాడు. ఇక గావస్కర్ సైతం కాంబ్లీ ఆరోగ్య పరిస్థితి గురించి ఆరా తీశాడు.

ఇక సచిన్ టెండుల్కర్‌కు బాల్య మిత్రుడైన వినోద్ కాంబ్లీ.. ముంబై తరఫున దేశవాళీ క్రికెట్ ఆడాడు. ఈ క్రమంలో అంతర్జాతీయ క్రికెట్‌లో అడుగుపెట్టి 17 టెస్టులు, 104 వన్డేల్లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించాడు. తొమ్మిదేళ్ల పాటు(1991-2000) టీమిండియా తరఫున ఆడిన కాంబ్లీ.. టెస్టుల్లో 1084, వన్డేల్లో 2477 పరుగులు చేశాడు. అంతేకాదు.. టెస్టు క్రికెట్‌లో భారత్ తరఫున అత్యంత వేగంగా(14 ఇన్నింగ్స్‌లో) వెయ్యి పరుగుల మార్కు క్రికెటర్‌గా ఇప్పటికీ తన రికార్డును కొనసాగిస్తున్నాడు. కాంబ్లీకి భార్య ఆండ్రియా హెవిట్, కుమారుడు, కూతురు ఉన్నారు. కాగా ఆరోగ్య పరిస్థితి దృష్ట్యా మద్యం, పొగ తాగటం చాన్నాళ్ల క్రితమే మానేశానంటూ కాంబ్లీ ఇటీవలే వెల్లడించాడు.

# అమ్మవారికి బంగారు ఆభరణం బహూకరణ



**విజయవాడ, విశాఖ సమాచారం:** శ్రీ కనక దుర్గమ్మ వారికి లండన్ లో స్థిరపడిన వి. సీతారామిరెడ్డి పేరిట 30.500మిల్లీ గ్రాముల బంగారు నక్లెస్ ను వారి కుటుంబ సభ్యులు సమర్పించారు. మంగళవారం ఉదయం దాత కుటుంబ సభ్యులు దేవస్థానానికి విచ్చేసి ఆభరణం అందించారు. ఈ సందర్భంగా దాత కుటుంబీకులకు శ్రీ అమ్మవారి దర్శనం, ఆశీర్వచనం ఏర్పాటు చేసి, చిత్రపటం, ప్రసాదాలను దేవస్థానం అధికారులు అందించారు.



# ఫార్మా, చిప్స్‌పై ఆంక్షలకు ట్రంప్ సిద్ధం..



**ఇంటర్నెట్‌డెస్క్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఔషధాలు, చిప్స్‌పై దృష్టిపెట్టారు. వీటిని దిగుమతి చేసుకోవడం వల్ల జాతీయ భద్రతపై ఎలాంటి ప్రతికూల ప్రభావం పడుతుందనే అంశంపై దర్యాప్తును మొదలుపెట్టింది. ఔషధాలపై టారిఫ్‌లు విధించేందుకు ముందస్తుగా తీసుకొన్న చర్యగా దీనిని నిపుణులు చూస్తున్నారు. ఈ రెండు రంగాలు గణనీయంగా విదేశీ దిగుమతులపై ఆధారపడటం జాతీయ భద్రకు ముప్పు అనే కారణంతోనే పన్నులు విధించే అవకాశాలున్నాయి. ఈ విషయాన్ని సోమవారం ఫెడరల్ రిజిస్ట్రీ ఫైలింగ్‌లోను పేర్కొన్నారు. ప్రజల నుంచి అభిప్రాయాలు ఆహ్వానిస్తూ బుధవారం దీనిని పబ్లిష్ చేయనున్నారు. నాటినుంచి 21 రోజులపాటు సూచనలు, సలహాలు స్వీకరిస్తారు. ఈ ట్రంప్ వ్యాపార విస్తరణ చట్టం 1962లోని 232 సెక్షన్‌ను తన టారిఫ్‌లను సమర్థించుకొనేందుకు ఉపయోగించుకొనే అవకాశం ఉంది. ఈ చట్టం కింద వచ్చిన అధికారాల ఆధారంగానే రెండు రంగాలపై పన్నులు విధించాలని ట్రంప్ భావిస్తున్నారు. ఈ సెక్షన్ ప్రకారం ప్రారంభించే ఏ దర్యాప్తు అయినా 270 రోజుల్లో పూర్తికావాల్సి ఉంటుంది. తాజా ఫైలింగ్ ప్రకారం ఏప్రిల్ 1వ తేదీనే దర్యాప్తు మొదలైనట్లు తెలుస్తోంది. ఈ దర్యాప్తు ఔషధాలతోపాటు.. వాటిల్లో వినియోగించే ముడిపదార్థాలపై కూడా ఉంటుందని తాజా ఫైలింగ్‌లో పేర్కొన్నారు. ట్రంప్ టారిఫ్‌ల కారణంగా అమెరికాలో దిగుమతి సుంకాల సగటు కొన్ని నెలల్లోనే 2.5శాతం నుంచి 25శాతానికి పెరిగింది. ఇప్పటికే అమెరికా ఏప్రిల్ 5వ తేదీ నుంచి 10శాతం బేస్‌లైన్ టారిఫ్‌ను కూడా వసూలుచేయడం మొదలుపెట్టింది. ఇప్పటివరకు ఔషధాలు, సెమీకండక్టర్లను పన్నుల నుంచి మినహాయించారు. కానీ, ఆదివారం మాట్లాడుతూ వాటిపై ప్రత్యేక సుంకాలు ఉంటాయని ట్రంప్ ఇటీవల తేల్చిచెప్పారు. మరోవైపు ఫెడ్ సిబ్బంది ట్రంప్ నిర్ణయాలపై ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. వాటి ప్రభావం అమెరికాపై కొన్ని దశాబ్దాలపాటు ఉండొచ్చని అభిప్రాయపడుతున్నారు.




VISAKHA SAMACHARAM Telugu Daily. Edited, Printed, Published & Owned by : S.Veerabhadra Rao , Printed at Suryodaya Publications, VisakhaSamacharam Press Door No. 9-3-16, Pitapuram Colony, Visakhapatnam-3. Editorial Office : 9393949345, 9346363839, 9160190123
Hyderabad (Sai Ganesh) : Cell : 9030841841, Parawada (satyanarayana): Cell: 77804 33919, Srikakulam : Cell: 70321 98574, For advertisements (Raghunath) : 7013785256, Arilova (D.Venkatesh) : 94937 77390.
Maddilapalem (G.Raamakrishna) : 99084 24231, Anakapalli (M.Krishna Rao) : 63023 75539, Chintapalli (Srinivas) : 94923 40861.
Bheemunipatnam (B.Appalareddy) : 98662 78981, Srikakulam (Ramarao) : 70321 98574, Pithaapuram (staalin) : 94912 23264,

గమనిక : ఇక్కడ ఇవ్వబడిన పేర్లు కలిగిన వారిని మాత్రమే విశాఖ సమాచారమ్ దినపత్రికకు విలేఖరులుగా గుర్తించవలెను. ఇక్కడ పేరు లేకుండా ఎవరైనా విశాఖ సమాచారమ్ ప్రతినిధిగా చెబితే నమ్మవద్దు.